ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



వెల
4 అణాలు

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY


సంపుటము 42 సంచిక 14

నవంబరు 30 1949


★ 16వ ఆంధ్రరాష్ట్ర సహకారసభ: అనంతపురం ★



16 వ ఆంధ్రరాష్ట్ర సహకారమహాసభ, అనంతపురం. ప్రారంభకులు శ్రీ కె. వి. రమణయ్యనాయుడుగారు ఉపన్యసించుచున్నారు.



16 వ ఆంధ్రరాష్ట్ర సహకార మహాసభ, అనంతపురం. జాయంటు రిజిస్ట్రార్ కె. సుబ్రహ్మణ్యంనాయుడుగారి ఉపన్యాసం.




16 వ ఆంధ్రరాష్ట్ర సహకార మహాసభ, అనంతపురం—శ్రీ పి. రామాచార్యులు వారి స్వాగతోపన్యాసం.




16 వ ఆంధ్రరాష్ట్ర సహకారమహాసభ, అనంతపురం—శ్రీ రేబాల దశరథరామరెడ్డిగారి అధ్యక్షోపన్యాసం.


రసాయనిక ప్రయోగాలవల్ల వ్యవసాయయోగ్యంగాచేయబడిన చవిటిభూములు




తాటిచెట్లు మినహా గడ్డిపరకైనా మొలవని వట్టి చవిటిభూమి.



ఎకరానికి 10 టన్నుల చొ॥న జిప్సం సాల్టు ప్రయోగించినందువల్ల కలిగిన ఫలితం.



ఆ చవిటిపర్రలో యేవిధా యెరువులేకుండా నీళ్లు పెట్టి నాట్లువేస్తే కలిగిన ఫలితం చిదపచిదపలుగా తప్ప మొక్క అంటదు పెరగదు.



ఎకరానికి ఒకటన్ను చొప్పున గంధకం ప్రయోగించటంవల్ల కలిగిన ఫలితం అయితే ఇది చాలాఖర్చు అదికాక యీ ప్రయోగం చేసిన మరుసటి సంవత్సరం భూమిని బంజరుగా వదలవలసివుంటుంది.

ఆంధ్రపత్రిక

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ఒరు లేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్ (మహాభారతము)

సంపుటము 42

సంచిక 14


Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర మార్గశిర శుద్ధ దశమి బుధవారము



భారతీయ వస్త్రాలంకారాలు

అస్సాంలోని గౌరిపూర్‌కు చెందిన శ్రీమతి నీలిమభారువా భారతదేశంలో తయారైన కొన్ని జరీచీరెలను ప్రదర్శనార్థం లండన్ తీసుకొనివెళ్లింది. ఈ ప్రదర్శనం దక్షిణ కెన్సింగ్టన్‌లోని ఇంపీరియల్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగింది. శ్రీమతి నీలిమ ఈ చీరెలను ఇద్దరు భారతీయ మహిళలకు చూపించి ముచ్చటిస్తున్నది. వీరు బెనారస్ సిల్కు జరీ చీరె సింగారించిన శ్రీమతి సుగుణ ఆశాదేవి అస్సాంజాతి పద్ధతిలో చీరె ధరించిన శ్రీమతి కాంచనమాలగారలు.



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ నవంబరునెల 30-వ తేదీ బుధవారము

నవశకారంభము

"భారతదేశమును సర్వాధికార సమన్వితమైన స్వతంత్ర ప్రజాస్వామ్య రాజ్యముగ ప్రకటించుటకును, భారతదేశభవిష్యత్పరిపాలన కొరకు రాజ్యాంగమును తయారుచేయుటకును పరిషత్తు కృతనిశ్చయమై యున్నదని ఇందుమూలముగ ప్రకటించుచున్నాము... ఈ చట్టముప్రకారము సర్వాధికార సమన్వితమైన స్వతంత్ర భారత రాజ్యముయొక్కయు, అందలి అంతర్భాగముల అధికారము యావత్తు ప్రజలహస్తగతమై యుండును. భారతీయప్రజలు అందరికి సాంఘిక, ఆర్థిక, రాజకీయవిషయములలో సంపూర్ణమైన న్యాయము జరిగించగలమని హామీ నివ్వవలయును. ప్రతి వ్యక్తికి సమానహోదా, సమానావకాశములు కల్పింపబడవలయును. న్యాయశాస్త్ర దృష్ట్యా, భారతీయులు అందరు సమానులుగ పరిగణించబడవలెను. ప్రతి వ్యక్తికి న్యాయనైతికనియమముల సరిహద్దులలో భావనాస్వాతంత్ర్యము, వాక్స్వాతంత్ర్యము, మత, దేవతారాధనవృత్తిస్వాతంత్ర్యములు, సమ్మేళనా స్వాతంత్ర్యము, కార్య స్వాతంత్ర్యము ఒసంగబడగలవని అభయమివ్వవలెను."

రెండుసంవత్సరముల క్రితము రాజ్యాంగరచనకు ఉపక్రమించుటకు పూర్వము స్వతంత్రభారతరాజ్యాంగము సాధింపవలసియున్న ప్రధాన లక్ష్యములను చరిత్రాత్మకమైన లక్ష్యతీర్మానమునందు పైవిధముగ భారత రాజ్యాంగపరిషత్తు పేర్కొనియుండెను. పరిషత్తులక్ష్యతీర్మానమును ఆమోదించినప్పటి పరిస్థితులకును, రాజ్యాంగ రచనాకార్యక్రమమును ప్రారంభించినప్పటి పరిస్థితులకును విశేషభేదము ఉండుటవలన నిన్నటిదినము భారత రాజ్యాంగపరిషత్తు సమధికోత్సాహముతో ఆమోదించిన భారతరిపబ్లిక్ రాజ్యాంగము అనేకవిషయములందు లక్ష్యతీర్మానమునందలి సూత్ర, సిద్ధాంతములకు భిన్నముగ నుండుట జరిగినది.

తమ రాజ్యాంగ చట్టము సాయిదాను సమర్థించుకొనుచు రచనాసంఘ సభ్యులు పలువురు ప్రకటించినట్లు ఏ రాజ్యాంగము అన్ని కాలములకు తగినట్లు, ఆదర్శప్రాయముగ నుండజాలదు. రాజ్యాంగము ఆదర్శప్రాయముగ, లోపరహితముగ నున్నను అట్టి రాజ్యాంగమును అమలుజరుపువారు దేశాభ్యుదయమును, ప్రజాశ్రేయస్సును, జాతిక్షేమమును ప్రధానముగ పరిగణించి వ్యవహరింపకున్న, అట్టి రాజ్యాంగము నిరుపయోగము, నిష్ప్రయోజనము అగును. తృతీయప్రతిపాదనపై జరిగిన చర్చకు సమాధాన మొసగుచు రచనాసంఘ అధ్యక్షుడు డా॥ అంబేడ్కర్ ఈ సత్యమునే అనేక పర్యాయములు హెచ్చరించిరి.

1950 జనవరి 26 న నూత్నరాజ్యాంగము అమలుజరుగుటతో భారతదేశమున నవశకారంభమగును. రాజకీయముగ భారతసమితిపౌరులందరును సమానులగుదురు. రాజకీయమైన తరతమభేదములు అంతరించి రాజకీయప్రజాస్వామ్య మేర్పడును. కాని రాజ్యాంగపరిషత్తు లక్ష్యించినది, స్వతంత్రభారతమున కాంగ్రెసుస్థాపింప సంకల్పించినది సంపూర్ణమైన ఆర్థిక, సాంఘిక, రాజకీయ ప్రజాస్వామికము-కోఆపరేటివ్ కామన్వెల్తు. ఆ మహదాశయసిద్ధికి ఈ రాజ్యాంగము సాధనమాత్రమే. ఈ సాధనను సద్వినియోగము చేసుకొని ఆపవిత్రాశయమును సాధింపవలసిన బాధ్యత భారతీయులు అందరిపైనను గలదు. రాజ్యాంగరచనాసంఘ అధ్యక్షుడు డా॥ అంబేడ్కర్ హెచ్చరించినట్లు భారతీయపౌరుడు ప్రతి ఒక్కడు స్వార్థమును, తన వర్గ అపేక్షలను త్యజించి దేశాభ్యుదయమునే ప్రధానముగ యెంచి కృషి చేసిన గాని దేశస్వాతంత్ర్యము, రాజకీయ ప్రజాస్వామ్యము స్థిరముగ నుండజాలదు. కాని ముందు సాధింపవలసిన సామాజిక ప్రజాస్వామ్యమును ఏర్పరచుటలో డా॥ అంబేడ్కర్ ప్రజలు చట్టబద్ధమైన మార్గములనే అనుసరించవలసియున్న దనుచు సాత్వికనిరోధము, సత్యాగ్రహములగురించి చేసిన విమర్శ అప్రస్తుతమే గాక వారికి పరిషత్తు చేసిన గౌరవమునకు తగియుండలేదు.

నవంబరు 26 స్వతంత్ర భారత చరిత్రయం దొక ప్రసిద్ధ దినముగ పరిగణింపబడగలదు. రాజ్యాంగ పరిషత్తు 35 మాసములు చర్చించి తయారుచేసిన రాజ్యాంగము ఆమోదింపబడి శాసనమైనది. భారతదేశమున తిరిగి ప్రజాస్వామికయుగము ప్రారంభమైనది. ప్రజల బాధ్యతలు అధికమైనవి. ఈ బాధ్యతను ప్రజలు సక్రమముగ నిర్వహించిన స్వతంత్ర భారతరిపబ్లిక్ సుస్థిరమై ప్రపంచ రాజ్యములందు ప్రముఖస్థానమును పొందగలదు.

హైదరాబాద్ నవాబు ఫర్మానా

హైద్రాబాద్ సంస్థానమునందు ప్రబలిన దుష్టశక్తుల సంహరించి, సంస్థాన పరివ్యాప్తమై యున్న దుష్పరిపాలనమును తుద ముట్టించి ప్రభుత్వ వ్యవహారములందు ప్రజలకు భాగస్వామ్యము కల్పించుటకు దాదాపు సంవత్సరముక్రితము భారతప్రభుత్వము జరిపిన పోలీసుచర్యలక్ష్యము మొన్నటిదినము హైదరాబాదు నవాబుగారు తమ సంస్థానమును భారతసమితిలో చేర్చుచు, రాజ్యాంగపరిషత్తు నేడామోదించు భారత రిపబ్లిక్ రాజ్యాంగము తమ సంస్థానమునకు వర్తింపజేయుచు చేసిన ఫర్మానాతో పూర్తిగ సిద్ధించిన దని చెప్పవచ్చును. ఒక్క హైదరాబాదుసంస్థానముతప్ప భారత ప్రభుత్వమునకు అధికారము దఖలు పరచినట్టియు, భారతప్రభుత్వముతో యథాతథపు ఒడంబడికలు చేసుకొనినట్టియు సంస్థానములన్నియు గత మాసము 14 వ తేదీనాటికే భారతసమితి అంతర్భాగములైనవి. తత్ఫలితముగ రాజ్యాంగపరిషత్తు నూతన రాజ్యాంగము భారతరాష్ట్రములకు వర్తించినట్లే భారతసంస్థానములకును వర్తించునట్లు నిర్ణయము చేసెను. ఏ సంస్థానము ఇందుకు భిన్నమైన మార్గమును అనుసరించుట జనవరి 26 వ తేదీ అనంతరము సాధ్యము గాదు. ఇతః పూర్వము జరిగియుండిన ఒప్పందములు, ఒడంబడికలు చట్టబద్ధమగుటకు అన్యమార్గములేదు. కనుకనే హైదరాబాద్ నవాబుగారు 1947 ఆగస్టు 15 అనంతరము ప్రవర్తించినట్లు గాక, ఇపుడు వాస్తవికదృష్టితో-కాలానుగుణ్యముగ వ్యవహరింపవలసివచ్చెను. అధికార దఖలుపత్రముపై నైజాం సంతకము చేయుటతో సంస్థానము భారతసమితియందు చేరిపోయినది. ఇందువలన హైదరాబాద్ సమస్యల పరిష్కారము సుకరమైనది. రాజ్యాంగపరిషత్తు ఏర్పడి, సంస్థానమునకు వేరొక రాజ్యాంగమును తయారుచేయవలసిన యవసరము ఇక లేదు. నవాబుగారి నిర్ణయమును రాజ్యాంగపరిషత్తు అంగీకరింపవలసియున్నను, అట్టి ఆమోదమునకు పూర్వము జరుగవలసిన కార్యకలాపమంతయు నైజాంఫర్మానాను అనుసరించి జరుగ వీలగును. ఈ ఫర్మానానుపురస్కరించుకొని ప్రస్తుతము భిన్నముగ నున్న సంస్థాన ఆర్థికవ్యవస్థను భారతదేశ ఆర్థిక వ్యవస్థలో లీనము చేయుటకు వీలుగ సంస్కరింపవచ్చును. ఈ విధముగ జనవరి 26 వ తేదీన స్వతంత్రభారతరిపబ్లిక్ అవతరణతోబాటు ప్రజాస్వామిక హైదరాబాదు సంస్థానము కూడ అవతరింపగలదు. అంతియే గాక, హైదరాబాద్ సంస్థానము ముందుగనే భారతసమితియందు చేరుటవలన మున్ముందు, రాజ్యాంగ పరిషత్తు నిర్ణయముప్రకారము సంస్థానమును వివిధభాషాప్రాంతములుగ విభజించి సంశ్లిష్ట భాషారాష్ట్రములతో చేర్చివేయుట సులభమగును.

గత సెప్టెంబరు 18 వ తేదీన పోలీసుచర్య పరిసమాప్తమైనప్పటినుండియు సంస్థానపరిపాలన మిలిటరీగవర్నరు పరముగ నుండెను. మిలిటరీగవర్నరు పదవిని రద్దుచేసి భారతప్రభుత్వము పౌర పరిపాలనాధికారిగ శ్రీ యం. కె. వెల్లోడిగారిని నియమించియుండెను. నవాబుగారు గురువారము జారీచేసిన ఫర్మానా ఈ మార్పుకు అనుగుణముగ నున్నది. ఆ ఫర్మానాయందు నవాబుగారు పేర్కొనినట్లు సామాజిక, ఆర్థిక, రాజకీయవిషయములలో హైదరాబాదుసంస్థానమునకు భారతదేశముతో సన్నిహితసంబంధములు గలవు. ఏ రీవిషయమును 1947 ఆగస్టు 15 నాడైనను, అథమము 1948 సెప్టెంబరు 13 కు పూర్వమైనను గ్రహించియుండిన, హైదరాబాద్ సంస్థానముకూడ ఈసరికి ఇతర సంస్థానముల స్థాయిని పొందియుండెడిది. భారతప్రభుత్వమునకొక సంకటస్థితి నివార్యమైయుండెడిది. సంస్థానప్రజలు కష్ట, నష్టములను అనుభవింపవలసిన పరిస్థితులు ఏర్పడియుండెడివి కావు. సంస్థానమున కమ్యూనిస్టు చర్యలు ప్రబలుటకు అవకాశము ఉండెడిది గాదు.

గతమునందెన్ని విషాదసంఘటనలు జరిగినను, తుదకు అన్ని వ్యవహారములు సవ్యముగ, సంస్థానప్రజలక్షేమాభివృద్ధిదృష్ట్యా పరిష్కారమగుట శుభసూచకము. ఇట్టి నిర్ణయమునకు వచ్చిన నవాబుగారు అభినందనీయులు.

ముఖచిత్రం

ఇటికల తయారీ

ఛాయాచిత్రకారుడు:—

ఎస్. కృష్ణన్ మద్రాసు.

మనరాష్ట్రం : మనదేశం :

భారతరాజ్యాంగరచనా కర్తవ్య సమాప్తి



డా॥ అంబేద్కర్

భారతదేశ రాజ్యాంగ రచనా కర్తవ్యం సమాప్తిచెందింది. 1946 డిసెంబరు 9 వ తేదీని డా॥ సచ్చిదానంద సింహాగారి అధ్యక్షత క్రింద రాజ్యాంగపరిషత్సభ ప్రారంభమయింది. ఆరోజునే డా॥ రాజేంద్రప్రసాద్ సభాధ్యక్షులుగా ఎన్నికైనారు. అదిమొదలు రెండేళ్ల పదకొండు మాసాల 17 రోజులకు, అనగా 1949 నవంబరు 26 వ తేదీకి పరిషత్సభ కార్యం పూర్తిఅయింది. మొత్తం 165 రోజులు చర్చ జరిగింది.

1947 ఆగస్టు 29 వ తేదీని రాజ్యాంగరచనా సంఘం ఎన్నికయింది. దీనికి భారతప్రభుత్వ న్యాయశాఖామంత్రి డా॥ అంబేద్కర్ గారు అధ్యక్షులుగా ఎన్నికైనారు. ఆరంభంలో రాజ్యాంగనిర్మాణ సలహాదారు సర్ బి. యన్. రావుగారు 243 నిబంధనలు గల రాజ్యాంగ ముసాయిదా తయారుచేశారు.

సభాప్రారంభంలో పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రతిపాదించిన ఆశయనిర్వచనతీర్మానంలోని సూత్రాలననుసరించే ఈముసాయిదా తయారయింది. ఈముసాయిదా ఆధారంతో రాజ్యాంగరచనాసంఘం 315 నిబంధనలుగల ముసాయిదాను తయారుచేసింది. సర్. బి. యన్. రావుగారి ముసాయిదాలో 13 అనుబంధాలున్నాయి. రచనాసంఘంవారి ముసాయిదాలో 8 అనుబంధాలు చేర్చబడినాయి. సభలో చర్చ అనంతరం సవరణకాగా మొత్తం 395 నిబంధనలు వచ్చాయి. సభ్యులు ప్రతిపాదించిన 7635 సవరణల్లో 2473 సవరణలు మాత్రమే చర్చించబడినాయి. నవంబరు 22 వ తేదీకి మొత్తం రు 63,96,729 ఖర్చయింది.

ఏడు నిబంధనలుమాత్రమే గల అమెరికన్ రాజ్యాంగనిర్మాణానికి నాలుగుమాసాలు పట్టింది. 153 నిబంధనలుగల దక్షిణాఫ్రికా రాజ్యాంగనిర్మాణానికి ఒక సంవత్సరం పట్టింది. 147 నిబంధనలుగల కెనడారాజ్యాంగనిర్మాణానికి రెండేళ్ల అయిదుమాసాలు పట్టింది. 128 నిబంధనలు గల ఆస్ట్రేలియన్ రాజ్యాంగనిర్మాణానికి తొమ్మిదేళ్లుపట్టింది. వీనితో పోలిస్తే భారతరాజ్యాంగనిర్మాణానికి అట్టే జాప్యంకాలేదని చెప్పవచ్చును. ఇదిగాక మిగతా రాజ్యాంగనిర్మాణాల సందర్భంలో పరిషత్సభ్యులందరికీ సవరణలు ప్రతిపాదించే అవకాశం లేదు.

రాజ్యాంగ పత్రంపై నవంబరు 26 వ తేదీని అధ్యక్షులు డా॥ రాజేంద్రప్రసాద్ గారి సంతకం కావడంతో ఆపత్రానికి అధికారబలం ప్రాప్తించింది. వచ్చే స్వాతంత్ర్యదినోత్సవం నాడు, అనగా 1950 జనవరి 26 వ తేదీని ఈరిపబ్లికన్ రాజ్యాంగం అమలులోకి వస్తుంది. ఈరాజ్యాంగంలోని కొన్ని నిబంధనలు నవంబరు 26తోనే అమలులోకి వచ్చాయి. మొత్తం రాజ్యాంగపత్రంపై వోటింగు జరిగినప్పుడు ఇద్దరు తప్ప మిగతా సభ్యులందరూ ఆమోదం ప్రకటించారు.

నిత్యపరిణామం:

దేశీయ రాజ్యాంగాలు నిత్యపరిణామదశలో ఉంటాయనేది ప్రజాస్వామ్యవాదులందరూ అంగీకరించిన విషయం. కాలానుగుణమైన మార్పులకు అవకాశమిచ్చే రాజ్యాంగమే చిరకాలం మనగలదు. అట్టి అవకాశమివ్వని రాజ్యాంగాన్ని అనుసరించేదశాల్లో ప్రభుత్వాలపట్ల ప్రజల ఆదరం లభించడం దుర్ఘటమౌతుంది. విప్లవాలు సంభవించే అవకాశం ఉంటుంది. కాని మార్పులకు మితిమీరి అవకాశమిచ్చే రాజ్యాంగాలలో రాజకీయపక్షాలను బట్టి, పరిస్థితులనుబట్టి నియంతృత్వం మొదలు అరాచకంవరకూ సర్వదశలకూ తావు లభిస్తుంది రష్యన్ రాజ్యాంగమే దీనికి తార్కాణం. కాలానుగుణమైన మార్పులకు అవకాశమిచ్చే దృష్టితో నిర్మించే రాజ్యాంగాలలో నిబంధనలకు బహు నిర్వచనాలు ఆపాదించడానికి అవకాశముంటుంది.

భారత రాజ్యాంగం ఈ రెండు పక్షాలకూ మధ్యే మార్గంలో ఉందని చెప్పాలి

ఈ నూతనరాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలనే సోషలిస్టులు కమ్యూనిస్టులు విమర్శిస్తున్నారు. కాని పదేళ్ల అనంతరం పార్లమెంటులో మూడింట రెండుశంతులమంది సభ్యుల అంగీకారంతో రాజ్యాంగానికి సవరణలు ప్రతిపాదించడానికి వీలివ్వబడినందువల్ల విమర్శకులు చింతించవలసిన అగత్యంలేదు. మిగతా ప్రజాసామ్యదేశాల రాజ్యాంగాలలో వలెనే భారతరాజ్యాంగంలోకూడా సవరణకీ సౌకర్యం ఇవ్వబడింది

రాజ్యాంగసంరక్షణ:

ఏ రాజ్యాంగం గాని ప్రజల కుపకరించేదీ ఉపకరించనిదీ దేశకార్య నిర్వహణపైన ఆధారపడి ఉంటుంది. ఎంతటి మంచి రాజ్యాంగం నిర్మాణమైనప్పటికీ, నిర్వహించేవారు సమర్థులు కాకపోయినా, లేక వారికి రాజ్యాంగంపట్ల విశ్వాసం ఆదరం లోపించినా అది ప్రజలకు ఉపకరించజాలదు. అందువలన రాజ్యాంగం సక్రమంగా నిర్వహించబడ్డానికి కొన్ని రక్షణలవసరమౌతాయి. రాజకీయాధికారాన్ని నిర్వర్తించే రాజకీయపక్షాలుగాని వ్యక్తులుగాని రాజ్యాంగనిబంధనల్ని అతిక్రమించకుండా నిరోధించగల అధికారం నాలుగుసంస్థలకు ఇవ్వబడాలి. 1 న్యాయవిచారణశాఖ 2 ప్రభుత్వాదాయవ్యయపరిశీలకశాఖ 3. ప్రభుత్వోద్యోగనియామకసంస్థ 4 ఎన్నికలశాఖ.

భారతరిపబ్లికన్ రాజ్యాంగంలో ఈనాలుగింటిలోనూ మొదటి రెండింటికీ తగు అధికారాలివ్వబడినాయి. ప్రభుత్వాధికారానికి వారు లొంగిపోవలసివస్తుందనే భయానికి తావు లేదు. కాని మిగతా రెండు విషయాల్లోనూ రాజ్యాంగనిర్మాతలు అవసరమైనంత జాగ్రత్త వహించలేదని చెప్పాలి. ఎన్నికలశాఖవిషయంలో లోపం అధికంగా ఉన్నట్లు గోచరిస్తుంది.

రాజకీయపక్షాలుగాని ప్రభుత్వంగాని ఈరెండుశాఖల నిర్వహణలోనూ జోక్యం చేసుకోకుండా నిరోధించడానికి తగిన జాగ్రత్త వహించలేదని అనుమానం కలుగుతున్నది.

చర్చ తృతీయఘట్టంలో కొందరు సభ్యులు కేంద్ర ప్రభుత్వాధికారాధిక్యత గురించీ, పౌరస్వత్వాలపై నిర్బంధాలనుగురించీ ప్రమాద పరిస్థితుల్లో ప్రభుత్వాలకిచ్చిన అసాధారణాధికారాలను గురించీ, విమర్శలు చేశారు. కొందరు అల్పసంఖ్యాకవర్గాల సంరక్షణకు కావలసినంత శ్రద్ధ తీసుకోలేదని విమర్శించారు. మనదేశ పరిస్థితుల్ని బట్టిచూస్తే ఈ విమర్శలలో చాలభాగం నిరాధారమైనవని చెప్పవచ్చును. ప్రమాద పరిస్థితుల్లో అసాధారణాధికారాలు ప్రభుత్వాలు తీసుకోవడం అవసరమని అన్ని దేశాలూ ఆమోదించిన సిద్ధాంతమే. పౌరస్వత్వాల విషయంలో సాంఘిక జాతిమతాది వివక్షత లేవీ పాటించలేదు. సర్వజనులు సమానులని నిర్వచించబడింది.

అయితే వ్యక్తిగత స్వత్వాలను సంఘంపట్ల, దేశంపట్ల, ప్రభుత్వంపట్ల వ్యక్తులు పాటించవలసిన బాధ్యతల కనుగుణంగా పరిమితం చెయ్యబడినాయి. ఏ నాగరికసంఘంలోగాని ఇది అవసరమనేది సర్వజనసమ్మతమైనసత్యం. గాంధీ మహాత్ముని ఆదేశం ఈ విషయంలో పూర్తిగా పాటించబడింది. పోగా అసాధారణ పరిస్థితుల్లో వ్యక్తిగత స్వత్వాలపై ప్రభుత్వం విధించగల ప్రత్యేకనిర్బంధాలు అవసరం లేనంత కఠినంగా ఉన్నాయని కొందరు విమర్శించారు. ఈ విషయాలలో న్యాయస్థానాల విచారణకు నిర్ణయాలకు అధికారావకాశాలు ఇచ్చి ఉండవలసిందని పిస్తున్నది.


పురోవృద్ధి:

దేశపురోవృద్ధికి ఈనూతన రాజ్యాంగం రాజకీయరీత్యా సర్వావకాశాలిస్తోంది. దేశ పరిపాలనకై ఉత్తమయంత్రాంగం నిర్మించడానికి ఈరాజ్యాంగం తోడ్పడుతుంది. తద్వారా ఆర్థిక సాంఘిక పురోవృద్ధికి కూడా తోడ్పడవచ్చును. అయితే రాజకీయ వ్యవస్థానిర్మాణానికి సిద్ధాంతాలను నిర్వచించినంత సుస్పష్టంగా ఆర్థిక సాంఘిక వ్యవస్థలగురించి చెయ్యలేకపోయింది. ఆర్థికంగా గాని సాంఘికంగాగాని ఎట్టి వ్యవస్థను నిర్మించడానికి వీలవుతుందో నిరూపించడం కష్టం. దుర్వ్యవస్థలకు తావు లేకుండా సంరక్షించడానికి ప్రభుత్వ మేరీతిగా జాగ్రత్తవహించగలదో తెలియడంలేదు. దేశంలో వ్యాపారుల ప్రాబల్యం పెరిగిపోతున్నప్పుడు, ఆర్థికంగా కొన్ని వర్గాలవారిని మరకొన్ని వర్గాలు శాసించగల పరిస్థితి వస్తే, ఆబలాన్ని వారు దుర్వినియోగపరిచినట్లయితే ప్రభుత్వం ప్రజల నేరీతిగా సంరక్షించగలదో తెలియదు. రాజకీయంగా ఇటువంటిలోపం ఉండటంవల్లనే రష్యన్ రాజ్యాంగంలో నియంతృత్వానికి అవకాశమేర్పడింది ఆర్థికంగా ఇటువంటి లోపం ఉన్నందువల్లనే అమెరికాలో ఒక వైపున పారిశ్రామికులు, వ్యాపారులు కోటీశ్వరులు కావడానికీ, ఒక వైపున అనేకమంది దారిద్ర్యం అనుభవిస్తుండగా మరొక వైపున వ్యాపారులు ప్రభుత్వధనసహాయంతో నష్టం భర్తీచేసుకుని ఆహారవస్తువుల్ని సముద్రంపాలు చెయ్యడానికి అవకాశమేర్పడింది.

ఉత్కృష్ట సాధన:

గాంధీజీ ఆశీర్వాదబలంతో రాజ్యాంగపరిషత్సభ అస్పృశ్యతనూ మతవివక్షతలనూ నిర్మూలించగలిగింది. సార్వజనీనమైన నియోజకవర్గాలను నిర్మించి దేశపరిపాలనకు సర్వజనామోదాన్ని ప్రాపింపచేయగల అవకాశమిచ్చింది. నిర్భయంగా నిష్పక్షపాతంగా నేర విచారణ జరగడానికీ, తగవుల పరిష్కారం జరగడానికీ ప్రజలకు న్యాయం చేకూర్చడానికీ అవకాశమివ్వబడింది. దేశాన్ని పీడించి రక్తపాతానికి దారితీసి చివరికి దేశాన్ని ఖండాలుగాచేసిన మతోన్మాదం తిరిగి తలెత్తకుండా జాగ్రత్త తీసుకున్నారు.

ఎన్నికలు, పరిపాలనాధికారుల విషయంలో డా॥ రాజేంద్రప్రసాద్ చెప్పినట్లు ఒక పెద్ద లోపం మాత్రం ఉంది. శాసనసభలో సభ్యత్వానికి ఎన్నికల్లో పోటీ చెయ్యదలచినవారికి కొంత కనీసవిద్య, పరిపాలనావిషయ పరిజ్ఞానం ఉండాలనే నిర్బంధం విధించబడలేదు. శాసనాలను వర్తింపచెయ్యవలసిన ప్రభుత్వోద్యోగులకు ఈ అర్హతలను పాటించి, శాసనాలను నిర్మించి సంస్కరించే శాసనసభ్యులకు ఇటువంటి నిర్బంధాలను పాటించకపోవడంవల్ల నిజంగా చాలా నష్టం కలుగుతుంది. ఈనిర్బంధం విధించబడనంతవరకూ రాజ్యాంగనిర్వహణ లోపభూయిష్టంగానే ఉంటుందని డా॥ రాజేంద్రప్రసాద్ అన్నారు.



రాజే [illegible]

రాజ్యాంగం ఏరీతిగా ఉన్నప్పటికీ రాజ్యాంగాన్ని అమలుజరిపే నాయకులపైనే దేశం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అమెరికా ఈనాడు ఉచ్చదశలో ఉందంటే వాషింగ్టన్, లింకన్వంటి మహాపురుషులే కారకులు. బ్రిటనులో రాజనీతి, పౌరనీతి ఉచ్చదశలో ఉన్నాయంటే లిబరల్నాయకుల ప్రభావం కారణం. రష్యా బలవత్తరమైన దేశం కాగలిగిందంటే లెనిన్, స్టాలిన్ల కృషికి అది ఫలితం. భారతదేశంలో కాంగ్రెస్పట్ల మొన్నమొన్నటివరకు ప్రజానీకానికి భక్తిభావం ఉన్నదంటే గాంధీజీ ప్రభావం హేతువు. అదేరీతిగా మన రాజ్యాంగం దేశాన్ని ఉన్నతికి తేవాలంటే దూరదృష్టి, విచక్షణ, దేశహితం గల నాయకులు పాటుపడవలసివున్నారు. మతం, కులం, భాషావర్గం, ప్రాంతీయం మొదలైన వివక్షతలకు తావివ్వకుండా కేవలం దేశహితాన్నే ఆరాధించి కృషి చేసేవారు కావాలి.

ఉన్నతాదర్శాలు ప్రాతిపదికగా రాజ్యాంగాన్ని నిర్మించడానికి పాటుపడిన పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్ గార్లను అధ్యక్షులు ప్రశంసించారు. లక్ష్యసాధనా రెండూకూడా దోషరహితంగా ఉంటేనే పురోభివృద్ధి సాధ్యపడుతుందని గాంధీజీ చెప్పిన మాటలను రాజేంద్రప్రసాద్ గారు జ్ఞప్తికితెచ్చి, ఈ ఆదర్శంతోనే రాజ్యాంగాన్ని నిర్వహించాలన్నారు.

డా॥ అంబేద్కర్ విమర్శలకు సమాధానమిస్తూ ప్రజలకూ శాసనకారులకూ చేసిన హెచ్చరికను గమనించడం అవసరం. 1950 జనవరి 26 తో మనదేశంసర్వజనులకూ రాజకీయరీత్యా సమానప్రతిపత్తి లభిస్తుంది కాని ఆర్థిక సాంఘిక రంగాలలో లభించడం లేదన్నారు. ఈసమత్వాన్ని అతిశీఘ్రంగా తొలగించకపోతే రాజకీయస్వాతంత్ర్యానికి ముప్పు తప్పదన్నారు. పీడితులైనవారిని చిరకాలం తొక్కి ఉంచలేరు. వారు రాజ్యాంగవ్యవస్థనే కూలదొయ్యగలరు. అందరూ రాజ్యాంగ సూత్రాలను అతిశ్రద్ధగా అనుసరిస్తేగాని నియంతృత్వం రాగల ప్రమాదంకూడా ఉన్నదన్నారు. రాజ్యాంగనిబంధనల ఆధారంతో ఆర్థికంగా సాంఘికంగా హీనస్థితిలో ఉన్నవారిని అణచడానికి యత్నిస్తే ముప్పుతప్పదు. ఈ రాజ్యాంగ ఆధారంతో హీనస్థితిలో ఉన్నవారిని ఉద్ధరించడానికీ సర్వజనసమత్వం నెలకొల్పడానికి యత్నించాలి.

వీనిలో ఏ లక్ష్యాలను కాని సాధించడానికి విప్లవం, శాసనోల్లంఘనం, సత్యాగ్రహంవంటి విధానాలను అవలంబించకూడదు. అవలంబించే పక్షంలో అరాచకం తప్పదు.

ఇదిగాక నాయకులపట్ల అంధవిశ్వాసం, మూఢభక్తి ప్రజల్లో ఏర్పడకూడదు. దీనివల్ల నియంతృత్వానికి అవకాశం వస్తుంది. జాతీయైక్యత ఇంకాసిద్ధించలేదని డా॥ అంబేద్కర్ అన్నాడు. ఇంకా అనేక మతవర్ణాది వర్గవివక్షతలు ఆవేశాలను కల్పించినంతకాలం జాతీయైక్యత సిద్ధించదు.

నవల



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౬

వసంత ఋతువును శరదృతువును మానవులకు యమదంష్ట్రిల వంటివి. ఆ ఋతువులు ఆరంభింపగనే రోగములు విజృంభించును. అందుచే శుభము గోరు మానవులు ఆ రెండు ఋతువుల యారంభములో నవరాత్రదీక్షతో పరదేవతాపూజ చేసి తత్ప్రసాద మందవలెను. అందును శరన్నవరాత్రమహోత్సవము ముఖ్యతరము. ఈ విధి భరత భూమిలో చక్రవర్తు లనాదిగా పరిపాలించుచు వచ్చిరి.

శరత్కాలము జైత్రయాత్రలకును సేనాచలనములకును మిక్కిలి యనువైన సమయము. వర్షర్తు వప్పుడే గతించి ప్రయాణముల కనుకూలించు కాలము సంప్రాప్త మగును. శౌర్యసంపదలతో తులదూగు రాజుల కా కాలము ప్రమదావహము. తా ముద్యమించు కార్యముల కనుకూలింప నా సమయమున నిష్టదేవతార్చన మొనర్తురు. పురుషకారమునకు దైవానుకూల్యము ప్రాపుగా నుండినప్పుడే కదా సాఫల్యము చేకూరుట!

ఐనను ఈ శరన్నవరాత్రములు కేవలము దేవతాపూజావసరముమాత్రమే యని తలంపరాదు. ఆ సమయమున విధిగా రాజధానీనగరమున సామంతులును మండలేశ్వరులును దండనాథులును మంత్రులును ఉన్నతరాజపురుషులందరును రాజసేవకు సమకూడుదురు. ఈ విధముగా మూలమూలల నున్న పరిపాలకులు నున్నతోద్యోగులు చక్రవర్తిని దర్శించి కానుక లర్పించి తమ రాజభక్తి దృఢము చేసికొందురు. అప్పుడే దేశదేశముల పరిస్థితులు చక్రవర్తికి సమగ్రముగా నవగత మగును. మండలేశ్వరులు తాము పాలించు మండలముల లెక్కలు సమర్పించి పరిపాలనావిశేషములు చక్రవర్తికి నివేదింతురు. తమ కష్టసుఖములు తెలిపికొందురు. ఒకచోట కొరతగా నున్న సరకులు ఎక్కువగా నున్న ప్రదేశములనుండి తెప్పించు నేర్పాట్లు జరుగును. అధికారుల నొక స్థానమునుండి మరియొక స్థానమునకు మార్పులు చేయుటయు నెక్కువగా నీ సమయముననే జరుగును. సమర్థులకు బహుమతులును అసమర్థులకు శిక్షలును ఇప్పుడే లభించును. ఈ విధముగా రాజకీయవ్యవహారములకును వివిధ ప్రాంతముల ఏకీకరణమునకును ఈ ఉత్సవము లుపకరించెడివి.

మరియు నా యుత్సవములలో నొకనాడు సరస్వతీపూజ జరుగును. ఆనాటికి దేశమున నన్నియెడల గల మహావిద్వాంసులు కవులు గాయకులు నటులు బహుకళాకుశలురు రాజధానికి వచ్చి తమతమ విద్యలు ప్రదర్శించి మహారాజులయు సామంతమండలేశ్వరదండనాథులయు మన్ననలు పడయుచుందురు. అది యా నాటితో ప్రారంభమై తుదవరకు కొనసాగును. ఆ వినోదములలో శాస్త్రవాదములు ప్రధానములు. ఆ సభలలో నూతనగ్రంథములు చర్చకు వచ్చును. అప్పటి రాజులు తరచుగా స్వయముగా విద్వాంసులుగా కూడ నుండెడివారు. ఐనను సర్వాధికారము నందు చేరిన పండితులదే కాని బలవంతు డగు రాజుదికాని విద్యాహీను లగు ప్రజాసామాన్యమునది కాని కాదు. ఆ విద్వదగ్నిపరీక్షకు నిలిచిన యుత్తమగ్రంథములకే మాన్యత కలిగెడిది. అట్లు నిలిచిన గ్రంథములు శీఘ్రముగా నలుగడల దేశమంతట వ్యాప్తి గాంచెడివి. పూర్వము శీఘ్రగమనమునకు సాధనలు తక్కువ. ఐనను ఉత్కృష్టము లగు నూతనగ్రంథములు ఆసేతుశీతనగమధ్యస్థభూమినంతట విదితమై ఖండనమండనగ్రంథములు కొలదికాలముననే దేశమంతట ప్రభవించుచుండెను. విద్వత్సభలో నిలిచిన గ్రంథముననే మాన్యతగాని ధనవంతునో బలవంతునో అధికారినో ఆశ్రయించి ప్రతులు ఎన్ని వ్రాయించినను శుష్కగ్రంథములకు నిలుకడ లేదు. విద్వత్సభ లందువలన పూజార్హములు. అట్టి పూజ్యవిద్వత్సభలు స్వయముగా నెరిగి యట్టివానిలో పాల్గొని నిష్పక్షపాతముగా నడిపించిన ఆద్యాంధ్రకవి వాని నేమని వర్ణించినాడు?

"పరమవివేకసౌరభవిభాసితసద్గుణపుంజవారిజో
త్కరరుచిరంబులై సకలగమ్యసుతీర్థములై మహామనో
హరసుచరిత్రపావనపయఃపరిపూర్ణములైన సత్సభా
తరసరసీవనంబుల ముదం బొనరం గొనియాడి వేడుకన్."

అంతేకాదు! మహాభారత ముత్తమసభాపూజ్యం బని వర్ణించి యందలి పర్వముల యతిశయము చెప్పుచు మరలమరల సభాపూజ్య మని వర్ణించినాడు.

తొమ్మిదవనాటితో దీక్షాసమాప్తి యగును. ఆనా డాయుధపూజ! వీరులకు వారివారి యాయుధములే ప్రత్యక్షదైవములు. వాని నానాడు వారు విశేషముగా నర్చింతురు. ఖడ్గినీ శూలినీ చాపినీ పాశినీ అంకుశినీ చక్రిణీ గదినీ శంఖినీ— ఇత్యాదిదేవతలును తత్తన్మంత్రములును పుస్తకములలోకంటె వీరుల హృదయాంతరాళములలో దృఢతరాధిష్ఠితములై యుండెడివి. ఆయుధపూజనాడు వీరజనసమ్ముఖమున వివిధరణప్రదర్శనములు జరుగును. నూతనసాధనములు ప్రాతసాధనముల నూతనప్రయోగములు ప్రదర్శింపబడును.

వీరరసము ప్రజలలో తాండవమాడు నా కాలములో నీ విధముగా దైవపూజ, వినోదము, ప్రయోజనము పరస్పరవిరోధము లేక సామరస్యముతో చెల్లుబడి సాగించుకొనుచుండెను.

1. శివయోగసారము.

ఆ నవరాత్రములలో నాలవనాటికి గాని ఇందులూరి అన్నయమంత్రి ఏకశిలానగరము చేరుకొనలేకపోయెను. అతడు దక్షిణకళింగాధిపతి. వేగివిషయములో నూరవర మాతని రాజధాని. కాకతిసామ్రాజ్యమును కాళింగుల యొత్తిడినుండి యతడే సంరక్షించుచుండెను. ఇతరభాగములలో సామంతులకు రాజభక్తి తగ్గినందున తరచుగా గణపతిదేవు డాతని రాజధానికి పిలిపించుచుండెను. ఈ రాకపోకలతో నాతడా భాగమును దృఢముగా పరిపాలించు నవకాశము తగ్గిపోవుచుండెను. కాళింగులు సరిహద్దున నున్న చిన్నచిన్న ప్రభువులను నెమ్మదిగా తమ కనుకూలురుగా త్రిప్పుకొనుచుండిరి.

ఇందులూరివంశము పారంపర్యముగా మహామంత్రుల జన్మమునకు నెలవైనది. గణపతిదేవుడు వెలనాటిపై దండయాత్రలు చేయుచున్నప్పుడు అతని యమాత్యులలో నొకడగు ఇందులూరి సోమయమంత్రి కొలనిపుర మను నామాంతరము గల సారసిపురమును ముట్టడించి దాని ప్రభు వగు కేశవనాయకుని జయించెను. తదాదిగా ఇందులూరివారికే కొలనివా రను ప్రతాపనామమును సంక్రమించెను.

ఇందులూరివంశములో పుట్టిన మహామాత్యదండనాథులలో నాయకమణి యీ అన్నయమంత్రి. అతడు కేవలము మనుష్యమాత్రు డనుటకే వీలు లేదు. కారణజన్ముడాతడు!

అతని తండ్రి గన్నభూపతి పై కొలనిసోముని కూరిమితమ్ముడు. తల్లి గౌరాంబ. ఆ దంపతు లిరువురు పుత్రార్థులై యున్నయెడ నొకానొకనాడు గౌరమసన్నిధికి యతీంద్రు డొకడు వచ్చి భిక్షాదాన మర్థించెను. ఆమె యథాచారముగా నాతనికి భిక్షము పెట్టబోవుచుండ నాత డది యంగీకరింపక యిట్లర్థించెను.

"అమ్మా, పరమపవిత్రురాల వగు నిన్ను ఇతరు లగు తల్లులయొద్దవలె సామాన్యభిక్ష యాచించుటకు నేను రాలేదు. నాకు ప్రాప్తించిన దివ్యదృష్టిచే నాకు మరియొక జన్మము తప్ప దని తెలిసికొంటిని. నాకు దల్లిగా నుండ యోగ్యురా లగు మహాసాధ్వికై బహుకాలముగా నన్వేషించుచుంటిని. పలువురు పుణ్యాంగనల దర్శించితిని. నేటికి నిన్ను చూచినంతనే నీ కడుపున బుట్టు భాగ్యము పొందవలె నని యిచ్చ జనించినది ఇది గతజన్మముల సంబంధము. నాకు మాతృభిక్ష పెట్టు, తల్లీ!"

ఆ సాధ్వి యది విని యాశ్చర్యచకితయై వల్లె యనెను ఆ యతీశ్వరుడును తాను పుత్రుడుగా జన్మించినప్పు డుండబోవు చిహ్నములు ప్రత్యయార్థము వ్రాసి యామె కిచ్చి యానాడే మంతెనకాశీశ్వరము వోయి యచ్చట సమాధినిష్ఠుడై దేహయాత్ర చాలించెను. ఆ మాసమే గౌరాంబకు నెల తప్పెను. ఆ గర్భశుక్తిముక్తాఫలమె అన్నయమంత్రి యయ్యెను.

"యతి మున్ను చెప్పిన ట్లు
న్నతఘనతంత్రాలికములు నాసము శ్యామా
యతదేహము గౌరకన్నుల
గతి వలపతిసుబ్బపిన్న కంతుని గనియెన్"[1]

అన్నమంత్రి తన పెదతండ్రికుమారు డగు రుద్రమంత్రిని కొలనిపీఠములో నధికారిగా నుంచెను. ఈ రుద్రమంత్రి దండనీతిపారగు డగుటయే గాక మహావిద్వాంసు డగుటచే 'వ్యాకరణబ్రహ్మ' యను ప్రతీతి సంపాదించెను. అన్నయకు రుద్రు డపరప్రాణమే.

రాజధానికి నవరాత్రమహోత్సవములకు జేరెడు విద్వద్బ్రాహ్మణబృందము తరచుగా అన్నమంత్రి రుద్రమంత్రుల దివాణముల జేరెడువారు. వారి కక్కడ శుచిగా సుష్ఠుగా సగౌరవముగా నన్నవిశ్రాంతులు లభించును. వారి దివాణములకు అరుదెంచిన యతిథులు నభ్యాగతులు తమ భాగ్యవశమున తమ యింటి కరుదెంచిన నారాయణుని యపరావతారములుగా భావించి యా గృహస్థు లిరువురు నాదరింతురు. వారిరువురును స్వయముగా నెట్టి సహాయ మైనను జేయగల సమర్థులు. మరియు రుద్రమంత్రిసంస్థానమున సమ్మానభాజను డైన విద్వాంసునకు ఏకశిలానగరమున గౌరవాదరములకు కొదువ యుండదు. 'వ్యాకరణబ్రహ్మ' సమ్మాన మొక గీటురాయి, ఒక ఒరవడి!

అందరు ప్రధానమండలేశ్వరులకువలెనే అన్నమంత్రికిని రాజధానీనగరమున ప్రత్యేకమందిర ముండెను. అందు రాజకార్యములు నిర్వహించుటకు అనేకు లగు కరణము లున్న వ్యవహారశాల కలదు. కరణము లనగా వ్రాయసగాండ్రు వా రప్పుడు విశేషముగా జైనులును స్వర్ణకారులును ఐయుండిరి. శాణము పట్టనేర్చిన హస్తములకు గంటము లూనుట చులకనగా నుండెడిది.

భరతభూమిలో అనాదిగా వేదశాస్త్రవిదు లగు బ్రాహ్మణోత్తములు భరతరాజులయొద్ద మంత్రులుగా నుండెడివారు. ఆ యాచారమే చాళుక్యప్రభువులయొద్దను కొంతవరకు కాకతీయులయొద్దకూడ సాగినది. అందుచే పూర్వాచారపరాయణు లగు బ్రాహ్మణులకుగూడ అమాత్యపదవి మాననీయమే. కాని యట్టివారు వ్రాయసవృత్తిమాత్రము సేవావృత్తిగా పరిగణించి దానిని కొంత నీచముగా భావించెడివారు. ఐనను వేదశాస్త్రాదివిశేషవిద్యలు నేర్వలేని పేదబ్రాహ్మణులు కొందరు

(22-వ పేజీ చూడుడు)

మన డాలర్ ఎగుమతులు

శ్రీ నందివాడ కృష్ణమూర్తి

హార్డుకరెన్సీప్రాంతాలతో మన కేర్పడ్డ వ్యతిరేక వ్యాపారశేషాలు లేకుండా చేసుకోవాలన్నా, దేశాభ్యుదయానికి కావలసిన డాలరు వస్తువుల దిగుమతి చేసుకుందుకు కావలసిన డాలర్లను సంపాదించుకోవాలన్నా రూపాయివిదేశవిలువ తగ్గించక తప్పదన్నారు శ్రీ మత్తాయిగారు. కాని డాలరుతో సరిచూసుకొంటే మన రూపాయికి పదకొండణాల విలువే ఉంటుంది రూపాయివిలువలో అయిదణాల నిర్వికంగా పోగొట్టుకొనినందుకు, మనకు కావలసిన డాలర్లను సంపాదించుకొనేందుకు ఇదివరకుకన్న మంచి సదుపాయా లేర్పడడమే మనకు లభించిన లాభమన్నమాట. రూపాయిని 21 సెంట్లకు సమానంగా మార్చుకొనుటవలన, మనం ఎగుమతి చేసే వస్తువులు, అమెరికాకొనుబడిదారుల కిదివరకుకన్న తక్కువ ధరలకే లభ్యమవగలవు. ఎగుమతుల పరిమాణాలలో ఏమార్పూ లేకపోతే, డాలరుధరలు క్షీణించుటవలన మనకు లభ్యమయ్యే డాలర్లుకూడ తక్కువగానే వుంటాయి. కాని డాలరుధరల క్షీణతకారణంగా, ఇదివరకుకన్న మన ఎగుమతుల పరిమాణాలుకూడ అధికమవుతాయి. ఈ హెచ్చుదల వలనకల్గే లాభము, తక్కువధరలవలన కల్గే రాబడినష్టంకన్న హెచ్చుగా ఉంటేనే రూపాయివిలువతగ్గింపువలన మనకు లాభము కల్గిందనుకోవాలి కాని, అన్యథా కాదు.

ఎగుమతు లన్నిటిలోను, జనపనార మనకు ముఖ్యముగా డాలరుసంపాదనకు తోడ్పడగలిగే వస్తువు. విలువతగ్గింపులకీలన, ఈ నారవస్త్రముల ఎగుమతులలో ఏవిధమగు మార్పు కలుగుతుందో ఆలోచించాలి. హెస్సియన్ వస్త్రాలు, వస్తువుల కట్టుకుందుకు, రవాణా చేసుకొందుకు, ప్రపంచమంతట వాడబడుతున్న ఒక అతిముఖ్యమైన వస్తువు. ఒక్క 1948 సం॥లోనే ఇతరమైన మన ఎగుమతు లన్నిటివలన 45.97 కోట్ల రూపాయిల ఆదాయము వచ్చినప్పుడు ఒక్క హెస్సియన్ ఎగుమతులవలన 76.32 కోట్ల రూపాయిలు లభ్యమయ్యాయంటే, దీనియొక్క విదేశవిలువను వేరేవిధంగా నిరూపింపనక్కరలేదు. కాని ప్రస్తుతపరిస్థితులలో ఈ హెస్సియనకుకూడ మార్కెట్టుపరిస్థితు లనుకూలంగ లేవు. అమెరికాలో మన హెస్సియన్‌గుడ్డల వాడకము కొంత క్షీణించినట్లు తెలుస్తుంది. అసలే వ్యాపారమాంద్యంవల్ల దెబ్బతింటున్న కొనుబడులు క్రొత్తగా కనిపెట్టబడుతున్న అనుకల్పనములవలన మరింత నష్టపోతున్నాయి. ఈ అనుకల్పనల వుపయోగాలే దృఢపడితే మన హెస్సియన్ ఎగుమతులకు శాశ్వతమైన దెబ్బ తగులకలదుకూడ. అమెరికావ్యాపారాన్ని పరిశీలించి చూస్తే వ్యాపారాలతో, ఆదాయా లధికమవుతుంటే, ముడిపదార్థాల నధికంగా కొనడమేకాకుండా, అనేకరకముల ఖరీదయిన హెస్సియన్‌గుడ్డలను దిగుమతి చేసుకుంటూండడము గమనించవచ్చు. అంటే, అమెరికాలో మన హెస్సియన్‌అమ్మకాలు, ఆ దేశీయుల ఆదాయములస్థితిస్థాపకశక్తులపై ఆధారపడి ఉంటుందన్నమాట. అమెరికన్ ఫెడరల్ రిజర్వుబోర్డు సూచీలెక్కలను, హెస్సియన్ దిగుతుల సూచీలెక్కలను సరిచూసుకొంటే, ముమ్ముందు హెస్సియన్‌కు అమెరికాలో ఏవిధమగు పరిస్థితు లేర్పడగలవో సూచింపవచ్చును. ఈ సూచీలెక్కల ప్రకారము 1934-38 సంవత్సరముల మధ్య అయిదుసంవత్సరకాలములో సగటున 6.7 మిలియన్ పౌన్లు హెస్సియన్ దిగుమతి చేయబడింది అమెరికాలోకి సూచీలెక్కల నాధారంగా చేసుకుని చూస్తే 1949 జాన్యువరి-ఏప్రెల్ మాసాలమధ్య సుమారు 415 మి॥ పౌ॥ హెస్సియన్ అమెరికాకు ఎగుమతి చేయబడిఉండాలి. కాని 163 మి॥ పౌన్లే నిజానికి దిగుమతిచేసికోబడ్డాయి ఈ కాలంలో. అనగా, మన ఎగుమతుల ఈ తక్కువధరలపై జరగాలంటే మన ఎగుమతులు మూడురెట్లధికం కావాలనడము కాదు. ఎందుకంటే, నూతనపద్ధతులపై వస్తువుల నిల్వచేయు నలవాటేర్పడక పోవడమువల్ల జనపనార తన ప్రాబల్యాన్ని కొంత పోగొట్టుకుంటుంది. ముఖ్యంగా గోనెసంచులకుబదులు, కాగితపుసంచుల వాడకం వచ్చాక, ఎంత ధరలు తగ్గించి అమ్మదలచినా, వానిని వాడుకలోనుంచి తప్పించడం కష్టసాధ్యము. జనుపనారధరల సమాగ్రాలలోనే ఉంచుకోగలిగితే మనకు లాభించే అధికకొనుబడులను సూచించడమే ఈ వ్యాసముయొక్క ముఖోద్దేశము.

1937 లో ఫెడరల్ రిజర్వుబోర్డు సూచీలెక్క 113 ఉన్నప్పుడు అమెరికాకు 810 మి॥ పౌ॥ హెస్సియన్ ఎగుమతి చేయబడింది. 1949 లో ఈసూచీలెక్క 66 పాయింట్లధికంగా ఉంది కాబట్టి జాన్యువరీ-మే సంవత్సరములోని రేట్లు 470 మిలియను లధికముకాకుండా (70%) లా 1937 లో వలె 810 మి॥ పౌ॥ల వరకూను కూడ పెరుగగలదని కొందరు వాదిస్తున్నారు.

కాని రూపాయివిలువ తగ్గాక కలకత్తామిల్లులెంతవరకు మార్కెట్టును స్వాధీనంచేసికోగలవన్న ప్రశ్న. అమెరికాకొనుబడులయొక్క ధరల స్థితిస్థాపక శక్తులపై ఆధారపడివుంటుంది. లభ్యమయ్యే సూచీ లెఖలబట్టి చూస్తే హెస్సియన్‌ధరలలో 1% తగ్గుదల కలుగుతే అమెరికాలో కొనుబడులు 0.5% అధికమవగలవని తేలుతుంది. కాని ప్రస్తుతపు విలువతగ్గింపుల వలన హెస్సియన్‌ధరలుకూడ 30.5% తగ్గవలసి వుంటుంది. అందువల్ల జాన్యువరీ - మే సంవత్సరపు 470 మి॥ పౌన్ల రేటుకన్న, అమెరికాలోని కొనుబడులు 15% లేక 70 మి॥ పౌ॥ల అధికం కాగలవు.

కాని ఈ 15% అధికకొనుబడులు, తగ్గింపబడిన రూపాయి విలువకు సమానంగా హెస్సియన్‌ధరలుకూడ తగ్గినప్పుడే, సంభవిస్తుంది. కాని వీని ధరలలో ఇంతటి తగ్గుదల లేర్పడడానికి వీలుండదు. ముడినార లభ్యమవడము ప్రస్తుతము చాల కష్టమైన విషయము. అందుచే 1949 సమాప్తానికికూడ మన మిల్లులు సంపూర్ణమైన తమ ఉత్పత్తుల చూపింపలేవు. దీనికి తోడు పాకిస్తాన్ కలిగించిన సమస్యలు కొన్ని. కామన్‌వెల్తు దేశాలన్నిటివలెనే, పాకిస్తానుకూడ, తన రూపాయివిలువ తగ్గించుకోకపోవడమువలన మనకుకూడ, ఈ ముడినారధర లధికమవక తప్పదు. అందుచే హెస్సియన్‌యొక్క డాలరుధరలు 30.5% గా తగ్గించడానికి వీలుండదు. ఈ ఫలితాల్ని వ్యతిరేకము చేయాలంటే, మన హెస్సియన్ ఎగుమతులను అమెరికా మొదలయిన డాలరుప్రాంతాలకేకాని స్టర్లింగు కరెన్సీప్రాంతాలయిన స్టర్లింగు దేశాలకు పంపబడకూడదు. కాని ఇంగ్లాండుతో మన కేర్పడ్డ మొహమాటలవల్లనూ ఇతర స్టర్లింగుదేశాలతో ఏర్పరచుకొన్న ఒడంబడికలవలన వారినుంచి ఈ ఎగుమతుల నాపుచేసికోవడము కష్టము.

అందుచే హెస్సియన్‌యొక్క డాలరు ధరలు పూర్తిగా 30.5% రేటు వరకు తగ్గిపోవడానికి వీలుండదు. కాని అనుకూలపరిస్థితులేర్పడితే, హెస్సియన్ డాలరు ధరలు 20% కన్న తగ్గజాలవని, అమెరికాలోని కొనుబడులు 10% కన్న అధికము కాజాలవని ఊహించవచ్చును. కాని ఈ 10% అధికపు అమ్మకాలు, రూపాయివిలువతగ్గింపులకు పూర్వపు ధరలకన్న 20% తక్కువ ధరలకే జరుగవలసి వుంటుంది. జాన్యువరీ - మే లెక్కల ప్రకారము, 517 మి. పౌ. హెస్సియన్ అమ్మడము తే 105 మి. డాలర్లే లభ్యమవుతాయి. అంటే, రూపాయివిలువలో మార్పులేకుండా ఇప్పటికన్న 47 మి. పౌ. ఎగుమతి తక్కువచేసుకొని అమ్మితే వచ్చే రాబడికన్న ఇప్పుడువచ్చే రాబడులలో 15 మి. డాలర్లు తక్కువన్నమాట. కాబట్టి రూపాయి విలువతగ్గించడమువలన 7.1 కోట్ల రూపాయిలకు సమమైన హార్డుకరెన్సీని నష్టపోవలసియుంటుం దిప్పుడు.

కాని ఇది విలువతగ్గింపులవలన కల్గిన తాత్కాలిక నష్టమనే చెప్పాలి. జనుపనార పరిశ్రమయొక్క శాశ్వత ఫలితాన్ని తీసుకుంటే, హెస్సియన్ ధరలలో 20% తగ్గుదలకలుగుటవలన అనుకల్పనల పోటీలనుండి రక్షించుకొనవచ్చును, ఉత్పత్తి ఖర్చుల తగ్గించుకొనడానికి ప్రయత్నించవచ్చునని చెప్పచున్నారు. కాని ఈ అదను మంచిదే అయినా దీనికొరకు, అసలే డాలర్లకోసం సర్వప్రయత్నాలుచేస్తున్న మనం ముందుగా 15. మి. డాలర్లను పోగొట్టుకోవలసి వుంటుంది.

జనపనార తరువాత మనము హార్డుకరెన్సీ ప్రాంతాలకు ఎగుమతిచేస్తున్న తక్కిన పదకొండువస్తువులలోనులక్క, పండ్లు, కూరలు, (ముఖ్యంగా జీడిపప్పు) మైకా, సుగంధద్రవ్యాలు, నూనెలు, ఇతరములు మాత్రమే కలసి సుమారు 23.85 కోట్ల రూపాయిల విలువ చేస్తున్నాయి.



జోసఫ్ డి. చార్లెస్ అమెరికాలోని హైటీ రాయబారి

	పదార్థాలు.	లక్షరూపాయిలలో ఎగుమతుల విలువలు.	
1	ముడినార.	7,62	లక్షలు.
2	తేయాకు	6.13	,,
3	లక్క	5,27	,,
4	పండ్లు-కూరలు	4,34	,,
5	మైకా.	4,18	,,
6	చర్మములు-తోళ్లు-ముడివి సాపుచేయబడ్డవి.	3.90	,,
7	ముడిప్రత్తి	3,46	,,
8	సుగంధద్రవ్యాలు	1,34	,,
9	నూనెలు	1,06	,,
10	మాంగనీసు	1 01	,,
11	ఇతరములు	7,66	,,

వీని ధరలే తగ్గుతే, వీనివలన మరింత లాభము రాగలదు కాని వీని కొనుబడుల స్థితిస్థాపక శక్తులలోచాల అనుకూలతలున్నను, రూపాయిల లో వీని ధరలలో ఎట్టిపెరుగుదలలు లేకపోయినా, వీనిమూలానకల్గే మొత్తపు హార్డుకరెన్సీరాబడులు 3 కోట్ల రూపాయిలకుకన్న అధికవిలువకల్గివదని ఊహించాలి. ముడి జనుపనార, ప్రత్తివిషయాలలోవిలువ తగ్గింపులవలన భారతదేశంఎగుమతుల నధికం చేసికొంటేగాని ఎట్టిలాభాన్ని పొందలేదనే చెప్పాలి. కాని దేశంలోని పరిశ్రమలకే మిక్కిలిగా ఈ ముడిపదార్థాలు కావలసియున్నప్పుడు, వానిని విదేశాలకు కూడ ఎగుమతిచేయడం కష్టము. కొద్ది బరువుగల తోళ్ల విషయంలో కూడ ఇవే పరిస్థితులగుపడుతున్నాయి. మేకచర్మాల ఎగుమతివలన, మనకు పాకిస్తాను కన్న అధికంగా డాలర్లు లభ్యమవగలవు. కాని మన వస్తువుల ధరలు తగ్గినంత మాత్రాన అమెరికాలో మనవస్తువుల కొనుబడులంతకుతగ్గట్లధికమవుతాయనడానికి కొంత సందేహము కలుగుతుంది. 1948 లో మన రాబడులకన్న, ఈ వస్తువులన్నిటిమూలానా, రాబడులు 10% కన్నా రావని, సుమారు 2 కోట్ల రూపాయిల విలువగల డాలర్లను మనము నష్టపోవలసి వుంటుందని చెప్పవచ్చు.

మిగిలిపోయింది మాంగనీసు. 1948 లో మన ఎగుమతులలో దీనికి పదకొండవ స్థానమివ్వబడింది దీనిమూలంగా సుమారొక కోటిరూపాయలు రాబడి కలుగుతుందికూడా. ప్రస్తుతము హార్డుకరెన్సీ ప్రాంతాలకు 182 టన్నులు మాత్రమే ఎగుమతవుతుంది. కాని ఈ గనులు త్రవ్వడం, త్రవ్వబడిన మాంగనీసును సరఫరా చేయడంలోని కొన్ని యిబ్బందుల వల్ల ఇంతకన్న మనం ఎగుమతి చేయలేక పోతున్నాము. కాని ఈ సంవత్సరములో హార్డుకరెన్సీప్రాంతమయిన అమెరికాకు 400,000 టన్నులనయినా ఎగుమతి చేయడానికి ప్రయత్నాలు చేయబడుతున్నాయి. అసలు మాంగనీసు అమ్మకాల నధికం చేసుకోడానికి, రూపాయివిలువ తగ్గింపుకు ఏవిధమైన సంబంధాన్ని ఏర్పరచనే అక్కరలేదు. కాని ఈ విలువ తగ్గింపులు ఎలాగూ జరిగాయి గనుక, ఇప్పుడు మాంగనీసుధరలను, అధికారరీత్యా 30.5% పెంచకపోతే, మనకువచ్చే డాలర్ల రాబడి చాల తగ్గిపోకతప్పదు. అమెరికాలో మాంగనీసు చాల అత్యవసరమైన వస్తువుగా పరిగణింపబడుతున్నది కావున, ఏ ధరలపైనైనా — వారి కొనుబడులు జరుగుతునేవుంటాయి. కాబట్టి ధరలను 30.5% పెంచడం కష్టమైనపనికాదనే అనుకోవాలి.

లక్క, జీడిపప్పు, మైకా సుగంధద్రవ్యాలు, నూనెలు, ఇతర పదార్థాలవలన భారతదేశం, 3 కోట్ల రూపాయిల, విలువగల డాలర్ల నదనంగా సంపాదించుకోవచ్చు. కాని అతిఅనుకూలపరిస్థితులలోగూడ, జనుపనారపై 7 కోట్లు, ముడినార, ప్రత్తి, తోళ్లు, చర్మాలు టీ మొదలగు పదార్థాల ఎగుమతులవల్ల 2 కోట్లు, రాబడి నష్టాలు రాగలవు. అంటే, ఇదివరకుకన్న, మన డాలరురాబడులు, 6 కోట్ల రూపాయిలకు సమమగునట్లు తగ్గిపోగలవన్నమాట.

ఉత్పత్తిసాధకాలనే అధికముచేసుకుంటే, వాటిని, అభివృద్ధిమార్గాలలో వాడుకుంటే, తుదకు మన ఉత్పత్తుల నధికముచేసికొంటే, ఈ నష్టాల్ని కొద్దికాలంలోనే నివారించుకోవచ్చు. అప్పటివరకు డాలరుసంపాదన, దేశాభ్యుదయావసరమైనంతగా జరగజాలదనే చెప్పాలి.

స్టాలిన్ తరవాత ముఖ్యనాయకుడు

జార్జి మెలంకోవ్



స్టాలిన్ తరఫున రష్యన్ విప్లవవార్షికోత్సవంలో ప్రధానసమితుకుచేసినవాడు ఈ సంవత్సరం జార్జి మెలంకోవ్. 1947 లోనూ 1948 లోనూ మాలటోవ్ ఈ ఉపన్యాసాల నిచ్చాడు. కాని ఈ సంవత్సరం ఆరంభంనుంచీ మాలటోవ్ పరపతి కొంత వెనకబడింది. రష్యన్ మంత్రివర్గంలో మార్పుల అనంతరం రష్యాలో మెలంకోవ్ పేరు తరుచు వినవస్తోంది.

విదేశాంగవ్యవహారాలలో రష్యావిధానం మారినప్పటినుంచీ మెలంకోవ్ ప్రాధాన్యత అధికమౌతూవచ్చింది.

ఫిబ్రవరి 28 వ తేదీని రష్యన్ ఆర్థికవ్యవహారాలలో ప్రధానసంస్కరణలు ప్రవేశపెట్టబడినాయి. ఈ సంస్కరణలు ప్రతిపాదించబడిన డిక్రీలో రెండే రెండు పేర్లు పేర్కొనబడినాయి. ఒకటి సోవియట్ యూనియన్ మంత్రివర్గాధిపతి స్టాలిన్. రెండు సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ ప్రధానకార్యదర్శి జార్జి మెలంకోవ్. ఈ డిక్రీఅనంతరం అయిదురోజుల్లో మంత్రివర్గంలో మార్పులు ప్రకటించబడినాయి. మాలటోవ్ స్థానే వైషిన్స్కీ నియమించబడ్డాడు. విదేశవాణిజ్యమంత్రి మికోయాన్ స్థానే మెన్షికోఫ్ నియమితుడైనాడు.

ఫిబ్రవరి 28 డిక్రీలో స్టాలిన్ పేరుతో మెలంకోవ్ పేరును చేర్చడానికీ, ఈ మార్పులకీ ఆంతర్యం అప్పుడు విదితమయింది. రష్యావిదేశాంగ వ్యవహారవిధానంలో పంథా మార్చుకుంది. మాలటోవ్ ఇంకా విదేశాంగమంత్రిగా ఉన్నప్పుడే మారిన విధానం మంత్రివర్గంమార్పులతో బయటబడింది. అదిగాక రష్యన్ అధికారచిత్రాలలో ఈమధ్య స్టాలిన్ ప్రక్కను మాలటోవ్‌కు బదులు మెలంకోవ్ ఉంటున్నట్లు కనపడుతోంది. దీనినిబట్టి మంత్రివర్గమార్పులతో మెలంకోవ్ ప్రాధాన్యత రష్యన్ వ్యవహారాల్లో ఇనుమడిస్తున్నదని తెలిసింది.

ఆరంభంనుంచీ రష్యన్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శికి రష్యన్ వ్యవహారనిర్వహణలో ప్రాధాన్యతి ఉంది. లెనిన్ కాలంలో స్టాలిన్ ప్రధాన కార్యదర్శిగా ఉండేవాడు. స్టాలిన్ తరవాత అధికారానికి రాగలడని లోకమంతా భావించిన జడానోవ్ 1948 ఆగస్టు వరకూ ప్రధానకార్యదర్శిగా ఉండేవాడు. ఆగస్టులో అతని మృతితో అతనితో సంయుక్తకార్యదర్శిగా పనిచేసిన మెలంకోవ్ ప్రధానకార్యదర్శి అయినాడు.

రష్యా విదేశాంగ వ్యవహారవిధానంమార్పుకు మెలంకోవ్ కారకుడని చెప్తారు. మెలంకోవ్ పాశ్చాత్యులపట్ల పరమవిరోధి అని ప్రతీతి. కామిన్‌ఫారమ్ అనే పేరుతో వ్యవహరించబడుతున్న కమ్యూనిస్టు అంతర్జాతీయప్రచారసంస్థకుకూడా ఇతడు నాయకుడు. ఇకనుంచి తిరిగి విదేశాలలో పూర్వపు కమింటర్న్ వలెనే కమ్యూనిస్టు కుట్రలు చెలరేగుతాయనీ, రష్యా ప్రపంచ విప్లవకార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీల కుట్రలు తిరిగి ప్రధానాంశాలు కాగలవనీ భావించబడుతుంది.

రష్యన్ కమ్యూనిస్టు పార్టీ యొక్క పొలిట్ బ్యూరోసభ్యులనుగురించిన వివరాలు అతి గోప్యంగా ఉంటాయి. ఎవరికీ తెలియనివ్వరు. వారి జీవితవిశేషాలు తెలియరావు. మెలంకోవ్ జీవితాన్నిగురించి కూడా అంతే. అతని బాల్యానికి సంబంధించిన వివరాలేవీ తెలియవు. మాస్కో సమీపంలో ఆరెన్‌బర్గులో జన్మించాడని మాత్రం తెలుసును. 1919 లో అంతర్యుద్ధంలో పాల్గొన్నాడు. ఆతరువాత పారిశ్రామికసంస్థల నిర్వహణగురించి మాస్కోలో అభ్యసించాడు.

మెలంకోవ్ వ్యవహారదక్షత పార్టీ ఉద్యమంలో బాగా వినియోగపడింది. మాస్కో కమ్యూనిస్టుపార్టీ నిర్వాహకుడుగా ప్రతిపార్టీ సభ్యుని గురించిన వివరాలనూ జాగ్రత్తగా సేకరించేవాడు. వారివారి పూర్వోత్తరాలనుగురించిన విశేషాలన్నిటినీ సేకరించేవాడు. స్టాలిన్ రష్యాలో అటువంటి విషయసేకరణవల్ల అధిక ప్రయోజనం కలిగింది.

1930 లో మెలంకోవ్ స్టాలిన్‌కు కార్యదర్శి అయినాడు. మాస్కో పార్టీ నిర్వహణశాఖకు అధిపతి అయినాడు. తరవాత పార్టీ ద్రోహులని విచారించబడిన వారి కేసులలో మెలంకోవ్ విషయసేకరణ చాలా ఉపయోగపడింది. ఈ కేసులను నడిపినవాడు వైషిన్స్కీ. ఈ విచారణల ఫలితంగా అనేకమంది ముఖ్య కమ్యూనిస్టు నాయకులు బలైనారు.

1934 లో రష్యన్ పార్టీకేంద్రసంస్థనిర్వహణ శాఖకు అధిపతి అయినాడు. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న పరిశ్రమల యాజమాన్యాలపైన పర్యవేక్షణాధికారం చలాయించాడు. ఉద్యోగుల ఉన్నతికిగాని పతనానికిగాని నిర్ణయాధికారం హస్తగతం చేసుకొన్నాడు. వ్యక్తులు, పార్టీ సభ్యులనుగురించినవిషయాలను సేకరించే పద్ధతి రష్యా అంతటా అమలుజరిపాడు. దీనితో కొద్ది మాసాల్లోనే రష్యాలో నివసించే ప్రతివ్యక్తిని గురించిన విషయాలూ మాస్కోలో గ్రంథస్థం కాగలిగాయి.

1939 లో కేంద్రకమ్యూనిస్టుపార్టీ కార్యదర్శులలో ఒకడైనాడు. 1941 లో పొలిట్ బ్యూరోసభ్యత్వానికి నిలిచాడు. యుద్ధం వచ్చింది. విమానాలు తయారుచేసే ఫాక్టరీల నిర్వహణ మెలంకోవ్‌కు ఇవ్వబడింది. ఇతని ఆధిపత్యంలో విమానాల తయారీ సాలుకు 40 వేలకు పెరిగింది. తరువాత ఉక్కు పరిశ్రమలోనూ, పెట్రోల్ పరిశ్రమలోనూ పెద్దమార్పులు ప్రవేశపెట్టించాడు. యుక్రేన్‌లో పార్టీప్రచారానికీ, పార్టీ కార్యనిర్వహణకీ ఇతన్ని పంపించారు. యుక్రేన్ పార్టీ ఉద్యమాన్ని ప్రారంభించి బలపరిచినవాడు మెలంకోవ్. 1943 లో జర్మన్ ఆక్రమణనుంచి ముక్తిపొందిన రష్యన్ ప్రాంతాలలో పునర్నిర్మాణకార్యక్రమనిర్వహణకు కమీషనర్‌గా నియమితుడైనాడు. 8 కోట్ల 80 లక్షల మంది ప్రజలపైన ఇతనికి అధికారం ఇవ్వబడింది.

యుద్ధానంతరం కేంద్రకమ్యూనిస్టుపార్టీ కమిటీప్రథమసమావేశంలో (1946 లో) మెలంకోవ్‌కు సభ్యత్వం లభించింది. పార్టీ కార్యదర్శులలో రెండోస్థానానికి ఎన్నికైనాడు. అంటే స్టాలిన్ తరవాత పార్టీలో ప్రముఖస్థానం ఇతనికి లభించిందన్నమాట.

పార్టీ కార్యనిర్వహణలో దక్షుడనిపించుకున్నాడు. పార్టీనియమాల నతికఠినంగా అమలు జరిపేవాడు. తనకు హితులైనవారిని పార్టీలోకి తెచ్చి ముఖ్యపదవు లిచ్చాడు. ప్రతిరాజకీయ, వ్యాపార రంగంలోనూ తన మిత్రుల్ని నియమించి తన స్థానాన్ని బలపరుచుకున్నాడు. విదేశాలలో గూఢచారులశాఖల్ని తన అదుపులోకి తెచ్చుకున్నాడు. సైన్యంలోకాని, రాజకీయ రక్షకదళంలోకాని (యన్. కె. వి. డి.) కేంద్ర పార్టీలోకాని అందరూ మెలంకోవ్ అనుగ్రహం కోసం ప్రాకులాడవలసివచ్చేది.

కెనడాకుట్రకేసులో అతడు పదవినుంచి పతితుడైనాడు. కాని స్టాలిన్ అనుగ్రహంనుంచి పతితుడు కాలేదు. కెనడాలో అణుశాస్త్రపరిశోధనరహస్యాలను సేకరించడానికి జరిగిన గూఢచర్యలు బహిర్గతం కాగానే, ఈ గూఢచర్యలలో ప్రధానపాత్ర వహించిన రష్యన్ రాయబారకార్యాలయోద్యోగి రష్యా పారిపోయి విషయాలన్నిటినీ మెలంకోవ్‌కు నివేదించాడు. అసలు కుట్ర బహిర్గతం కావడానికి ఈ ఉద్యోగియే కారకుడు. దీనితో మెలంకోవ్ పార్టీ కార్యదర్శిపదవినుంచి తొలగించబడ్డాడు. అప్పుడు పార్టీప్రధానకార్యదర్శిగా న్న ఇతని ప్రత్యర్థి జడానోవ్ ద్వితీయ కార్యదర్శి కార్యాలనుకూడా హస్తగతం చేసుకున్నాడు. మెలంకోవ్ తిరిగి పారిశ్రామికరంగానికి పంపబడ్డాడు. అక్కడ జెట్ విమానాల ఉత్పత్తికార్యక్రమంలో నియమితుడైనాడు. అక్కడ కూడా తిరిగి వ్యక్తుల్నిగురించి విషయసేకరణ ప్రారంభించాడు. క్రమంగా అదే పద్ధతివల్ల తిరిగి తన దక్షత నిరూపించుకున్నాడు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ప్రచార సంస్థను (కామిన్‌ఫారం) స్థాపించాలని రష్యన్ కమ్యూనిస్టు పొలిట్ బ్యూరో నిశ్చయించింది. తిరిగీ అంతర్జాతీయ కమ్యూనిస్టుసంస్థ కార్యకలాపాలను పునరుద్ధరించాలని పార్టీ నిర్ణయించింది. దానికి కామిన్‌ఫారం అని మారు పేరు మాత్రమే పెట్టారు. ఆ సంస్థ స్థాపిత మైనప్పుడు మెలంకోవ్ విషయసేకరణ చక్కగా పనికివచ్చింది. తూర్పు యూరోపియన్ దేశాలలో విశ్వసనీయులైన కమ్యూనిస్టునాయకుల్ని మెలంకోవ్ రికార్డుల సహాయంతో ఎంచగలిగారు. ఈ ఎంచడానికి జడానోవ్‌నూ మెలంకోవ్‌నూ నియమించారు. ఇద్దరూ విరోధులైనప్పటికీ ఈ కార్యనిర్వహణలో సహకరించవలసి వచ్చింది. ఆగస్టులో జడానోవ్ మృత్యువాత పడగానే అతని పదవి మెలంకోవ్‌కే లభించింది.

యుద్ధానంతరం కామిన్‌ఫారం స్థాపన నిమిత్తం తూర్పు యూరోపియన్ దేశాలు మినహా మెలంకోవ్ విదేశాల కెప్పుడూ వెళ్లలేదు. సామాన్యంగా అతడెన్నడూ రష్యావిడిచి ఎక్కడికీ వెళ్లడు. యోచనలోనూ, ఆచరణలోనూ, మాటలోనూ పూర్తిగా రష్యన్ అనిపించుకొన్నాడు. అన్యదేశాలంటే ఒక విధమైన అనుమానం, నిరసన గోచరిస్తాయి. లావుగా బొద్దుగా ఉంటాడు. చిన్నకళ్లు. ఆవేశంవచ్చినప్పుడు తల ఎగురవేస్తూ వాదిస్తాడు.

రష్యాలో అద్భుత వక్త అనిపేరు పొందాడు. ఉపన్యాసాంశాన్ని విపులీకరించి హృదయాకర్షకంగా మాట్లాడగలడు. మాట్లాడ్డంలో ఎక్కడా ఎప్పుడూ తడుముకోడు. లావుగా ఉన్నప్పటికీ చురుగ్గా నడవగలడు. అతని గృహజీవనం ప్రశాంతమైనదని చెప్తారు. విందులకూ నాటకాలకూ వెళ్లడు. వేట అంటే అతనికి చాలా ఇష్టం. కాని పార్టీ పనిలోనే కాలంయావత్తూ వినియోగపరుస్తాడు. చలనం లేకుండా క్రెమ్లిన్‌లో తన పదవిని నిలబెట్టుకోగల బహు కొద్దిమందిలో అతడొకడని అందరి విశ్వాసం.

తన అధికారాన్ని స్థిరపర్చుకోవడంలో మెలంకోవ్ సరిగ్గా స్టాలిన్ పద్ధతుల్నే అవలంబిస్తాడు. ప్రత్యర్థుల్ని వీలైనంతవరకూ దూరంగా నెట్టివెయ్యగలడు.

1927 లో ట్రాట్‌స్కీని వెళ్లగొట్టినప్పుడు స్టాలిన్ ఎంత పరపతిని ఆర్జించాడో ఇప్పుడు మెలంకోవ్ పార్టీలో అంతబలంగా పాతుకున్నాడు.

కామిన్‌ఫారంపైన సర్వాధికారంగల మెలంకోవ్ 1949 లో ప్రాధాన్యం గడించినందువల్ల రష్యన్ విదేశాంగవ్యవహార నీతిలో ముఖ్యమైన మార్పు వచ్చిందని చెప్పవచ్చును. ఇంతవరకూ మాలటోవ్ మికోయాన్ లిద్దరూ రష్యా విదేశాంగ వ్యవహార విధానాన్ని శాసించారు. అమెరికా బ్రిటన్‌లతో సమాలోచనలు సాగిస్తూ, వివిధ దేశాలలో ఎన్నికలలో పాల్గొని అధికారం కమ్యూనిస్టుల హస్తగతం చేయాలని వారి ప్రయత్నం. తూర్పుయూరప్‌లో రష్యన్ సైన్యం ఆక్రమణ ఫలితంగా ఈ విధానం చాలవరకు ఫలవంతమయింది. కాని జెకోస్లొవాకియా సంఘటనతో పాశ్చాత్యరాజ్యాలు కళ్లు తెరిచాయి. ఒకవంక మైత్రిసహకారాలు నటిస్తూ ఐక్యరాజ్యసమితిని బలపరుస్తున్నట్లు వ్యవహరిస్తూ, మరొకవంక తమకు అందుబాటులో ఉన్న రాజ్యాల్ని కమ్యూనిస్టుల పరంచేస్తూ వచ్చారు. ఈ మైత్రి సహకారాలలోనూ, సమాలోచనలు సమావేశాలలోనూ, సహకారం సంఘర్షణ, ఒక త్రాటిపైన నడిచాయి. రాజకీయ రాయబార తంత్రాలలో ఇది ఆట్టే కాలం కొనసాగలేదు. ఎన్నికల్లో పాల్గొన్న కమ్యూనిస్టులకు సంపూర్ణాధికారం లభించలేదు. సమాలోచనలు చర్చలలో పాశ్చాత్యరాజ్యాలను మరపించి, వెనుక తమ కార్యం సులువుగా నిర్వర్తించుకున్నారు. ఎన్నికల్లో లభించిన కొద్దిబలంతో కమ్యూనిస్టులు కొన్ని ఇతర రాజకీయపక్షాలతో చేరి, ఉభయుల బలంవల్లనూ లభించిన రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. ఈ కార్యంలో కూడా జెకోస్లొవాకియాలో బెదరింపులు ప్రయోగించవలసి వచ్చింది.

ఈ ఘట్టం తమ కోరిక ప్రకారం సంపూర్తిగా నెరవేరడం కోసం స్టాలిన్ అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థను రద్దుపరిచినట్లు ప్రకటించాడు. కాని ఆ సంస్థ వాస్తవానికి రహస్యంగా నిలిచే ఉందనీ, రద్దు కాలేదనీ పాశ్చాత్యులు చెప్తూనే ఉన్నారు. ప్రపంచ విప్లవం కోసం రష్యా కృషిచెయ్యదని రష్యన్ నాయకులు స్పష్టపరిచారు. బ్రిటన్, అమెరికా మొదలైన పెట్టుబడిదారీవర్గ దేశాలూ, సోషలిస్టు దేశాలూ సఖ్యతతో మెలగవచ్చునీ, ఇరువర్గాల మధ్యనూ సంఘర్షణ అనివార్యమనే వాదం వాస్తవం కానక్కర లేదనీ స్టాలిన్ అన్నాడు. దీని ప్రకారమే అంతర్జాతీయ వ్యవహారాలు కొంత కాలం నడిచాయి.

కాని పరస్పర అనుమానాలవల్ల సంఘర్షణ అనివార్యమే అయింది. దానికి ఫలితంగా పశ్చిమ యూరప్ రాజ్యాలను తన ఆధిపత్యం కింద బలపరిచి రష్యాకు విరుద్ధంగా ఏకం చెయ్యాలనే ఉద్దేశంతో అమెరికా మార్షల్ ప్రణాళికను అమలుజరిపింది. సంఘర్షణ పెరుగుతున్నకొద్దీ అమెరికా తన ఆర్థిక ప్రాబల్యాన్ని ప్రయోగించి అట్లాంటిక్ ఒడంబడిక తెచ్చింది. యుగోస్లావియాను అమెరికా తన పక్షానికి తిప్పుకోగలిగింది.

దీనితో ఇంక పాత పద్ధతులు ఉపకరించకుండాపోయాయి. అమెరికా మార్షల్ ప్రణాళికతోపాటు కామిన్‌ఫారం స్థాపితమయింది. కామిన్‌ఫారంతోపాటు పాత కమింటర్న్ రాజకీయాలు తిరిగి ప్రారంభమైనాయి. ప్రపంచ విప్లవంలో గాఢవిశ్వాసంగలవారు తిరిగి రష్యాలో బలవంతులైనారు. మాలటోవ్, మికోయాన్ల విదేశాంగ విధానం రద్దయింది. వివిధ దేశాలలో తిరిగి కమ్యూనిస్టుపార్టీల విప్లవ కార్యక్రమాలు ఎప్పటి ప్రాధాన్యతను పొందాయి. ఈ సంవత్సరం మెలంకోవ్ అధికార ఆరోహణతో ఈ మార్పు పూర్తిఅయింది.

"వరుసగా కొన్ని ఏళ్లనుంచి, భారతదేశం తన ఆదాయానికి మించిన ఖర్చుతో బ్రతుకుతూ వస్తూంది."

"మీరూ, నేనూ, మనం సంపాదించుకొన్నది ఖర్చు పెట్టవచ్చును. మనం కూడబెట్టుకొన్నది, లేదా ఇతరులు మనకు కూడబెట్టి ఇచ్చింది, ఖర్చుపెట్టుకోవచ్చును. పరపతి చెడకుండా ఉన్నంత కాలం అప్పులు చేసి తినవచ్చును. కాదంటే కష్టకాలంలో స్నేహితులు ఆదుకోవచ్చును. కాని, ఎన్నయినా చివరికి, వ్యక్తులమైనా, సంఘమైనా, దేశమైనా, జమాఖర్చులు సరిచూచుకోవలసిన బాధ్యతమాత్రం తప్పదు."

"మన భారీప్రణాళికలన్నీ, మనకున్న రాబడులన్నిటినీ మించిన ఖర్చులతో జరుగుతున్నాయి. మన పెండికొద్ది మన కొట్టెప్రమాణాన్ని, సంక్షేపపరుచుకొంటేతప్ప, మన ఖాన్సలో ప్రారంభించిన, ఇన్‌ఫ్లేషన్ ప్రతికూల ప్రణాళిక ధ్వంసమయ్యే ప్రమాదం కలదు."

ఈ ప్రవచనాలు, భారతప్రభుత్వ ఆర్థికశాఖామంత్రీ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు గవర్నరుగారూ, చెప్పినమాటలు. మన ఆర్థిక సమస్యను మూలమట్టంగా తరుస్తున్నాయి ఇవి. మొదటిది, భారతప్రభుత్వఆర్థికమంత్రిప్రవచనం. నిజంగా మనకు చాలా కనువిప్పుగా ఉండవలసినమాట. ఆ మంత్రి అనుభవిస్తున్న అసహాయస్థితిని మనకు గోచరింపచేస్తుంది. ఆర్థికమంత్రి, పైనుండి సాధికారికంగా వ్యవహరించ వీలులేకపోతుందనీ, కాంగ్రెస్ ప్రభుత్వానికి డబ్బు చేకూర్చిపెట్టే నాసిక్‌లో ప్రవాహంలో పడి తనూ కొట్టుకుపోతూ విలపిస్తూన్నంత మాత్రంగానే ఉన్నాడనీ స్ఫురింపచేస్తోంది. దేశం, రాబడిని మించిన ఖర్చు చేయటానికి, ఆర్థికమంత్రాంగము ఎట్లా అంగీకరించింది అనేదే ప్రశ్న. వాళ్లు అంగీకరించలేదు. అసలు వాళ్ల అంగీకారంకోసం పాకులాడినవాళ్లే లేరు. పోనీ ఇప్పటికైనా ఆర్థికమంత్రికి పూర్వాధికారము ఇచ్చారా అని ప్రశ్నించుకొంటే, ఊహూఁ అదీలేదు. ఇప్పుడు భారతదేశం తన రాబడిమాత్రంలోనే బ్రతుకుతూందా? లేదు! ముమ్మాటికీ లేదు. 1950-51 భారీప్రణాళికలను చూసుకొంటే ఈవిషయం స్పష్టమౌతుంది.

80 కోట్ల రూపాయలు అదనంగా కూడబెట్టున్నామని పెద్దపెట్టున, అంకెలు చూపిస్తున్నారు. కాని 1950/51లో 140 కోట్ల రూపాయల వ్యయము భారీప్రణాళికలు కుద్దేశిస్తూన్నా రన్నది మరచిపోతూన్నారు. ఈ నూటనలభైకోట్ల రూపాయలూ ఏ కాతాలోనుంచి తీసి యిస్తారా అనేదే ముఖ్యప్రశ్న. ఈ భారీప్రణాళికలకు కావలసిన డబ్బు సృష్టించనైనా సృష్టించాలి. లేదా ఋణాలైనా చెయ్యాలి. కొత్తధనం సృష్టించి ఇన్‌ఫ్లేషన్ మరింత పెంచటం ఏమాత్రం సాధ్యపడదు. పోగా ఇక ఋణాలు చెయ్యటం. గత రెండేండ్లుగా 'మనీమార్కెటు'లో ప్రభుత్వం ప్రవేశం కల్గించుకోలేదు. అక్కడ తన పరపతి ఎల్లా ఉందో తేలక ప్రభుత్వం మనీ మార్కెటులో కాలుపెట్టలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వచ్చే సంవత్సరంలోగా, 140 కోట్ల రూపాయల ఋణాన్ని చేయగల్గేందుకు పరిస్థితులు ఏమంత బాగుపడలేదు. ఈలోపునే మంత్రివర్గాలకు కావలసినధనం మొత్తాలు కేటాయించేశారు. వాళ్లు ఖర్చుకరాములన్నీ అప్పుడే సాగించేస్తున్నారు. ప్రభుత్వం ఋణధనాన్ని సేకరించగల్గినా సేకరించలేకపోయినా వాళ్ల ఖర్చులు వాళ్లు సాగించేదే! వాళ్లకు కేటాయించిన డబ్బు వాళ్లకు ముట్టవలసిందే. అంటే చివరికి ప్రభుత్వం నాసిక్‌లోని కరెన్సీ అచ్చాఫీసులో డబ్బు సృష్టిసుందనే అనుకోవాల్సి వస్తూంది. అంటే ఇన్‌ఫ్లేషన్ మరింత పెంచటమే.

మా ఢిల్లీలేఖ

ఆదాయంమించిన ఖర్చు

శ్రీ కృష్ణ

(ఆంధ్రపత్రిక ప్రత్యేక విలేఖరి)

1950/51 లో రాష్ట్రాలకిచ్చే గ్రాంటులన్నీ ఆపెయ్యటానికి ప్రభుత్వం నిశ్చయించింది. అదే సందిరిగా, వయోజనవిద్య, ఎయిరోడ్రోమ్ నిర్మాణాలు, కొత్తరోడ్డు నిర్మాణాలు ఇల్లాంటి పౌరజనవ్యయాల గ్రాంటులుకూడా ఆపరాదా? 150 సంవత్సరాలుగా వయోజన విద్యలేకుండా భారతదేశం బ్రతికింది. ఇంకొక్క ఐదేళ్లు ఆగితే వచ్చిన ఆపద ఏమీ లేదు. శాసనసభాసభ్యులు సభాభవనం అంటూ లేకుండానే ఇన్నాళ్లు గడుపుకొన్నారు. ఈ క్లిష్టసమయంలో వెంటనే సభాభవనం లేదని గగ్గోలుపెట్టే స్థితిలో వాళ్లూ ఉండిఉండరు. అయితే ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉన్నామని మంత్రులు గ్రహించలేదేమో! పరిస్థితి అవగాహన చేసికొని స్థిరచిత్తంతో ఎదుర్కోటానికి నిరాకరిస్తున్నారు. ఎవరికివారు, తమ శాఖ అవసరాలు, ఆ సంకుచితదృష్ట్యామాత్రమే చూస్తూ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. తమతమ శాఖలు పుష్టిగా ఉంచుకోగలిగితే, భారతదేశం "మునుగుతోందా తేలుతోందా" అన్న విషయమే వాళ్లు పట్టించుకోడంలేదు.

ఉదాహరణకు ఒక్క విషయం చూసుకొందాం. పబ్లిక్‌వర్క్సుశాఖవారు శాసనసభాసభ్యులకు వసతిగృహనిర్మాణార్థం డెబ్భైఐదు లక్షల రూపాయల ఖర్చు కేటాయించారు. ఏ అంతస్తు కా అంతస్తు స్వయంసమృద్ధంగా వంట ఇళ్లూ అన్నీ కలిగిఉండేటట్లు భవనం నిర్మించటానికి ప్లాను వేశారు. 30 ఏళ్ల క్రిందట ఇలాంటి వసతిగృహం నిర్మాణమయి ఉంది. దాన్ని "ఈస్టర్న్ కోర్ట్" అంటారు. నానాట ఆ భవనం ఖాళీగా ఉండి చివరికి టెలిగ్రాఫ్ డిపార్టుమెంటువారికి అమ్మేశారు. ఇప్పుడు అందులో సెంట్రల్ టెలిగ్రాఫ్ ఆఫీసు ఉంది. ఈ అనుభవం వల్లనైనా, ఆ శాఖవారు ఏమాత్రం వెనుదియ్యకుండా, డబ్బూ, గృహోపకరణాలూ, రెండూ తక్కువగా ఉన్న ఈరోజుల్లో మళ్ళీ ఈపనికి పునః ప్రారంభిస్తున్నారు.

ఈభారీప్రణాళికలు, బడ్జెటులో ఒకభాగం మాత్రమే. ఇక రివిన్యూ బడ్జెటు ఉంది. ఇంతకన్నా చాలా ముఖ్యమైనది. దీనివిషయంలో, "ఆర్థికసంఘనివేదిక" చర్చలో శ్రీ బి. దాస్ గారిచ్చిన విభేద అభిప్రాయం గమనించతగ్గది.

"ఒక్కొక్కమంత్రి కేవలం తన వ్యక్తిగత అభిప్రాయాలను పురస్కరించుకొని, అంతకంతకు పెంచుతున్న అమితవ్యయాలను ఖండిస్తూ, ఇప్పటికైనా ఆపెయ్యవలసిందని, నాలో కల్గిన అభిప్రాయాన్ని క్లుప్తంగా, ఈనివేదికలో లిఖితంచేస్తున్నాను. ముందు, ఆహారం వ్యవసాయక మంత్రిత్వ శాఖలను తీసికొంటాను. అధికాహారోత్పత్తి "ప్రచారంలో" ఉన్నంత శ్రద్ధ వాస్తవికంగా అధికంగా ఆహారం పండించటలో కనబడటంలేదు. 1941నుంచి విదేశాలనుంచి ఆహారధాన్యాలు కొనటం ఉండదని మన ఆహార, వ్యవసాయశాఖామంత్రాంగశాఖవారు హామీఇస్తున్నారు. ముందు ఈరెండుశాఖలూ, ఒక కార్యదర్శిక్రింద పనిచేసేటట్లు కలపాలి. అసలు ఇప్పుడున్న నాలుగు మంత్రిత్వశాఖలు, ఒక్క కార్యదర్శిక్రిందకు తీసుకురావాలని, మరొకచోట నేను నివేదించాను. ఆహార, వ్యవసాయ శాఖల్లో, ఉద్యోగులు, నిపుణులసంఖ్య, అత్యమితంగా పెరుగుతున్నా, న్యూఢిల్లీలో, అంతకు ముందునుంచే ఉంటూన్న, "ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసర్చి" (భారత వ్యావసాయిక పరిశోధకసంఘ, సిబ్బంది కూడా దీనితోపాటు ప్రక్క ప్రక్కనే పెరుగుకుంటూనే వస్తూంది.

మునుపటి విద్యా, ఆరోగ్య, భూములశాఖ, ఒక్క సలహా రుక్రింద ఇన్ని వ్యవహారాలు జరగటం కష్టమని 1929 లో ఇంపీరియల్ వ్యావసాయకపరిశోధకసంఘాన్ని నిర్మించింది. ఏటేటా ఆ సంఘం, రాష్ట్ర, సంస్థాన, మంత్రులను, వ్యావసాయోద్యోగులను పిలిచి, ఒక "జాతర" జరిపి, అంతటితో సంతృప్తిపడి ఊరుకునేది. ఆ పరిశోధకసంఘం, ఉద్యోగంలో ఉన్నప్పటికీ, వ్యవసాయమంత్రిత్వశాఖవారు, తమక్రింద స్వంతనిపుణులను ఉద్యోగించటానికి ఏమీ సంకోచపడలేదు. విభజనకుపూర్వం ఈ ఉద్యోగాలను అమితంగా పెంచుకొంటూపోయారు. ఆ సాంప్రదాయం స్వతంత్రం వచ్చాకకూడా ఇప్పటికీ అల్లాగే నిలబడిపోయింది. కాబట్టి అనవసరమైనచోట్లల్లా సిబ్బందిని తగ్గించి పనిలేని ఉద్యోగాలు తీసేసి ఖర్చు తగ్గించాల్సిందని నేను సూచించాను. వివిధ ముడిపదార్థాల సంఘాల ద్రవ్యనిధులూ, "వ్యవసాయ పరిశోధక సంఘం వారి" అజమాయిషీలలోనే ఉన్నాయి. కాని ఈ అజమాయిషీమాత్రానికి ఒక డిప్యూటీ కార్యదర్శిని వేస్తే - ఆ సంఘాని కిప్పుడున్న శాశ్వతకార్యదర్శిని. ఉపకార్యదర్శిగా నియమిస్తే - చాలును. అంతేకాని, ఒకేపనికి రెండురెండు పారుపత్తేలు పెట్టుకొంటూ కూర్చోటం ఇక పనికిరాదు.

నా వ్యవసాయశాఖామంత్రి, వెంటనే అఖిలభారత వ్యవసాయ,- సహకారసంఘాన్ని స్థాపించాలని అనుకుంటున్నారు. ప్రతివ్యవసాయదారుడినీ స్వయంగా కలుసుకొని, సలహాలు, విత్తులు, ఆర్థికసహాయం, చేయగలిగేందుకు, అఖిలభారత వ్యవసాయ,- సహకారసంఘాన్ని స్థాపించాలని ఉద్దేశిస్తున్నారు. ఆ పని జరిగిఉంటే "అధికాహారోత్పత్తి," ఇంత అధ్వాన్నంగా నిష్ఫలమైఉండేది కాదు.

కార్మికమంత్రిశాఖ విషయంలో కూడా ఈ సలహానే మరింత గట్టిగా ఇస్తూన్నాను. ఈ మంత్రిత్వశాఖలో, భావాలూ, ప్రణాళికల ఊహలూ కూడా, అతివ్యాప్తంగా పెరుగుతున్నాయి. భారతదేశ జీవనప్రమాణాలతో సంబంధంలేని, విదేశవిధానాలను ఎరువుతెచ్చుకొని ఊహిస్తున్నారు.

కలల నన్నిటినీ నిజం చేసేందుకు, నాసిక్ కరెన్సీ అచ్చుఆఫీసులో ఎక్కువ నోట్లు అచ్చువెయ్యాలని వీళ్ల 'సామ్యవాదాత్మకభావత'

ఒక్కొక్కమంత్రిత్వ శాఖ, కార్మిక, ఆరోగ్య, విద్యా, వ్యావసాయిక శాఖలు, చేస్తూన్న అధికవ్యయాలను తగ్గించేందుకు కేబినేటుఅధికారం ఉంచుకోకపోతే, దేశవ్యయంలో పొదుపు అనేది సమకూడటం దుర్లభం.

అసలు ప్రభుత్వవిధానము, మంత్రివర్గమంతా కలిసి నిర్ణయించవలసింది. ఏశాఖ కాశాఖా, ఆమంత్రీ, స్వతంత్రుల మనుకొంటూ, తమ ఖర్చులవిషయంలో తమ మాటే తుదినిర్ణయంగా భావిస్తున్నట్లున్నారు. అసలు ఆర్థికమంత్రిశాఖ, ఆడిటర్‌జనరల్ వీళ్లకు అధికారమేమిటని వీళ్లలో కొందరు వెక్కిరింపచూస్తున్నారు కూడా.

ప్రతి కొత్తఖర్చుతోకూడిన ప్రణాళికనూ ఆర్థికసంఘంవారు ఇకముందునుంచీఐనా పునర్విచారణ చేస్తారని నేను ఆశిస్తున్నాను.

కార్మికశాసనాలు పజన్లకొద్దీ తయారయాయి, వీట్లనుబట్టి అయ్యే ఖర్చు, కేంద్రంగాని, రాష్ట్రాలుగాని భరించగలవా అనేదే గమనికలోకి రావటం లేదు. యుద్ధావసరానికి సృష్టింపబడ్డ ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజి—మహాప్రయోజనకరమైన శాఖ అంటూ పొగిడి ఆకాశాని కెత్తేస్తూన్నారు. రాష్ట్రప్రభుత్వాలు ఈవ్యయోగం భరించలేనిచోట్లనైనా, ఈశాఖను ఎత్తివెయ్యాలని నేను సూచిస్తున్నాను. కేంద్రప్రభుత్వంకూడా కేంద్రపాలితస్థానాలైన, ఢిల్లీ అజ్మీర్, మేవార్లలాంటిచోట మాత్రమే ఈ ప్రమేయం కల్పించుకోవాలని సూచిస్తున్నాను.

విద్యాశాఖవిషయంలో - ఈ శాఖ సంఘసేవశాఖామంత్రికిందనే ఉండాలని నేను సూచించాను. కేంద్రప్రభుత్వము, రాష్ట్రాలకూ, సంస్థానాలకూ, ప్రాథమిక, శాస్త్రీయవిద్యలకు ధనం సరఫరా చేసేటంతమట్టుకే ఇందులో తన ప్రమేయాన్ని పరిమితం చేసుకోవాలి. అదికూడా ఆడ్‌హాక్ సంఘాలద్వారా విశ్వవిద్యాలయాలకు, టెక్నికల్ కాలేజీకేంద్రాలకు ఇచ్చే గ్రాంటులు సరిగా సాగించుకొంటే, కేంద్రవిద్యాశాఖలో ఇంత పెద్దసంఖ్యలో ఉద్యోగవర్గం అనవసరం అవుతుంది. కేవలం పని తక్కువవటం మాత్రమే, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, మంత్రివర్గాలు, ఢిల్లీనే మహా కేంద్ర విద్యాస్థానంగా చెయ్యాలని సంకల్పిస్తూ, వ్యవసాయ కళాశాల, ఢిల్లీ పాలీటెక్నిక్, డ్రగ్ ఇన్‌స్టిట్యూట్, స్త్రీ వైద్యకళాశాల, మొదలైన కొత్తవన్నీ ప్రారంభిస్తూన్నారు. ఇంతపెద్దఖర్చుపెట్టి, ఇప్పుడీ కొత్తవాట్ల నన్నిటినీ మొదలెట్టటం ఎందుకో అర్థంకావటంలేదు. పోనీ శైశవస్థితిలో ఉన్న ఢిల్లీవిశ్వవిద్యాలయాన్ని పరిపుష్టం

(21-వ పేజీ చూడుడు)

గాంధీవాదము - సామ్యవాదము

సంఘర్షణ - సమన్వయము

మూలం:
శ్రీ కాకా కాలేల్కారు

అనువాదం:
శ్రీ పులగంపల్లె గోవిందరెడ్డి

గాంధీజీకార్యక్రమన్ని సామ్యవాదముతో సరిపోల్చి చూడవలసివచ్చినప్పుడు, దానిని 'గాంధీవాద' మని పేరుపెట్టి పిలువవలసి వస్తుందేలోనన్న భయం నన్ను బాధిస్తూవుంది. గాంధీజీ ఉద్దేశ్యాన్ని, కార్యక్రమాన్ని గుర్తించిన వారంతా 'గాంధీవాద' మనే వస్తువు లేనే లేదంటూవచ్చారు. గాంధీజీకూడా తనేదీ క్రొత్త సిద్ధాంతాన్ని ఆవిష్కరించలేదని అనేక పర్యాయాలన్నాడు, వ్రాశాడు. సనాతనకాలంనుండీ మానవజీవితము మానసమాజము ఏసిద్ధాంతాల్ని, తత్వాల్ని గౌరవించి వాటి ఆదేశానుసారంగా నడిచాయో వాటినే వ్యాపకమొనర్చి సార్వభౌమత్వాన్ని పొందించ ప్రయత్నించాడు. కౌటుంబికజీవితములో మానవుడు ఏ సిద్ధాంతాల్ని, తత్వాల్ని నిర్విఘ్నంగా పాలించగలుగునో వాటినే వ్యాపకక్షేత్రములో అమలుపరచ సాహసించజాలడు. మానవ హృదయం యింతవరకూ అంతయిదిగా వికసించిఉండలేదు. అతని శ్రద్ధాభక్తులుకూడా అంత వృద్ధిపొందలేదు. 'ప్రేమ' అనే శక్తిమీద విశ్వాసాన్ని స్థిరం చేయడానికి చాలినంత ఆస్తికత్వము మానవజాతిలో బహిష్కృతము కాకుండా వుంది. దీన్ని బయల్పరచడమే గాంధీజీప్రయత్నం. యిలాంటి స్థితిలో గాంధీజీఉద్దేశ్యములోకానీ, కార్యక్రమములోకాని వాదానికి చోటిచ్చుట సర్వథా అనుచితము. అయినాకూడా గాంధీమతాన్ని, సామ్యవాదాన్నిగురించి చర్చించేటప్పుడు స్వభావసిద్ధంగా 'గాంధీవాద' మనే అనేస్తాము.

గాంధీవాదము, సామ్యసత్తావాదము, యీ రెండే యీరోజుల్లో ఎక్కువ వాడుకలో వున్నవి. యీరెండు మార్గాలవారూ కలిసి యితర అన్నిమతాల్ని అన్నివాదాల్ని త్రోసిపారేశారు. మనదేశంలో యీరెండు విధాలయిన మార్గాలు మాత్రమున్నాయి. కానీ ఉద్దేశ్యపూర్వకంగా ప్రజలు వీటినిగురించి అంత శ్రద్ధ ఉంచడములేదు ప్రపంచములోవున్న వాదాలన్నిటిలోనూ 'గాంధీమతం' 'సామ్యసత్తా' వాదానికి స్థానములుందని గట్టిగా చెప్పవచ్చు. యూరోపులో చెలరేగివుండిన ఫాసిజానికి మహోజ్వలభవిష్యత్తు కన్పించకుండా వుండినది. ఫాసిజంలో సమర్థత తక్కువ కృతార్థత లేనేలేదు

'గాంధీవాదము : సామ్యవాదము' అనే శబ్దవ్యవహారముకంటే 'సర్వోదయ సామ్యవ్యవస్థా', 'సమాజసత్తాగూలమైన సామ్యవ్యవస్థా' అనే శబ్దాలప్రయోగం ఎంతైనా బాగుంటుంది. ఎందుకంటే సర్వోదయశబ్దంతోపాటు అహింసా, సత్యాగ్రహభావం రానేవస్తుంది. 'సమాజసత్తా' శబ్దంతోపాటు సామాజికవిప్లవాత్మక రాజనైతికశక్తియొక్క భావంకూడా స్పష్టమవుతుంది.

ఈ రెండుమతాల ఆదర్శములో చాలామట్టుకు సామ్యముందని మొట్టమొదట జ్ఞాపకముంచుకోటానికి యోగ్యమైన విషయం. రెండుమతాలకు అన్యాయప్రవర్తనగల సమాజముంటే అసహ్యం. రెంటినీ సమానంగా గౌరవించాలి. రెండూ అర్థానర్థాల్ని చూడగలిగినవి. రెండూ విప్లవాత్మమైన భావాలుగలవే. రెండూ మానవ జీవితఅంతిమస్థితిలో రాజశక్తిని నాశనము చేయాలనే ఉద్దేశ్యముతో వున్నాయి. మానవజాతి సుసంస్కృతిము, సుసంఘటితమైనపుడు దానిమీద ఏవిధమయినట్టీ బాహ్యనియంత్రణశక్తి అనవసరము. రాజశక్తి ప్రజ్వలించడం మానవజాతిసంస్కృతికి తీరని అవమానం. అందరూ సజ్జనులైపోతేనో లేక ఏమూలనుండకూడా దుర్జనత్వంయొక్క ఆకర్షణ లేకుండాపోతేనో, బయటిశక్తితో పనిలేకుండా మానవుని సామాజిక జీవితం బాగా గడుస్తుంది. కానీ యిరుపక్షాలలోను ఎవరికివారు శుద్ధశాస్త్రజ్ఞులుగా, వ్యావహారిక జ్ఞానముగలవారుగా తలంచుకొంటున్నారు. గాంధీజీ తన్నుతాను వ్యావహారికఆదర్శవాదిగాను, సామ్యవాదులు తమ్ముతాము విజ్ఞానవేత్తలు తేల్చిచూపారు. యిద్దరియొక్క కార్యపద్ధతుల్లో విభిన్నత్వ మిది. గాంధీజీదార్శనికత్వం మానవుని వ్యక్తిగతశక్తిమీద విశ్వాసముంచి నడిచేది. 'సమాజసత్తాదార్శనికత్వము' మానవుని సామాజికశక్తిమీద ఆధారపడి నడిచేది. గాంధీతత్వం సామాజికన్యాయ సమన్వయ దృష్టితోనూ ఆధ్యాత్మికవికాసదృష్టితోనూ జీవితంలో తప్పనిసరిగా సాదాతనం అవలంబించాలి. రెండవ మతం (సామ్యవాదం) దీనికి విరుద్ధంగా వుంది. అదేమిటంటే, మానవుడు తన అవసరాల్ని అరికట్టకూడదు. అభివృద్ధిచేసుకుంటూనే ముందుకుపోవాలి సామాజికన్యాయదృష్ట్యా, మానవీయ వికాసదృష్ట్యా అవసరాలు సాధనసామగ్రికి అత్యంత దోహద మిస్తుంటాయి. కానీ ఆటంకములు కావని వారి విశ్వాసం.

సమాజసత్తాయొక్కముల్లు, బలం, సంపద, ప్రపంచసఖ్యంవైపు మొగ్గుతుంది. యిటు గాంధీతత్వం ఎంతవరకూ సాధ్యమో సత్తాను (బలప్రయోగం) నిర్మూలించ ప్రయత్నించవలెనంటుంది. యింతేకాకుండా సంపద యావత్తూ వర్షబిందువుల్లా సమాజములోని వ్యక్తులందరి చేతుల్లోనూ చెల్లాచెదురుగా అయిపోవాలి. జనసంఖ్య పెద్దపెద్ద పట్టణాల్లోనూ, మిల్లుల్లోను యితర కార్ఖానాల్లోనూ పనిచేస్తూవుండిపోవడంకంటే, గ్రామాల్లో తమతమ పొలాల్లో వేరువేరు వ్యవసాయవృత్తి నవలంబించడము మంచి దంటుంది.

రెండుపక్షాలు బలవత్తరమైన ప్రచారప్రవృత్తి గలవి. అయినా గాంధీజీ, వ్యక్తుల జీవితంలో పరివర్తన కలిగించిదాని ద్వారానే సామాజికజీవితమును మార్చ ప్రయత్నిస్తాడు. సామ్యవాదులలాకాకుండా వ్యక్తుల అభిప్రాయాల్లో నే మార్పు తెచ్చి దాని ప్రభావం రాజశక్తిమీద ప్రయోగించి ధానిచట్టప్రకారంగా సమాజవ్యవస్థలో ఒకేసారి విప్లవం (మార్పు) తెచ్చిపెట్టాలని కోర్తారు. అందరి విచారాల్లోనూ మార్పురానంతవరకూ శాసనచట్టాల్లోనూ మార్పు రాదని వారంటారు. డబ్బు, సామర్థ్యము, సత్తా, ఉన్నవాళ్లు సులభంగా వారు వాటిని వదలడమసంభవము. కొంతిమంది సాధుత్వముయొక్క ఆదర్శాల్తో, వైరాగ్యముతో, లేదా సమాజసేవాభావంతో ధనాన్ని, సత్తాను, వదలుకోగలరు. కానీ సమాజములో యిలాంటివాళ్లు అరుదు. యిందువల్ల సత్తా, సంపదలేనివాళ్ళనే జాగ్రతపరచి వారి మెజార్టీయొక్క సామర్థ్య లాభాన్ని పొంది, దానిద్వారానే చట్టాల్లో మార్పుచేయాలి.

రాజసత్తా అకించనులచేతిలో ఉంచాలి. ఒకసారి అకించనుడు సత్తాధారి అయిపోతే, తరువాత సంపదా, దాన్ని అభివృద్ధిపరచే సాధనాలు ధనవంతులచేతుల్లోంచి గుంజి సమాజంయొక్క చేతుల్లో ఉంచడ మెంతైనా సులభమయినపని. యిదే వ్యావహారికమార్గం. ఒకవేళ యీ విప్లవాన్ని ధనికులు స్వాభావికంగా జరగనిస్తే 'హింస, కిందులో స్థానము లేదు కానీ ఒకవేళ ధనికులు మెజార్టీకి లోబడిఉండకుండా బీదలశాసనానికి విరుద్ధంగా కుట్రలు పన్నుతూ వుంటే వారి నణచడమూ శాసించడమూ హింసద్వారానైనా జరపాలసివస్తుంది. మెజార్టీనూటే సర్వమాన్యమైతే రక్తపాతము లేకుండానే మార్పు జరుగుతుంది. కానీ శాసనాధీశులు, ధనపతులు, యావిప్లవాన్ని జరుగనివ్వకుండా అరికట్టడానికి ప్రతిఘటము లేవదీసే ఘోరరక్తపాత మయ్యేవరకూ కథ నడవచ్చు. యిందుకుగాను బాధ్యతంతా మెజార్టీని విరోధించినవారి తలమీదనే వుంటుంది. యిదే సామ్యవాదముయొక్క దార్శనిక భూమిక. యీ భూమికమూలంలో మెజార్టీశాసనానికి ఏమాత్రం గౌరవము లేదనేవిషయం నిర్వివాదాంశము. తన కష్టార్జితధనంమీద - పవిత్రంగా భావించి ఒప్పుకోబడిన్న - వ్యక్తిగత అబాధితశాసనమంటే సామ్యవాదికి లేశంకూడా విశ్వాసం లేదు. ధనాన్నే విరంగా పముపాయంచాలో సామ్యవాదసహకారం లేనిదే కానే కాదని వారనేది. అందువల్ల యీ వున్న ధనసంపత్తులన్నీ సామాజికవస్తువులు. గాలిమీద నీటిమీద ఏవ్యక్తికి గాని ఏవిధంగా హక్కులేనో అదేవిధంగా ఏవిధమయినటువంటి ధనంమీద వ్యక్తిగతహక్కు లేదు. మామూలుగా గాలినీ, నీటినీ కావలసినంత తీసుకోడానికి ప్రతిఒకణికి సంపూర్ణహక్కు వుంటుంది. విజ్ఞానసహాయముతో అన్నవస్త్రాదులు మొదలయిన అన్నివస్తువులు సామాజికసహయోగముతో ఉత్పత్తి చేయవచ్చు. అప్పుడు గాలి నీళ్లమాదిరి కాకపోయినా పర్యాప్తంగానైనా అవసరాలకు తగినవస్తువులు సమకూర్చవచ్చు. అలాంటప్పుడు దొంగతనంచేయ ఎవణికీ యిష్టముండదు. పరిశ్రమను త్రోసిపుచ్చే ప్రవృత్తికూడా ప్రజల హృదయంలో తగ్గిపోతుంది. పరిశ్రమ చేయుటలో ఆనందమయంగా వుండేటంతలో సఫల చేసినపనివల్ల మానవసమాజముయొక్క అవసరాలు పూర్తిఅవుతాయి.

సర్వసామాన్యంగా ఒకే చిత్రాన్ని నిరూపించడానికి వీలులేనన్ని సామ్యవాదాలు ప్రపంచమంతటా అనేక ప్రణాళికలతో భిన్నభిన్న ప్రయోగాల్తో ప్రబలిపోయినవి. ఎన్నో ప్రణాళికలు సౌమ్యంగానూ మరెన్నో అత్యంత కఠినంగానూ వున్నాయి. వీటి తారతమ్యరహస్యాన్ని కనిపెట్టి వీటిని వేరువేరుగా పేర్లుపెట్టి పిలిస్తే తక్కువన్నా కొన్ని దశాంశాలుంటాయి.

యీవిమర్శనలో జ్ఞాపక ముంచుకోవలసిన విషయాలెన్నో వున్నాయి. గాంధీజీయొక్క దార్శనికసిద్ధాంతము స్పష్టంగా శబ్దబద్ధం కాలేదు. యీ విధంగా చేయడము గాంధీజీ పద్ధతి కూడా కాదు. ఏదో ప్రసంగాన్ని నచ్చచెప్పడానికే ఆయన తత్వచర్చ సాగిస్తాడు. ప్రసంగ మేమిటో నేలిపోయినతరువాతనే తన యిష్టదేవతలైన సత్యాహింసలతో తత్వనిర్ణయ మడుగుతాడు. వాటి జవాబు పొందిన తరువాత అనన్యనిష్ఠతో దాన్ని పాలిస్తాడు. యిందువల్ల గాంధీజీదార్శనిక సిద్ధాంతాల్ని తాత్వికరూపంలోని వ్రాతల్ని పొందలేము. యిందుకు విరుద్ధంగా సామ్యవాద సిద్ధాంతాలు ప్రచురించబడినాయి. యిటువంటి స్థితిలో యీ రెంటినీ త్రాసులోవేసి తూచడమనేది కఠినమైన కార్యమే. సరిసమానంగా తూగజాలవు, తూగేరకంగాకూడా లేవు.

రెండుపక్షాలు కలిసిమెలిసి పనిచేస్తే చూడాలని తీవ్రమైన అమాయకపు అభిలాషవున్నవారు రెంటికీ మధ్య వున్న ఆదర్శభేదాన్నీ సాధనభేదాన్నీ మూసిపెట్ట ప్రయత్నిస్తారు. యీ రెండుమార్గాలు పూర్ణంగా పారమార్థికంగా లేనట్టయితే రెంటిలోనూ విశేషఅభిప్రాయభేదం లేదని యిద్దరూ ఒప్పుకొందురు. రెంటినీ గుర్తించినవారు రెంటి మధ్యవుండే భిన్నత్వం ఒకవిధంగా కాదు, తాత్వికంగా, మౌలికంగా, తీవ్రమైనవి అటలమైనవని ఎరుగుదురు. యీ రెంటిలోనూ సఖ్యత కొంతకాలమువరకూ ఏర్పడవచ్చు. కొంచెం ముందుకు సాగిపోతూ రెంటిమధ్య అప్పుడప్పుడు సంఘర్షణ, సంగ్రామము జరిగే సూచన పొడసూపుతూవుంది.

'సంగ్రామ' మనే ఆలోచన మనసులో పుడుతూనే కల్పన దాన్ని చిత్రించ కోరుతుంది. ఎందుకంటే ఆ సంగ్రామ మపూర్వమైంది. సమాజవాదముయొక్క సంగ్రామపద్ధతి పూర్తిగా - క్రొత్తదిగా పలురూపాలుగా వుంటుంది. అందులో ఏవిధమయినట్టీసంశయ ముండదు.

యిక్కడ గాంధీజీ - గాంధీజీమార్గాల - సంగ్రామపద్ధతికూడా విచిత్రంగా వుంది. గాంధీజీతో పోట్లాట నీటితో. పోట్లాట నీరుకన్పడుతుంది. ఆగ్రహము లేనిది అటులజీ నధర్మావలంబి. వేడిచేస్తే ఆవిరిరూపాన్ని ధరించి అదృశ్యమైపోతుంది. కానీ గాలిలో వెంటనే విప్లవాన్ని తెచ్చిపెడుతుంది. హద్దుకు మించివల్లచేస్తే రాతిమాదిరి బలిష్ఠమైపోతుంది. మామూలు వాస్తవికనియమాల్ని తెంచుకొని తన ఆకారాన్ని కూడా అభివృద్ధిచేసుకొంటుంది కోస్తే తెగదు. కాలిస్తే కాలదు గాంధీజీతోటి యుద్ధమిలాగే వుంటుంది. వాస్తవములో గాంధీజీ యుద్ధం దైవికమైంది. సామ్యవాదానికీ గాంధీ తత్వానికీ మధ్య సంఘర్షణ ఏర్పడితే స్వర్గలోకములోని దేవతలు విమానాల్లో కూర్చుని చేతుల్లో మాలలు ధరించి రెప్పపాటు లేకుండా చూస్తూ వుంటారు.

సామ్యవాదాన్ని ఆమూలాగ్రంగా అధ్యయనము చేయనివారే సాధారణంగా సామ్యవాదాన్ని విరోధించి మాట్లాడుతూవుంటారు సామ్యవాదులమీద మోపే నేర మేమిటంటే సామ్యవాదులు వాగ్శూరులేగాని చేసేదేమీ లేదని. బహుశా యిది మనదేశానికిగాను అన్వయించవచ్చు. సామ్యవాదముయొక్క తాత్వికలక్షణాలు యితరవాదాలకంటే తక్కువ బిగువులో లేవు. అన్యత్రదేశాల్లో అచ్చటి ముఖ్యకర్మయోగులు సామ్యవాదాన్ని లెక్కలేనన్నిరీతుల ప్రయోగించిచూశారు. రష్యాలో సామ్యవాదానికి సఫలత్వంకూడా బాగానే సిద్ధించింది.

హిందుస్థానములోని సమాజవాదులుకూడా సామ్యవాదంమీద విశ్వాసముదయించకముందు, గాంధీదళములో వుండి గాంధీమతాన్ని గట్టిపట్టుదలతో ప్రచారంచేసి సమయమొచ్చినపుడు యితరులతోపాటు బలిదానమివ్వడానికి పూనుకున్నారు. యిటువంటివారు సామ్యవాదులయినంతమాత్రాన్నే వీరిని ఎగతాళి చేయడము లాభమైనపని కాదు. సామ్యవాదాల్ని ఎగతాళిచేసి పుస్సని ఊదేయడానికి అదంత తేలికయిందీ అమాయికమయింది కాదు

యీ రెండు, దార్శనిక త్వాల్ని తూచడములో మరో కష్టమొచ్చిపడుతుంది. గాంధీజీ స్వయంగా తనపద్ధతిని ప్రచారముచేయుటలో అసాధారణమయిన సఫలప్రచారకుడని ఒప్పుకోవాలి. ఆయనప్రచారము మనోవాక్కాయకర్మల ననుసరించే సాగుతుంది ప్రతిపక్షీని జయించుటలోకూడా ఆయన కుశలుడు. అయినాకూడా గాంధీపక్షం ప్రచారానికి విముఖత చూపుతూవుంటుంది. 'ప్రచారాన్ని అరికట్టండని' గాంధీజీ అంటుండేవాడుకూడా. సామ్యవాదమలా కాదు ప్రచారమంటే ఎత్తినచేయి. ప్రతిపక్షులతోనూ తమ పక్షంలోనే భిన్నాభిప్రాయాలు వుండేవారితోనూ వాదించేటప్పుడు వారికి అలసటే వుండదు.

యిక యీ యిద్దరి కార్యప్రభావము ప్రజల హృదయముమీద ఎలా పడుతుంది అని మనం ఆలోచిస్తే సామాన్యంగా సామాన్యప్రజలకు సామ్యవాదము వినటానికి యింపుగా వుంటుంది. కానీ గాంధీజీపథఛత్రఛాయలో తమకుతాము సురక్షితంగా వున్నామని తలుస్తూవుంటారు.

ప్రస్తుతపురోజుల్లో ప్రజలు స్వయం కష్టించి విచారించడమే మానేశారు. యితర్ల

(18 వ పేజీ చూడుడు)

కథానిక

ఉమాకాంత్ (లేక) (చిత్రకారుడు)

శ్రీ బుద్ధవరపు వేంకటరత్నం

ఆసుపత్రిలో అంతా నిశ్శబ్దంగా వున్నారు. లోపల డాక్టరు రోగిని తీక్షణంగా పరీక్షిస్తున్నాడు. గదికి బయట వున్న యిద్దరు ముగ్గురు వ్యక్తులు ప్రతీనిముషం ఆత్రుతతో లోపలికి చూస్తున్నారు. ఆ మధ్యాహ్నపు వేళ తదేక దీక్షతో రోగిని చూస్తూంటే డాక్టరుముఖం నిండా చమట పట్టివుంది. కొంతసేపటికి బయటకి వచ్చాడు డాక్టరు నిట్టూర్పుతో.

'డాక్టరుగారూ, మాబిడ్డ...ఎలా వున్నాడు?' అన్నాడు అక్కడే వున్న వొక వ్యక్తి. రోగికి తండ్రి కాబోలు. వయస్సేమీ పెద్దదికాదు. అయినా ముఖంలో విరక్తిరేఖలూ, విషాద ఛాయలూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

డాక్టరు ఏదో ఆలోచిస్తూంటే "అయ్యా! మా బిడ్డడికి మామూలుగా వస్తూంటుంది యీ వ్యాధి. ఈసారి అకస్మాత్తుగా బడినుంచి యింటికి వస్తూంటే వచ్చిందిట, దారిలో పడిపోయి, గాయాలు తగిలి కొట్టుకొంటూంటే పాపం! యీయన దయతో మీదగ్గిరకి తీసుకొచ్చేరుట...ఇంకా ఏమిటో అంటున్నాడు అక్కడే ప్రక్కన వున్న పెద్దమనిషిని డాక్టరుకు చూపుతూ.

'ఆఁ! మూర్ఛా! ఇంత చిన్న వయస్సులోనే ఎలా వచ్చిందీ అబ్బాయికి? ఇంతకిముందీతనికి అకస్మాత్తుగా ఏదేనా విపత్తు కలిగిందా?' అని అడిగాడు డాక్టరు అతణ్ణి. వ్యక్తికళ్లు అశ్రుపూరితములైనాయి. 'బాబూ! ఏంచెప్పను? రెండేండ్లయింది. వీడికీ నాకూ ప్రేమపాత్రురాలైన తల్లి గతించి. ఒక్కక్షణం తల్లి లేకపోతే. గిజగిజలాడేవాడు. ఆ దేవి గతించిన నాటినుండీ నాకీ పిచ్చి, వాడికీ వ్యాధీ పట్టుకొన్నాయి. ఎలాగైనా నయంచేసి మళ్లీరాకుండా చేస్తిరా జన్మల్లా మీపేరు చెప్పుకొని బ్రతుకుతాం. మందులకి ఖర్చులిచ్చుకుంటూ. ఏవో పేదవాళ్లం...' అంటూ దీనంగా ప్రార్థేయపడ్డాడు.

పూర్తిగా కాకపోయినా డాక్టరుకి కొంతేనా ఇపుడు అర్థమయ్యింది రోగిసంగతి. చిరునవ్వుతో "ఏం ఫర్వాలేదు.- మీరు ఇంటికి వెళ్లి చల్లబడ్డాకా రండి. మీ పేరు?' అన్నాడు.

'ఉమాకాంత్ అంటారు నన్ను. ఏ ఉద్యోగం లేదు అప్పుడప్పుడు ఏవో బొమ్మలు గీసుకు బ్రతుకుతూ వుంటా. దయచూడాలి. తను రెప్పడు రమ్మన్నా వస్తా. డాక్టరుగారూ! వాడే నా ఆశ. వాడే లేకపోతే వాళ్లమ్మపోయినా వాణ్ణి చూస్తూ బ్రతుకుతూన్న ఈ ప్రాణి యిక వుండలేదు. అన్నాడు వ్యక్తి.

'ఉమాకాంత్! ఇప్పుడిక్క డెవ్వరూ వుండగూడదు. అబ్బాయికి నిద్రపట్టింది. ఇంటికెళ్లి మళ్లీరా' అన్నాడు డాక్టరు.

ఆసుపత్రి మెట్లు దిగి ఎండలో ఇంటిదారి పట్టాడు ఉమాకాంత్. వీధినిబడి నడుస్తున్నాడే కాని మనస్సు మనసులో లేదు. తనని మఱిపించి ఊరించి కటికచీకటిలోంచి మార్గంలోకి లాక్కువస్తూన్న ఏదో నక్షత్రం మినుకుమినుకు మంటూ క్రుంగిపోతున్నట్లుంది. ఆ తార గూడా రాలిపోతే ఇంక ఎలా బ్రదికేది? అతిప్రేమతో తనతో జీవించిన అర్ధాంగి పోయినా ఆమెకోరిక కోసం ఆ బిడ్డని పెంచుతూ తన బ్రదుకుని బరువుగా సాగిస్తున్నాడు. పిచ్చిపిచ్చి ఆలోచనల్తో ఇంట్లోకి వచ్చాడు.

పట్నంలో జనసమ్మర్దమైన రోడ్డువారఇల్లు వాళ్లది. బయట ఎప్పుడూ బజారు రొదపెడుతూ వుంటుంది. ఆ గుప్పెడు కొంపలో ఒక గదిలో ఒకమూల బల్ల, రంగుచిప్పలూ' కుంచెలు, కాగితపు ముక్కలూ ఇవీ అతని ప్రపంచం. ఇంకో మూల తన కొడుకు రవిపుస్తకాలూ బట్టలూ, వుంటాయి. ఎలాగో లేవలేని చేతుల్ని పైకెత్తి తాళం తీసి లోపలికి అడుగుపెట్టాడు.

ఎండలోంచి ఒక్కసారిగా ఇంట్లోకి రావడంవల్ల కళ్లు చీకట్లుకమ్మాయి. కాని ఆలోచనలతో పరితపించే ఆ హృదయంలో ప్రకృతి మార్పుని గుర్తించలేకపోయింది. ఆ క్షణంలో అతడికి ఏమీ కనపడ్డం లేదు. ఇంట్లోదాకా బయటనుంచి తీసుకొచ్చిన కాంతి గుప్పున ఆరిపోయినట్లయింది. లోపలికి వచ్చిరావడంతోనే తలెత్తి ఎదుటిగోడవైపు చూశాడు. కళ్లు నులుముకొని, పొంగివచ్చే కన్నీళ్లను ఒత్తుకొంటూ తదేకదీక్షగా అక్కడ వున్న పటంవైపు చూస్తున్నాడు.

తన భార్య శశిరేఖచిత్రం అక్కడ వుంది. రెండేండ్లక్రితం గతించింది ఆమె. పోతూపోతూ తన బిడ్డ రవిని ఆశాకిరణంగా అందించింది భర్తకి. ఉమాకాంత్‌కి ఆచిత్రం చూస్తూంటే తన భార్యకడసారిమాటలు జ్ఞాపక మొస్తున్నాయి.

"మీరు కళాకారులు. ఎప్పుడూ దేన్నో గురించి తీక్షణంగా ఆలోచిస్తూంటారు. ఈ రవి మీ, నా ప్రేమఫలం. మన వంశానికి ఒక్కడే పట్టుకొమ్మ. మీది పవిత్రమైన కళాకారుల, సాంస్కృతిక సేవకుల వంశం. ఆవంశగౌరవాన్నీ, ఆ పరంపరాగతచిహ్నమైన యీ పిల్లవాణ్ణి ప్రేమతో పెంచి పెద్దవాణ్ణి చెయ్యండి. వీడిలో వున్న నన్ను చూసి తృప్తిపడండి. కళ్ల నీళ్లు పెట్టుకోకండి. శలవు. వీణ్ణి నాలానే చూస్తానని వాగ్దానం చెయ్యండి...'అంటూ చేయి చాచింది అంతిమస్వరంతో. కన్నీళ్లతో చేతిలో చేయి వుంచి సాగనంపాడు ప్రపంచంలోంచి ఆ సాధ్విని. అప్పటినుండీ రవిమీద మమకారంతో మళ్ళీ వివాహమేనా చేసుకోకుండా కళాజీవితంతో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు ఉమాకాంత్. ఇప్పుడతనికి ఆ దృశ్యమంతా ముందుంది.

'శశీ! నా సర్వస్వం అర్పించి నా మాట కాపాడుతా, ప్రాణాల్నిసైతం ఒడ్డి క్షీణించే వంశగౌరవాన్నీ, రవినీ రక్షిస్తా.' అన్నాడు బిగ్గరగా నిజంగా శశిరేఖ తనఎదుట వున్నట్లే భావిస్తూ పిచ్చిగా.

రోజూ రవి ఎన్ని పనులున్నాసరే తల్లి పటానికి పూలమాల లుంచి, ప్రక్కనే వున్న తన తండ్రి చిత్రించిన భారతమాతచిత్రానికి పూజించి మాతృభక్తితో సేవిస్తూండేవాడు అవాళ రవి ఇంటి దగ్గర లేకపోవడంచేత ఉమాకాంతుడే ఆ పనులు పూర్తిచేశాడు. సాయంకాలం ఎప్పుడౌతుందా? అని ఎదురుచూస్తున్నాడు. ప్రక్కయింట్లో గడియారం 8 గంటలు కొట్టింది. వేసవి కాలంమూలాన కాలం ఎలా తిరుగుతోందీ ఉమాకాంత్ గుర్తించలేకపోతున్నాడు మనసులో బాధవల్ల. వెంటనే బయలుదేరాడు. చిన్న పిల్లవాడిలా ఆసుపత్రికి పరుగెత్తుకు వచ్చాడు.

డాక్టరు హాల్లో కూర్చున్నాడు. ఉమాకాంతుడు రాగానే 'రండి కూర్చోండి' అబ్బాయికేమీ ఫర్వాలేదు. కాని గుండెమీద గట్టి దెబ్బ తగిలింది. ప్రాణాపాయం ఏమీ లేదు; రెండు నెలలపాటు ఇల్లు కదలనీయకుండా జాగ్రత్తగా చూడాలి. ఏమరుపాటుగా వుండగా ఈ వ్యాధి వస్తే చాలా ప్రమాదం. పదిరోజులైనతర్వాత మీ యింటికి తీసికెళ్లవచ్చు. మందులు కావలసినవన్నీ నేనే తెప్పించివాడుతా. తరువాత డబ్బుమాట చూసుకొందాం' అన్నాడు.

ఈ మాటలు వింటూంటే ఉమాకాంత్‌కి ప్రాణం వచ్చినట్లుంది. శశి తనముందు సంతోషంతో నవ్వుతున్నట్లుంది. ఆనందంతో అలాగే డాక్టరుగారూ. మీ ఇష్టం కానీండి' అన్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి. 15 రోజుల తర్వాత రవిని ఇంటికి పంపించాడు డాక్టరు. రోజూ మందు పంపుతూండేవాడు. మాతృదేవిపూజతప్ప రవి మరోపనేదీ చేయడానికి తండ్రి ఒప్పుకొనేవాడు కాదు. ఇంట్లో పనులన్నీ ఉమాకాంతుడే చేస్తూండేవాడు. వీలున్నపుడల్లా ఇంటిదగ్గరే పాఠం చెబుతూండేవాడు కొడుక్కి. కాలచక్రం మళ్లిపోతోంది. రెండు నెలలూ గడచిపోయాయి.

'ఇంక మందక్కర్లేదు. కానీ అబ్బాయి ధ్యానం మాత్రం కొంచెం మళ్లించడానికి ప్రయత్నంచేస్తే ఆ మానసికచైతన్యంవల్ల పూర్తిగా వ్యాధినివారిస్తుంది' అన్నాడొకనాడు డాక్టరు.

'తల్లిప్రేమనుండి తప్పించడమెలా డాక్టరు గారూ?' అన్నాడు ఉమాకాంత్ డగ్గుత్తికతో.

'ఉమాకాంత్! మీవాడు రోజూ తల్లి పటానికీ, భారతమాతచిత్రానికీ పూజిస్తూంటాడు. గనక నెమ్మదిగా దేశాన్ని గురించీ, భారతమాతని గురించీ చెబుతూ మనస్సుని మళ్ళించు' అన్నాడు డాక్టర్. రవిస్థితినిబట్టి ఇది సాధ్యమే అనిపించింది ఉమాకాంత్‌కి. మరునాటినుంచి ప్రారంభించాడు ఉమాకాంత్ డాక్టరు చెప్పిన ఉపాయం. రోజూ కనీసం గంటసేపు రవికి భారతదేశాన్నిగురించీ, భారతీయసంస్కృతినిగురించీ, వీరపురుషుల జీవితాలనిగురించీ బోధిస్తూ యత్నం సాగించాడు. విజయసూచకంగా తోచింది అతనికి ఈపద్ధతి. 5 నెలల్లో రవి క్రమంగా తల్లిప్రేమతోపాటు దేశభక్తిని పెంపొందించుకొనడం ప్రారంభించాడు.

ఈమధ్య అనేక సార్లు డాక్టరును కలసుకొన్నాడు ఉమాకాంత్. ఎప్పుడూ తను డబ్బుప్రసక్తి తేవడం ఆయిన 'దానికేంలే' అనడం. చివరకోమాటు తేల్చాడు డాక్టరు సుమారు 150 రూపాయ లయ్యాయి రెండునెల్లకీ మందులకి. నా చేయగల సాయం ఊరికేనే చేశాను అని. ఉమాకాంత్‌కి ప్రాణగొడ్డంగా వుంది యీ బాకీ తీర్చడం.

సాధారణంగా కళాకారులకీ, అపర్ణాన్ని పూజించేవారికీ ఈ లోకంలో లక్ష్మీప్రసన్నం కానేకాదు. తమదగ్గర కళ వున్నందుకు ఆత్మాభిమానం, స్వేచ్ఛాజీవితం వుండాలంటారు. ఏ కూలీ నాలీ చేయరు. పోనీ నిత్యం ఆ శిల్పమైనా సాగించరు. ఎప్పుడో ఉద్రేకం కలిగినపుడు ఏవో కథలో, పద్యాలో వ్రాయడం, లేకపోతే కుంచె పుచ్చుకొని రెండు బొమ్మలు గీయడం, ఏఅయ్యకో అంటగట్టి నాలుగుకాళ్లు సంపాదించుకొని కథ నడుపుకొంటూండడం, ఇదీ వారి పంథా. ఆధునిక యుగంలో సజీవకళలకీ, ధ్యేయవాదజీవనానికీ అన్నీ ప్రమాదాలే. ఇలాగే వుంది ఉమాకాంత్ జీవితం గూడా. ఏణ్ణర్థంనుంచి శ్రమపడుతూన్నా రవిస్కూలుజీతానికీ, పుస్తకాలకీ, తమ భుక్తికీ డబ్బు సంపాదించుకొనేందుకు ఇబ్బంది పడుతున్నాడు. పాపం! డాక్టరుగూడా మంచివాడుగాబట్టి అడపాతడపా అడుగుతూ మరీ ఎక్కువగా అతన్ని బాధపెట్టడంలేదు. ఉమాకాంతుడు కళాకారుడుగాబట్టి, తలచుకొన్నపుడల్లా ఆనాటి దృశ్యం జ్ఞాపకంవస్తూంటుంది గనుక ఎలాఅయినా యీ ఋణం తీర్చడానికి బాధపడుతున్నాడు.

ఇలా తపిస్తూన్న అతనికి ఓనాడు మంచి ఊహ తట్టింది. "ఉమాకాంత్! నీవు చిత్రకారుడవు. నీకు ఈ ఉపకారం చేసిన డాక్టరు ఋణవిముక్తికి ఎన్నాళ్లిలా తపిస్తావ్? తలచుకొంటే అమృతాన్నిచిందే నీ కుంచెతో గతవైభవానికి జీవం పోయగలవు. పిచ్చివాడా! నీ కళకి మూల్యం వుందా? రూ 150 లేంటి? తలచుకొంటే వేలుఖరీదుచేసే చిత్రాల్ని వ్రాయగలవు. లే. ఒక భావనాపూర్వకమైన చిత్రాన్ని చిత్రించి డాక్టర్‌చేత ఔననిపించుకో. నీ పేరు నిలిచిపోతుంది." ఆత్మప్రబోధపూర్వకంగావున్న ఈ ఊహ అతనిలో చైతన్యం రగుల్కొల్పింది.


తన ఊహ రవితో చెప్పాడు. తండ్రి వూహకి రవి సంతోషంతో మురిసిపోయాడు. అప్పటికే అతనిలో దేశభక్తి, మాతృప్రేమ వేళ్లు పాతుకొన్నాయి. ఒకనాడన్నాడు రవి తండ్రితో, "నాన్నా! నేను చెప్పేటంతటి యోగ్యుణ్ణి గాను. యీనాటికైనా చెప్పడం నా బాధ్యతగా గుర్తించాను గనుక చెబుతున్నా. సాధారణ చిత్రాలుగానీ, సుందరలలనల చిత్రాలుగానీ, భౌతిక సంపదల రూపులుగానీ కేవలం డాక్టరుఋణవిముక్తికని చిత్రించకు. నీ చేతిలోఉన్న అమృతం చిందే కుంచెతో మనపవిత్రమాతృగర్భంలో ఉద్భవించి, ఆ మాతృదేవిని సంరక్షించడానికి, పరదాస్యశృంఖలాలనుండి తల్లిని విముక్తి చేయడానికి తనమనధనపూర్వకత్యాగంచేసి మనకు తారలవలె నిరంతరం దారి చూపించే గతవైభవంలోని వీరులని చిత్రించు. తల్లిగర్భంనుండి జనించింది మొదలు, మళ్ళీ ఆ పవిత్రమాతృగర్భంలో లీనం అయ్యేవరకు శరీరంలోని ప్రతి కణమూ, జీవితంలో క్షణక్షణమూ ఆ మెచరణపీఠంలో త్యాగంచేసిన దేశభక్తుల్ని చిత్రించి నీ శిల్పాన్ని సార్థకం చెయ్యి. ఇవి నీవు చెప్పిన రీతులేగా?" అని అనేకసార్లు తండ్రి తనతో చెప్పిన ప్రబోధసారాంశాన్ని అప్పగించాడు.

కొద్దికాలంలోనే రవిమనస్సులో తీవ్రమైన మార్పు తేగలిగినందుకు ఉమాకాంత్ గర్వించాడు. ఇదంతా తనలోగాకుండా ఆ దివ్య సంస్కృతిలో వుందని గుర్తించాడు. వెంటనే రవితో "రవీ! నీవు నాకిది చెప్పాలా నాయనా తల్లి ఋణం తీర్చుకోడం కోసం నేను జ్ఞానం వచ్చిననాటినుంచీ ఎలా ప్రయాసపడుతున్నానో నీకు తెలీదు. అదిగో చూడు ఆ భారతమాతచిత్రం చెబుతుంది నా ఆవేదనని. నేనింకో చిత్రాన్ని చిత్రించి నా కళని తుచ్ఛప్రాపంచికసౌఖ్యంకోసం, స్వార్థప్రయోజనానికీ ఎన్నడూ వినియోగించను. మంచి భావం తట్టిందిగనుక, నీవూ అదే కోరుతున్నావు గనక ఇవాళే ప్రారంభించుతా చిత్రాన్ని. కళారాధన, మాతృదేశసేవ ధ్యేయంగా ఉంచుకొన్న నాకుంచె నిత్యం ప్రదీపిస్తూ నాఎదుట నాకు నూతనోత్సాహం గలిగించే నీ రవితేజాన్ని గ్రహించి అమరజీవితాన్ని సృష్టిస్తుంది" అన్నాడు ఆనందంతో భారతమాతచిత్రాన్ని రవికి చూపుతూ.

ఆనాటినుంచి ప్రారంభమైంది ఉమాకాంతుని నూతనకార్యం. భావనాపూర్వకమై, జాతీయ ప్రతీకాలని ప్రతిబింబింపచేయగల చిత్రాన్ని వ్రాస్తున్నాడు. డాక్టరును చిత్రంతో సంతృప్తిపరచడం; అంతకన్నా ముఖ్యంగా మాతృచరణసేవా, పవిత్రాశయాలుగా ఉంచుకొని చిత్రంవ్రాస్తున్నాడు. రోజూ నిద్రాహారాలుగూడా మఱచి కార్యదీక్షలో మునిగి ఉన్నాడు. అప్పుడప్పుడు రవి తండ్రి స్వీకరించిన వ్రతాన్నీ ఆతని ఆదర్శాన్నీ చూస్తూ విస్మయపడుతూండేవాడు..


ఒకనాటి అర్ధరాత్రిసమయంలో నిద్రపోకుండా ఉమాకాంత్ చిత్రానికి రంగులు పట్టిస్తున్నాడు బుడ్డి దీపంవెలుతురులో. అకస్మాత్తుగా మెలుకువ కలిగింది. రవికి. లేచి తదేకదీక్షతో తండ్రిని గంటసేపటినుండి చూస్తున్నాడు. ధ్యేయనిష్ఠలో మునిగి ఆశయపూర్తికై యీప్రపంచాన్నే మఱచిపోయి శిల్పం సాగిస్తూన్న ఉమాకాంతుడు రవి లేచినట్లూ, తనను చూస్తున్నట్లూ గుర్తించలేదు. రవి చివరకి సాహసించి తండ్రివ్రతానికి భంగంచేస్తున్నానేమో అనే భయంతో బరువైనకంఠంతో, "నాన్నా! ఇలా ఎన్నాళ్లు పాటుపడతావు దీనికోసం? నీవు నిన్ను చూసుకోడం లేదు. నిద్రాహారాలు మానివేయడంవల్ల నీశరీరం కృశించిపోతోంది. ఏ వ్యాధియైనా వస్తుందేమో! కొంత విశ్రాంతి తీసుకోరాదూ! డాక్టరుగారి ఒత్తిడి ఏమీ లేకపోయినా నీకీవుపవాసాలూ, దీక్షా ఎందుకూ?' అన్నాడు. రవి ఇలా అంటుంటే ఉమాకాంత్‌కి స్పృహవచ్చింది.

(15 వ పేజీ చూడుడు)



ఇం(ద్రసభలో ఇం(ద్రాణి

★




కాళికాదేవి భీకరదృశ్యము


శిల్పసామ్రాజ్యం -

శ్రీ పుల్లాభొట్ల


బౌద్ధ, జైన, హిందూశిల్పసృష్టి, త్రివేణీ సంగమంలాగ ఎల్లోరాగుహల్లో వెల్లివిరిసింది. ఈ శిల్పాలు చూస్తే భారతవర్ష సంస్కృతిని ,అభ్యుదయపథానికి గొనిపోవటానికి ఈ మూడుశాఖలవారూ తమతమ వైషమ్యాలను మరచి ఏకోన్ముఖంగా కృషిచేసినారనక తప్పదు. ఒకరిని మించి మరొకరు శిల్పాన్ని జేగీయమానం చేయటానికి తమ యావచ్ఛక్తులను వినియోగించారు. భారతసాంస్కృతికజ్యోతి 3-9 శతాబ్దాల మధ్య ఈ గుహలలో జాజ్వల్యమానంగాజొచ్చింది. ఇట్టి శిల్పకళాఖండాలు అపూర్వములని పాశ్చాత్యచరిత్రకారులే వేనోళ్ల ఉగ్గడించారు. భారతశిల్పకళాప్రశస్తికి, భారత సంస్కృతికి ఈ గుహలు ఆలయములై, సరస్వతీ నిలయములై, భారతీయుల అప్రతిమానప్రతిభా సంపత్తిని చిత్రవిచిత్రరీతుల ప్రదర్శించుచున్నవి.

బౌద్ధమతం ఒకవంక క్షీణగతి నొందుచుండ మరోవంక జైన, శైవమతములు విజృంభింపజొచ్చినవి. ఈ త్రిమతాల నిర్మాణాత్మకమైన సృష్టికి ఎల్లోరాగుహలు ఆచంద్రతారార్కము నిలచిపోగల తార్కాణము. దేవాలయములను నాశన మొనర్చి, తమ ప్రార్థనామందిరములకు వాటి శిథిలములను, సోపానములుగ వినియోగించుకొని, భారతశిల్పమును ధ్వంసముచేయుటే స్వర్గాపవర్గమని తలచిన కొందరు దురభిమానులు జన్మించిఉండనిచో ఆ భారతశిల్పమందిరముల, దీప్తి, తేజస్సు, ప్రభ నేటికినీ ప్రకాశించుచుండెడిది. ఆ శిల్పశిథిలములను చూచిన, మానవుని మతోన్మాదస్థితి ఎంత నైచ్యానికి పాల్పడగలదో ద్యోతకమై, అందుకు ఏహ్యభావము, ఆగ్రహము, తుదకు విచారము కలుగక






కైలాసము




సీతా స్నానఘట్ట సమీపమందిరమున కైలాసమును కదతున్న రావణుడు



పార్వతీ పరిణయం

ఎల్లోరా కళాక్షేత్రం

వేంకటరామశర్మ




...ంద్రసభ

మానవు. అయితే ఆ విగ్రహములు ప్రదర్శించే ప్రశాంతత, ప్రబుద్ధత చూసే ఇంగితజ్ఞానము ఉన్న ప్రతివానికి బుద్ధి వచ్చితీరుతుంది. ఇట్టి శిల్పకళామందిరములు, సాక్షాత్సరస్వతీనిలయములు సృష్టించిన మనపూర్వులు వంద్యులు. కాని ఆ శిల్పకళాబీజముల నిలుపుకొనలేక పోయినచో మనము నిర్భాగ్యుల మగుదుము.

సహ్యాద్రిపంక్తికి చేరిన ఎల్లోరాకొండలు ఉత్తర దక్షిణములుగా ఒక మైలు పొడుగువరకు వ్యాపించియున్నవి. ఎల్లోరాకొండలు మదపు టేనుగుల పంక్తులవలె దర్పముతో, ఠీవితో "కారేరాజులు, రాజ్యముల్ గలుగవే, గర్వోన్నతిం జెందరే, వారేరీ? సిరి మూటగట్టుకొని పోవం జాలిరే" అన్నటుల వారి ముల్లెఅంతా తమపైనే వదలినట్లు ప్రత్యక్షమౌతయి. ఇవి మొత్తం 34 గుహలు. బౌద్ధగుహలు 12, బ్రాహ్మణగుహలు 17 జైనగుహలు 5 ఉన్నవి. ఇందు కైలాసగుహ ప్రధానమై చిద్విలాసముతో ఒప్పుచున్నది. రాష్ట్రకూటప్రభువు మొదటి కృష్ణుని పరిపాలనలో కైలాసనిర్మాణం సాగినట్లు తెలుస్తున్నది.


మొదటిగుహ కళ్లబడేసరికి కొండలమించి క్రిందపడుతున్న మనోజ్ఞమైన జలపాతం యాత్రికుని రమ్మని పిలుస్తున్నదా అన్నట్లు ఉంటుంది. మొదటి గుహలో దాదాపు ఏమీ లేకపోయినా అది మొదటి గుహే. ఈ విశాలమైన గుహ ఒక బౌద్ధవిహారము అయివుంటుంది. రెండోగుహ బౌద్ధప్రార్థనామందిరం. ఇందు పెద్ద బుద్ధ విగ్రహం ఉన్నది. జీవకళ ఉట్టిపడే ద్వారపాలకులు

(14-వ పేజీ చూడుడు)




అసదృశమైన విశ్వకర్మాలయము


★




కైలాస ఆలయపీఠమున అంకితమైన మదకరీంద్ర సంహతి



కైలాసములోని రెండవ ధ్వజస్తంభం: శిథిలమైన ఏనుగు



చిద్విలాసోల్లాసమైన కైలాసము ధ్వజస్తంభము



ఎల్లోరాలో వెలసిన రామేశ్వరము.

శిల్పసామ్రాజ్యం - ఎల్లోరా కళాక్షేత్రం

గంధర్వులు, పరిచారికల బొమ్మలూ చూపరుల ముగ్ధులను చేస్తవి.

మూడోది రెండంతస్తుల గుహ. ఇక్కడ బుద్ధుడు బోధివృక్షంక్రింద పద్మాసనుడై కూర్చుంటాడు. ఆయనకు పద్మపాణులు, వజ్రపాణులు, గంధర్వులు, సురలు, మునులు, భూసురులు కైవారాలు చేస్తూ ఉంటారు. అర్తులూ, శరణార్థులూ బుద్ధుని ప్రణతార్తిహరునిగా ప్రార్థించే చిత్రాలు ఉన్నవి.

నాల్గో మందిరంలో బుద్ధుడు బోధిసత్వుడుగా ప్రకాశిస్తున్నాడు.

ఐదవది చాలా పెద్ద గుహ. గంభీరంగా ఉంటుంది. శిల్పకళావిలసితములైన 24 స్తంభాలతో విరాజిల్లుతూ ఉంటుంది. రెండంతస్తుల్లో బుద్ధుడు గర్భగుడిలో చేరుతాడు. ప్రదక్షిణానికి అనువైన ఏర్పాటు ఉన్నది.

ఆరోగుహలో మామూలు బౌద్ధవిగ్రహాలతో పాటు సరస్వతీ విగ్రహం ఉంటుంది. ఇల్లాగే ఎనిమిదవ గుహలోగూడా ఉన్నది.

విశ్వకర్మాలయం

పదోగుహ విశ్వకర్మాలయం. విశ్వకర్మ అందరికీ ఇది ఆరాధ్యమందిరం. బౌద్ధశిల్పానికి మకుటాయమానమైనది. 27 అ. ఎత్తున రాతిని కుంభాకారంగా పైన చెక్కారు. 11 అ. ఎత్తు ఉండే బుద్ధవిగ్రహాన్ని సృష్టించారు. ఈ చైత్యంలో స్తంభాలద్వారా సంక్రమించే రమణీయగాంభీర్యమునకు తోడుగా పైకప్పున ప్రక్క ఎముకల వలె తీర్చి అమర్చిన రాతి అలంకారములు ముచ్చటగా ఉన్నవి. కుడివైపున నాగకన్యల ఊర్ధ్వకాయములనుండి ఒక వాసం ప్రారంభమై ఎడమవైపునుంచి నాగకుమారునివద్దనుంచి వచ్చిన వాసం మధ్యన అతికినట్లు ఉంటుంది. పై అంతస్తులో ప్రమథగణములు, బుద్ధవిగ్రహం పరిచారకులతోను, బోధిసత్వులతోను చెక్కబడినది. ఇందు కైశ్యాలంకరణవిధానం ముఖ్యంగా గమనించదగినది.

పదకొండవ గుహ రెండంతస్తులది. ఇక్కడకు వచ్చేసరికి బుద్ధుని వివిధదశలు ప్రదర్శింపబడినవి. మానవులకు ఉపదేశం చేస్తున్నట్లు, దేవతలకే తన సందేశాన్ని వినిపింప పోతున్నట్లు, నిర్వాణము చిత్రింపబడి ఉన్నవి. పైఅంతస్తులో పెద్ద బుద్ధవిగ్రహం కుడిచెయ్యి మోకాలుపైన, ఎడమ చెయ్యి తొడమీద వేసుకొని ఉంటాడు. క్రిందుగా ఎడమవైపున కలశముతో ఒక స్త్రీ, కుడివైపున సాష్టాంగపడుతూన్న మరో స్త్రీ ఉంటారు. కుడివైపున ప్రక్కగోడపై మూడు పెద్దవిగ్రహాలు, ఎదురు గోడపై సరస్వతీవిగ్రహం ఉన్నవి. ఉత్తరదిశనుగూడా చెరొయ్యెత్తు మూర్తులు మూడు ఉన్నవి.

12 వది మూడు అంతస్తులది. ఇక్కడ శుకపికాదికములు మనస్సు రంజిల్ల కలకలధ్వనులు చేస్తూఉంటవి. బుద్ధుని ప్రవక్తగను, తపస్విగను ఇందు చిత్రింపబడినది. ఆర్యమైత్రు డనేవాడు మరల ఉద్భవించి బౌద్ధమతాన్ని పునరుద్ధరిస్తాడని వాళ్ల విశ్వాసం. పదమూడవ గుహ ధర్మశాల. పదునాలుగవ దానిలో రావణాసురుడు కైలాసాన్ని ఎత్త సంకించినపుడు శివుడు గర్వభంగం చేయడం, మహిషాసురి, శివపార్వతులు చదరంగం ఆడుతున్నట్లు, శివతాండవనృత్యం, కాలభైరవుడు, వరాహావతారం, పూర్ణపు ఉండ్రాళ్లు తింటున్న గణపతి, చాముండి, ఇంద్రాణి, వారాహి, వైష్ణవి, లక్ష్మి, కౌమారి, మాహేశ్వరి, బ్రాహ్మి, వాహనారూఢలై కనిపిస్తారు. లోపల పెద్ద శివలింగం ఉంటుంది. శ్రీదేవి భూదేవులతో ఇచ్చట ఉన్న విష్ణుమూర్తి దర్శనీయము. పదహేనవ గుహలో దశావతారములు అద్భుతముగా చిత్రింపబడినవి.

చిద్విలాసమైన కైలాసం

షోడశకళావిలసితమైనది కైలాసం. ఈ దేవాలయపీఠము నంటి సింహవిక్రమకరివిజృంభణ రీతులు సమగ్రముగా అంకితములైనవి. పై అంతస్తులో దశావతారములు, రంగురంగులతో ప్రత్యక్షమౌతూ ఉంటయ్. 154 అ. వెడల్పు, 276 అ. నిడివి, 107 అ. ఎత్తున ఈగుడి ఉన్నది. దేవాలయాన్ని మండపాన్ని కలిపేవంతెనక్రింద ఒకచో కాలభైరవుడు, మరొకచో ఎదురుగా విష్ణువు సమాధిలో ఉన్న బుద్ధునిమాదిరిగా ఉంటారు. దక్షిణదిశను గోడలపై శ్రీమద్రామాయణమూ, ఉత్తరవైపు గోడలపై భారతకథలూ చెక్కబడి ఉన్నవి. రావణగర్వభంగం గూడా చిత్రింపబడినది. దక్షిణవైపు ప్రాకారంలో 118 అ. పొడవుగల మండపం ఉన్నది. అందులో అన్నపూర్ణ, చతుర్భుజయై, జటాధారిణియై, కలశముతో లక్ష్మి, కాలభైరవుడు, కపాలభైరవుడు, నవమోహినీ భైరవుడు, సిద్ధయోగినీ భైరవుడు, త్రిశూలపాణి, భూపాలభైరవుడు, భైరవుడు, మహాదేవుడు, సదాశివుడు, వీరభద్రుడు–ఈవిధంగా మన పురాణేతిహాసాదులకు అన్వయించేటట్లుగా చుట్టూ ఉండే ప్రాకారాల్లో మూర్తులు చిత్రింపబడినవి. ప్రమథగణాలతో పరివేష్టింపబడి, బ్రహ్మవిష్ణుల ప్రార్థనలుగూడా ఆలకిస్తూఉన్నటువంటి గౌరీదేవితో కల్యాణోత్సవం జరపుకుంటూన్న అనేక శివచిత్రాలు ఉన్నవి.

ఈ గుహ లన్నిటిలో శివౌన్నత్యాన్ని అనేక విధాలుగా ప్రదర్శించారు.

కైలాసాన్ని ఎత్తుకపోవడానికి రావణుడు యత్నించడం, తత్కారణంగా రావణుడు భంగపడడం, పలుచోట్ల చిత్రింపబడినది. మార్కండేయుణ్ణి యమపాశంనుంచి తప్పించినట్లు, పార్వతికి పురాణకథలు చెబుతున్నట్లు, పార్వతిని తన తాండవనృత్యంతో రంజింపచేస్తున్నట్లు—ఇవన్నీ ఒకఎత్తు. కాని చివరకు శివభక్తుడైన రావణుడు తన పదితలలలో తొమ్మిదింటిని శివుని కర్పణచేసి, పదవతలతో శివలింగాన్ని ఎత్త యత్నించగా శివుడు ప్రత్యక్షమై ఏమికావా లని అడగ్గా, పార్వతినే రావణుడు కావాలనటం—ఈ కథ ఒకఎత్తూ.

యజ్ఞశాలలో మొండెములైన అనేక దేవీమూర్తులు ఉన్నవి. శైవమతంలోని భయానక దృశ్యాలతో దేవి వాగేశ్వరిగా, కాళిగా చిత్రితమైనది. ఇవన్నీ మామూలుగా గోడలకు చెక్కలేదు. ఒకే కొండరాతినుంచి చెక్కబడి కొలువు తీర్చినట్లుగా కనపడతయ్. ఈ కొలువులో సరస్వతి, వైష్ణవి, ఉండటం గమనార్హం. వరాహావతారం, నరసింహావతారం బహుళంగా ఉన్నవి. ఈ కైలాసం అంతా భువిపై వెలసిన అపరకైలాసంగా ఉన్నది. దీన్ని సృష్టించిన విశ్వకర్మలు ధన్యజీవులు!!

ముప్పదవ గుహ వచ్చేదాకా అన్నీ శివౌన్నత్యాన్ని తెల్పేగుహలే. ఈ గుహల్లో ఒకచో హాలాహలమును మ్రింగినాడన్న గరళకంఠుడు అనే శివలింగం ఒకచోట నీలంగానే 'తళుక్, తళుక్'అని మెరసి కాంతిపుంజములతో భాసిస్తూ ఉంటుంది. ఇరవైయొకటవ గుహలో రామేశ్వరాన్నే మలచారు. ఇందులో నగరాజకుమారి తపస్సుచేయడం, శివుడు ప్రత్యక్షం గావడం కనిపిస్తుంది. ఇక్కడి శివుని నృత్యంలో మామూలు బీభత్సం ఉండదు. పార్వతీతపస్సుచిత్రంలో మన్మథుడుగూడా ప్రత్యక్ష మవుతాడు. ఇరవైనాల్గవ గుహ చిత్రాలకు వేసుకొనే రంగులు తయారుచేసుకునే తైలగుహగా ఉన్నది. ఇరవైయేడవదాన్ని గొల్లభామల గుహ అంటారు. గొల్లభామలు కనిపించరుగాని ఇక్కడా ఓ చిన్న జలపాతం రాళ్ళపై దొర్లుకువస్తూ ఉంటుంది.

సీతాస్నానఘట్టం

ఇరవైతొమ్మిదవ గుహను సీతాస్నానఘట్టం అని చెబుతారు. ఈప్రాంతాల్లో ఉన్న జలపాతాలన్నిటిలో సుదూరం తుంపురలను వెదజల్లుతూ ఉండే హృదయానందకరమైన పెద్ద జలపాతం ఉన్నది. ఈ గుహలో చాలా విశాలమైన మండపం ఉన్నది. శివుణ్ణి మహాయోగిగా చూపించారు. కాళిదాసు కుమారసంభవం అంతా గూడా అత్యద్భుతంగా ఇచ్చట చెక్కబడినది. పార్వతీదేవిని రంగంలోకి ప్రవేశపెట్టినపుడు కాళిదాసు వర్ణించిన ఈ మనోజ్ఞదృశ్యం కండ్లకు గట్టేట్లు చిత్రింపబడింది:

"అశోకనిర్భర్త్సితపద్మరాగ
మాకృష్ణహేమద్యుతి కర్ణికారమ్!
ముక్తాకలాపీకృతసిన్దువారం
వసన్తపుష్పాభరణం వహన్తీ."

"ఆవర్జితం కిఞ్చిదివ స్తనాభ్యాం
వాసో వసానా తరుణార్కరాగమ్
పర్యాప్తపుష్పస్తబకావనమ్రా
సంచారిణీ పల్లవినీ లతేవ."

"స్రస్తాం నితమ్బా దవలమ్బమానాం
పునఃపునః కేసరదామకాఞ్చీమ్
న్యాసీకృతాం స్థానవిదా స్మరేణ
మౌర్వీం ద్వితీయామివ కార్ముకస్య."

"సుగన్ధినిశ్వాసవివృద్ధతృష్ణం
బిమ్బాధరాసన్నచరం ద్విరేఫమ్
ప్రతిక్షణం సంభ్రమలోలదృష్టి
ర్లీలారవిన్దేన నివారయన్తీ."

"తాం వీక్ష్య సర్వావయవానవద్యాం
రతేరపి హ్రీపద మాదధానామ్
జితేంద్రియే శూలిని పుష్పచాపః
స్వకార్యసిద్ధిం పున రాశశంసే."

"భవిష్యతః పత్యు రుమా చ శంభోః
సమాససాద ప్రతిహారభూమిమ్,
యోగాత్ సచాన్తః పరమాత్మసంజ్ఞం
దృష్ట్వా పరం జ్యోతి రుపారరామ"

సప్తర్షులు నగాధిరాజువద్దకువచ్చి అంగీరసుని చేత పల్కించిన ఈ పల్కులు నయనానందకరంగా శిల్పి చిత్రించాడు.

"ఉమా వధూ ర్భవాన్ దాతా
యాచితార ఇమే వయమ్
వర శ్శంభు రలం హ్యేష
త్వత్కులోద్భూతయే విధిః."

కూర్మాన్ని అధిరోహించిన ఒక నదీదేవత స్నానసౌందర్యంతో ప్రత్యక్షమౌతుంది. పెళ్లి శివలింగం, ప్రదక్షిణానికి ఏర్పాటు ఉన్నవి.

ముప్పైయొకటవది చిన్న కైలాసం. ముప్పైరెండు, ముప్పైమూడు, ముప్పైనాలుగు ఇవి జైన గుహలు. ఈ వర్గానికి వచ్చేసరికి శిల్పసంప్రదాయములో మార్పు గోచరిస్తుంది. మహావీరుడు, జైనతీర్థంకరులు, పార్శ్వనాథుడు, శ్వేతాంబరులు, దిగంబరుల చిత్రాలు కనిపిస్తయ్ ఈ గుహలను ఇంద్రుని కొలువుకూటాలంటారు. గోమాత, ఇంద్రాణి, ఇంద్రుడు, సరస్వతి, మహావీరుడు – వీరు చిత్రింపబడినారు.

సంగ్రహంగా ఇవీ ఎల్లోరా శిల్పకథనం.

ఇక్కడికి చేరువనే అహల్యాబాయి నిర్మించిన కృష్ణేశ్వరజ్యోతిర్లింగాలయం ఉన్నది. ఇచ్చట మూర్తికి నిత్యసంస్కారం జరుగుతుంది. ఎల్లోరా కంతటికీ చైతన్యావస్థలో ఉన్నటువంటిది ఈ ఆలయప్రాంతమే.

ఎన్ని కష్టనిష్ఠూరాలకన్నా ఓర్చి తీర్థయాత్రలకు వెళ్లే ఉత్సాహం ఉన్నటువంటి ఆంధ్రులు విరివిగా ఈలాంటి కళాతీర్థాలను దర్శించడం కూడా అలవాటు చేసుకోవాలి. జాతిచైతన్యం లవలేశంగానైనా శాశ్వతంగా నిలబెట్టచేసేవి ఈలాటి కళాక్షేత్రాలే.

[ఎల్లోరాయాత్ర అంత కష్టసాధ్యమైందికాదు. సికింద్రాబాదునుంచి బయలుదేరితే రూ 50 లలో దివ్యంగా ఎల్లోరా, అజంతా, కళాక్షేత్రాలను సందర్శించిరావచ్చు.]

ఉమాకాంత్ (లేక) (చిత్రకారుడు)

(11-వ పేజీ తరువాయి)

కాని ఇంకా అతడు ఎవరితో మాట్లాడుతున్నాడో అర్థంచేసుకోకుండా 'ధ్యేయవాది జీవనం అంటే ఇంకా నీకు తెలియదు. నీచిరుత హృదయం ఇంకా సంస్కారాలనూ, సాధననూ పొందితేగాని ఆసోపానం ఎక్కలేవు. కళకోసం నావంటివారు పొందే ఆవేదన నీకు అర్థం కావడం కష్టం. పిచ్చివాడా! నిద్రాహారాలు మానివేసేనంటున్నావా. ఆదర్శ జీవితాన్ని సృష్టించేవాడికి నిద్రాహారాలకి తావెక్కడిది? డాక్టరుకోసమా యీ చిత్రం? యీచిత్రనిర్మాణానికి డాక్టరు ఒక హేతువు ఆశయం, యీచిత్రంద్వారా జాతిలో చైతన్యం రగుల్కొల్పడమనే నా అంతిమఆదర్శాన్ని చేరుకోవడం. శరీరం ఠుస్సిక్క, కృశించడం దీనికి ప్రాథమిక లక్షణాలుమాత్రమే. ఈపవిత్రాశయం సిద్ధించడానికి సర్వంలయంచేసినా ఋణవిముక్తికాదు' ఇంకా ఏమేమో ఇలా మాట్లాడుతూ మధ్యలో అకస్మాత్తుగా తను రవితో మాట్లాడుతున్నాననీ, ఆతడు ఇంకా ధ్యేయవాదిజీవనశిక్షణలో మొదటి తరగతిలోనే వున్నాడనీ గుర్తించాడు ఉమాకాంత్. వెంటనే సాధారణప్రపంచధోరణిలో 'అబ్బాయీ! పడుకో చాలా రాత్రి అయింది. నాకేం బాగానే వున్నాగా' అన్నాడు లేని నవ్వు తెచ్చుకొంటూ.

'నాన్నా! నీ కార్యానికి భంగం చేశానేమో. క్షమించు. నాకు తెలియక చేశా నీ పని' అని రవి మళ్లీ పడుకొన్నాడు.

ఇలా తలపెట్టిన చిత్రం ఆరునెలలకి పూర్తి చేయగలిగాడు ఉమాకాంత్. ఎంత తీవ్రంగా పనిచేస్తున్నా ఆకళాసృష్టి త్వరలో జరుపలేకపోయాడు. ఆలస్యమైనా తన సందేశాన్ని చిత్రంద్వారా చాలానరకు జాతికి అందజేయగలిగాననే తృప్తి అతనికి కలుగచేసింది.

ఉమాకాంతుడు చిత్రించింది రామాయణ కథాభాగంలోని ఒక ఘట్టం. శ్రీరామచంద్రుడు అడవికి పోతూవుంటే ఆ మహాపురుషుణ్ణి వెనుకకు రమ్మని ప్రార్థిస్తున్న భరతుణ్ణీ, తదితర అయోధ్యా నగరపౌరుల్నీ చూపే చిత్రం. చుట్టూ అరణ్యం. ముందు ఒక మునీశ్వరుని ఆశ్రమం. భరతుడూ, పౌరులూ అయోధ్యకుతరలిరమ్మని శ్రీరాముని ప్రార్థిస్తున్నారు. కాని శ్రీరాముడు భావనకన్న కర్తవ్యం ఘనమైనదని పేర్కొంటూ తాను పదునాలుగేండ్లు గడచినగాని అయోధ్యకు తిరిగి రానని సూచిస్తున్న దృశ్యం. ఆదర్శసమ్రాట్టు కర్తవ్యపాలనను దేశానికి చూపుతున్నట్లుంది. ప్రకృతి కూడా దీనంగా ఆ ప్రభువుని ప్రార్థిస్తున్నా అతడు కర్తవ్యదీక్షను వీడకుండా వుండటం ఆ చిత్రంలో ప్రస్ఫుటమయ్యే విషయం. చిత్రానికి ఇటువంటి జీవంపోయడానికి ఉమాకాంతుడెంత తపించాడో? అనేకసార్లు ఆ చిత్రాన్ని చూసుకొని తానే పరవశుడౌతూండేవాడు

ఉమాకాంత్ ఒక సుముహూర్తాన రవితో, చిత్రం తీసుకొని డాక్టరుఇంటికి బయలుదేరేడు. ఆనాడు డాక్టరు తీరుబడిగానే ఉన్నాడు. హాల్లో కుర్చీలో కూర్చున్న డాక్టరుకి సాగిలి మ్రొక్కాడు రవి. అదేసమయంలో చక్కగా చట్రం కట్టించి కాకితంలో భద్రపరచబడ్డ పటాన్ని బల్లమీద ఉంచి వినయంగా నమస్కరిస్తూ "అయ్యా! మీరే వీడి ప్రాణదాతలు. రెండేళ్లయినా మీ ఋణం మల్లించుకోలేకపోయాను. క్షమించండి. ఏదో లేనివాణ్ణి. వున్న దాంట్లోనే యథాశక్తికష్టపడి యిచ్చాను. తీయించండి" అన్నాడు ఉమాకాంత్.

డాక్టరు పటంపై కాగితాల్ని నెమ్మదిగా తొలగిస్తున్నాడు. రవి ప్రక్కకి ఒదిగి నుంచున్నాడు. చిత్రాన్ని చూశాడు డాక్టరు. "అంతా బాగానే వుంది. ఉమాకాంత్ చూడూ! ఇక్కడ ప్రకృతి ఎంత అందంగా వుందో! కాగితంలో అమృతం చిలకడం అంటే ఇలా వుండాలి. ఏదో రామాయణగాథకి సంబంధించిన చిత్రంలా వుంది. ఇంకా మంచి ప్రకృతి రూపంతో ఆధునికరూపం చిత్రిస్తే బావుంటుంది.' అంటూ తలపైకెత్తి, "ఇదిగో! నువ్వు నవీనచిత్రాల్ని వ్రాయలేవూ? ఈనాటి ప్రజలను ఏ స్త్రీ చిత్రమో, ఏ శృంగారరసన్నివేశమో ఇట్టే ఆకర్షిస్తుందికదూ? ఏమంటావ్? అన్నాడు కొద్దిగా అసంతృప్తిని ప్రకటిస్తూ.

'బాబూ! తమరు ఆనాడు రవికి భారతమాతనుగూర్చి బోధిస్తూ, అతని ధ్యానం మళ్లించమన్నారుకదూ? అందుకని యీ చిత్రాన్ని వ్రాశా. బాగులేదూ?' అని అడిగాడు ఉమాకాంత్. 'బాగానే వుంది. కాని నా సలహా ఇంకా బావుంటుందేమో అని. ఏమంటావ్?' అన్నాడు డాక్టరు

ఉమాకాంత్‌కి 'ఇంతపనీ చేసి యీయన్ని తృప్తిపరచలేకపోయానే!' అనిపించింది. ఆత్మగౌరవం కలవాడుకాబట్టి సాహసించి, "డాక్టర్ గారూ! కలాసృష్టికి అంతేమిటి? దేశకాలపరిస్థితులు మారినా విశిష్టతలు అలానే వుంటాయి" అన్నాడు ఆత్మాభిమానం ప్రకటిస్తూ. కాని ఆయన ఏమనుకుంటాడో అని మనస్సు బాధపడుతోంది

"ఉమాకాంత్! నాకు కళనిగూర్చి బాగా తెలియదు. ఏదో చిత్రం బాగానే వుందిలే" అన్నాడు డాక్టరు.

డాక్టర్‌ను తృప్తిపరచలేనందుకు ఉమాకాంత్ పరితపిస్తున్నాడు డాక్టరు తన కుమారుడు రఘూని పిలిచి చిత్రం హాల్లో గోడకి తగిలించమన్నాడు

రఘూ "నాన్నా! ఈ చిత్రం చాలా బాగుంది. రోజూ పూలమాలలుంచి పూజించాలి ఈమహావీరుణ్ణి. చిత్రాన్ని లిఖించిన ఉమాకాంత్ ధన్యుడు" అన్నాడు ఆనందంతో.

'ఏవో! వుంచుమూ' అన్నాడు తండ్రి విసుగుని సూచిస్తూ. శెలవు తీసుకొన్నారు తండ్రీకొడుకులు డాక్టరుకి నమస్కరించి. దారి పొడుగునా ఒకే ఆ వేదన ఉమాకాంత్‌కి. 'ఇంతశ్రమపడి ఈయన్ని తృప్తిపరచలేకపోయానే. ఆనాడు డాక్టరేదో అంటే నేను ఈయన్ని మెప్పించలేనా? అనుకొన్నానే—' అనుకొంటూ తనలో తర్కించుకొంటూ బరువెక్కిన హృదయంతో ఇలు చేరుకొన్నాడు.

అసలే కార్యదీక్షల్ల కృశించిన ఆ మనస్సుకి ఆయనఅసంతృప్తి మరీ బాధకలిగించింది. "అయ్యో! ఆయన ఏం చేస్తాడో చిత్రాన్ని? కొడుకునైనా పూజించనిస్తాడో లేదో, నా కార్యం, ఆశయం వృథా అయినట్లేనా?" అని ప్రతిదినమూ పరితపిస్తూ కృశిస్తున్నాడు.

ఇలా ఉండగా ఒకనాడు రఘూ వచ్చాడు వాళ్లింటికి. 'ఉమాకాంత్‌జీ, రేపు నా పుట్టిన రోజుపండుగ చేసుకొంటున్నాం. మీరు తప్పక ఆ ఉత్సవానికి రావాలి' అన్నాడు.

'రఘూ! మంచిదే. కాని దేహారోగ్యం బాగులేదు. క్షమించమని మీ నాన్నతో చెప్పు' అన్నాడు ఉమాకాంత్.

'భోజనానికి రాకపోయినా సాయంత్రం పెద్దలంతా వస్తారు. మీరు తప్పక రావాలి. హాల్లో అల్పాహారవిందు వుంటుంది' అన్నాడు రఘూ.

రఘూ 'హాలు' అనగానే ఉమాకాంత్‌కి ఆనాటి దృశ్యం గుర్తుకువచ్చింది. చిత్రం అందించి నమస్కరించేసం, డాక్టరు అసంతృప్తి వెలిబుచ్చడం ఒక్కసారి స్మృతివీథిలో ఆ కళాకారుడికి తారాడాయి. వెంటనే "రఘూ! ఆ శ్రీరాముని చిత్రం యింకా హాల్లోనే ఉందా?" అన్నాడు.

"హాల్లోనే ఉంది. కాని ఆ వాళహాలు మధ్యగా గోడకి ఆనించి వుంచా బల్లలాద. కాని మా నాన్న యిష్టపడకపోవడంవల్ల ఒక మూలన ఉంచి నేనే పూలదండలుంచి పూజిస్తున్నా రోజూ. రేపు వస్తారుగా' అన్నాడు రఘూ.

'నే రాలేను నాయనా?' అన్నాడు ఉమాకాంత్.

'పోనీ - రవినేనా పంపండి తప్పక. పంపుతారుగా' అన్నాడు రఘూ.

'అలాగే నాయనా. స్నేహితుడేగా? వాడే వస్తాడు పద' అన్నాడు ఉమాకాంత్. రఘూ వెళ్లిపోయాడు.

'డాక్టరు నాసాంస్కృతికమూర్తిని ప్రముఖస్థానంలోంచి తొలగించాడా! పాపం. చిన్నవాడు రఘూరేనా గుర్తించినందుకుసంతోషం.' అనుకుంటూ రవిని పిలిచి "రవీ! రేపు సాయంత్రం డాక్టరుగారింటికి వెళ్లు. అంగులో వినయంగానూ, భక్తిగానూ మసులుకో. నీ తల్లి సూచించిన సౌశీల్యం అదే. జాగ్రత్తగా విషయాలను గమనించి రేపు రాత్రి నాతో చెప్పు" అన్నాడు సరే అన్నాడు రవి.'

మరునాడు సాయంకాలం డాక్టరుగారింటిలో అల్పాహారవిందు ఘనంగా జరుగుతోంది. చాలామంది పెద్దలు వస్తూన్నారు. హాల్లో కుర్చీలు, కుర్చీలకి ఎదుట బల్లలు అమర్చబడివున్నాయి. విందుకు వచ్చే పెద్దలలో అనేకులు ఖద్దరుధారులు, సూట్లలోవుండే పాశ్చాత్య పద్ధతుల్ని అనుకరించేవారు, ధనికులు, మధ్యతరగతి స్నేహితులు ఉన్నారు. పేరుపేరున వచ్చే ప్రతీపెద్దనీ డాక్టరు ఆహ్వానించి గౌరవిస్తున్నాడు. హాల్లో ఒక అలంకరింపబడ్డ కుర్చీలో క్రొత్తబట్టలు ధరించి రఘూ కూర్చున్నాడు. అతనికి కొంతదూరంలో స్నేహితుడు రవి కూర్చున్నాడు. విందులో ఉన్నా రవి వచ్చే పోయేవారందరినీ జాగ్రత్తగా చూస్తూనే వున్నాడు. 'జరగే విషయాలను జాగ్రత్తగా చూచి నాతో చెప్పాలి' అన్న తండ్రిమాటలు రవికి చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ ధ్యానంతో కార్యక్రమంలో ప్రతీపనినీ శ్రద్ధగా గూస్తున్నాడు.

ఆ హాల్లోనే ఒకమూల ఉంది ఉమాకాంత్ వ్రాసిన చిత్రం 'కర్తవ్యపాలన' అనే పేరుతో. ఆ గోడకి చేరవగానే ముగ్గురు పెద్దలు సూటుల్లోనూ, ఇద్దరు కాంగ్రెసువారు ఖద్దరులోనూ ఉన్నారు ఆ ప్రక్కనే డాక్టరు వున్నాడు. పదార్థాలు ఒకొక్కక్కటే తెచ్చి బల్లలపై వుంచుతున్నారు సేవకులు. ఈలోపుగా ఆ పెద్దలు వెనక్కి తిరిగి పటాలని చూస్తున్నారు. క్రమంగా వారి దృష్టి 'కర్తవ్యపాలన' అన్న చిత్రంపైకి ప్రసరించింది. మిక్కిలి నేర్పుతోనూ, ప్రత్యేకఆశయంతోనూ వ్రాయబడ్డ చిత్రం వారి నాకర్షించడంలో ఆశ్చర్యం లేదు. ప్రతీచిత్రాన్నీ చూస్తూ బాగోగులు వెల్లడిస్తూ నవ్వుకొంటున్నారు.

'డాక్టర్! ఈ చిత్రంలో ప్రకృతి, మహాపురుషుడు ఎంత చక్కగా చిత్రింపబడ్డారో? చిత్రకారుని నైపుణ్యం ఇక్కడే ఉంటుంది' ఇంకా ఏంటో అంటున్నాడు ఒకపెద్ద

'ఏముందండీ! ఇరవయ్యోశతాబ్దంలో వుండీ గూడా మనవాళ్లింకా యీ పురాణాల ఘట్టాలు చిత్రిస్తారేమండీ? మనం సర్వత్రా అభ్యుదయం పొందలేదనడానికిది ఒక ఉదాహరణ కళలు, అలవాట్లు అన్నిటిలోనూ నవీనత్వం కావాలి ప్రాత పోయి క్రొత్తదనస్తేనే శోభ' అంటూ వికటంగా నవ్వాడు సూటులో వున్న ఒక పెద్దమనిషి సభలోవాళ్లంతా నవ్వుతున్నారు.

ఇంత విందులోనూ యీ సంఘటన చూసిన డాక్టరుకి ప్రాణం చివుక్కుమనిపించింది. ఏదో సమాధానం చెబుదామనుకొన్నాడు; కానీ అంతా గొల్లుమని మొదటి విమర్శకుల్ని అనుసరించేశారు. ఇంకేం చేస్తాడు? దానివిషయమై మౌనమే మంచిదనిపించింది యీఆలోచనలో వుండి డాక్టరూ రఘూవైపు చూడలేదు.

రవి ప్రక్కనుంచి ఇదంతా చూస్తున్నాడు శ్రద్ధగా. వాళ్లనవ్వులూ, మాటలూ వింటూంటే అతనిని ఎవ్వరో సమ్మెటతో తలపై కొడుతూన్నట్లనిపించింది తన తండ్రి నెలలతరబడి నిద్రాహారాలను త్యజించి, రక్తమాంసాలను ఆవిరిచేసి, కాలయాపనని గణించక, తీవ్రమైన నిష్ఠతో, నిర్మల మాతృప్రేమతో రచించిన సాంస్కృతికచిహ్నం నిండుసభలో అవమానింపబడింది. భారతీయులే తమ కళల విశిష్టతను గుర్తించలేని హీనస్థితికి వచ్చినందుకు దుఃఖం పొంగివస్తోంది అతనికి. ఒక్క యువకుడు ఏమనగలడు ఆ సభలో? వెంటనే రవికి మనోవేదన అధికమైంది. విందు సాగిపోతోంది. దేశాన్ని మోసంచేసే పెద్దలంతా నవ్వుకుంటూ పదార్థాల్ని మెక్కుతున్నారు. ఆ మాటలూ, నవ్వులూ చెవులారావిని బాధపడుతూన్న రవి ఏమీ తినలేకపోయాడు.

విందు అయిపోయింది. తరువాత గానకచేరీకి పెద్దలంతా బయట పందిరిలోకి వెళ్లారు. బరువెక్కిన హృదయంతో రఘూ వద్దంటూన్నా శెలవుతీసుకొని యింటికి చేరాడు రవి. రవి యిల్లు చేరుకొనేసరికి చీకటిపడింది. ఇంట్లో ఇంకా దీపం పెట్టలేదు నాన్న. వెంటనే దీపం వెలిగించి మంచంమీద పడున్న ఉమాకాంత్ దగ్గరికి వెళ్లి ప్రక్కనే కూర్చున్నాడు.

గాలి వేయడంవల్ల బుడ్డి దీపం ఆరిపోయింది. 'నాన్నా! దీపం వెలిగిస్తా' అని లేవబోయాడు రవి. 'రవీ! నీవుండగా దీపం ఎందుకు? నీవే ఈయింటికి కాంతివి' అంటూ ఉమాకాంత్ రవివీపు నిమురుతున్నాడు. అలా వున్న ఉమాకాంత్ చెక్కిళ్లపై రెండు వేడి కన్నీటి బిందువులు పడ్డాయి తండ్రి కంఠం వణకిపోయింది. 'రవీ! ఏడుస్తున్నావా? ఎందుకు? విందులో ఎవరేనా ఏమైనా అన్నారా? 'చెప్పు నాయనా' అన్నాడు చెదరిపోతూన్న హృదయంతో. విషయం తెలుసుకొందామన్న ఆవేదనతో వేడెక్కిన తండ్రిశరీరాన్ని తాకి రవి ఇంక నిజాన్ని దాచలేకపోయాడు

కళ్లనీళ్లు తుడుచుకొంటూ 'నాన్నా! ఏం చెప్పను? నీకూ, నాకూ మనవంశానికే కాదు కళకే తీరని అవమానం జరిగింది' అన్నాడు. ఏమిటి అది? అని అడిగాడు ఆత్రుతతో తండ్రి. 'నువ్వు అన్నాళ్లు కష్టపడి వ్రాసిన శ్రమకి గండ్రో దెబ్బ తగిలింది. ఆనాడు డాక్టరన్నది అంతగా నేనమనించలేదు. ఈనాడు స్వయంగా పెద్దలు, గౌరనీయులట! మన చిత్రంపోకడేను తూలనాడారు నే వినలేకపోయాను ఆపహాసాలు. నీచిత్రంలోనూ, కళలోనూ అభ్యుదయం లేదట' ఇంక ఏమీ చెప్పలేక దుఃఖిస్తున్నాడు రవి.

తుఫానులో కొట్టుకొంటున్న ఓడకు మళ్లీ ఒక పెద్ద కెరటం డీకొంది. ఉమాకాంత్‌కి ఒక గొడ్డలిపెట్టు ఈవార్త. తన ఆశయాన్నీ, ఆదర్శాన్నీ, కళనూ సమాజం సవాలుచేస్తున్నట్లుంది. 'ఔను. రవీ! దేశం స్వతంత్రతను పొందినా ఇంకా భావదాస్యం పోలేదు నాయనా. మళ్లీ పవిత్రభారతదేశంలో మన కళలు వెలుగొందడానికి కొన్ని యేండ్లు పడుతాయి. కాని ఇది తప్పక సంభవిస్తుంది. నే చూడలేకపోయినా నీవైనా తప్పక ఆ అభ్యుదయాన్ని చూడగలవు.' ఇలా చెప్పే తండ్రివాక్కులను వింటూన్న రవిఆత్మకు శాంతి కలిగి నిద్రపట్టింది ఆరాత్రి.

ఇక డాక్టరుఇంటిలో. విందు జరిగిపోయిన నాటిరాత్రి డాక్టరుకు నిద్ర పట్టలేదు. ప్రొద్దుటి నుండీ జరిగిన కార్యక్రమాలలోకల్లా సాయంత్రం జరిగిన విషయమే అతణ్ణి కించపరుస్తోంది. 'అసలు ఆ పటం ఆనాడే మూలపడేయవలసింది. పిల్లవాడు పూజచేసుకొంటానంటే సరే అనుకొన్నా. దీనికి తాళం వేస్తూ ఆనాడు రఘూ ఆ చిత్రానికి పెద్ద పూలదండకూడా వేశాడు ఇతర చిత్రాలకి దండలు లేకపోవడం; కొట్టొచ్చినట్లు ఆ బొమ్మకి పెద్ద దండ వుంచడం. నేనే ముందు పొరబడ్డా ఎంత అవమానం జరిగింది?' అనుకొన్నాడు.

మరునాడుదయం రఘూని పిలిచి పటం తీసెయ్యమన్నాడు. రఘూ ఒప్పుకోలేదు. తండ్రి కోప్పడి పటానికి గుడ్డ కప్పి మూలపడేయ్యమన్నాడు రఘూ ఏం చేస్తాడు? శ్రద్ధగా కాగితాలు కప్పి దాచేశాడు చిత్రాన్ని. తండ్రి ఇలా కోప్పడినదుకు రఘూ ఎంతో బాధపడ్డాడు. రెండురోజుల తర్వాత రవితో ఈ సంగతి చెప్పి చాలాసేపు విచారించాడు. అసలే బాధపడుతూన్న రవిహృదయానికి ఇది మరీ ఆవేదనను కలిగించింది.

రవి ఈ విషాదవార్త తండ్రితో చెప్పాడు. అసలే ఆరోగ్యం చెడి బాధపడుతూన్న ఉమాకాంత్‌ని ఇది మంచం ఎక్కించింది. జీవితంలో ఎన్నడూ ఎరుగని విఘాతాలు ఆ కళామూర్తికి. తత్వారాధకులకెప్పుడూ ఇలాంటి కష్టాలే ప్రాప్తిస్తూంటాయి. ప్రేమమయజీవనం సాగింటే జీవితనౌకకి చుక్కాని తనభార్య నట్టేటిలో వదలి వెళ్ళిపోయింది. తుఫానులు చెలరేగాయి సముద్రంలో. ఎన్నో బాధలు. రవి జీవితం కళారాధనలో అంతిమఘట్టం. తనకు శాశ్వతానందాన్ని సౌఖ్యాన్ని కూరుస్తుందని ఊహాసౌధాలు నిర్మించుకొన్న ఉమాకాంతుడికి అవి గాలిమేడలైనాయి. రాలిపోలేక కునుకుతున్న తారలా

(16 పేజీ-చూడుడు)

పతనమార్గంలో ఉంది ఆతని బ్రదుకు. ఒక్క రవి కోసం తన బ్రతుకు ఇంక భూమి మీద. క్రమక్రమంగా వ్యాధి ఎక్కువైతోంది ఆతనికి.

కాలచక్రం వేగంగా దొర్లిపోతోంది. రోజులు, నెలలు గడిచిపోయాయి. ఉమాకాంత్ స్థితి చాలా గడ్డుగా వుంది. రోజూ డాక్టరుని బ్రతిమాలి రవి మందు తెచ్చి పోస్తున్నాడు. ఒకనాడు తండ్రిచేత మందుమాకులు తెప్పించుకొన్న రవి, రాలిపోతాడనుకొన్న రవి యీనాడు తండ్రిబుణాన్ని మళ్లించుకొంటున్నాడు.

ఇలా వుంటూండగా ఆ మహానగరంలో కళాప్రదర్శనం ఒకటి ఏర్పాటు చేశారు. దేశంలో నలుమూలలనుండీ చిత్రకారులు లలితకళాప్రదర్శనానికి తమ చిత్రాలను పంపుతున్నారు. ప్రదర్శనం మూడురోజులలోనూ ఒకరోజు గడచిపోయింది. క్రమంగా ప్రదర్శనం సంగతి రవికిగూడా తెలిసింది. తన తండ్రితో చెప్పకుండా రెండో రోజున రవి ఉమాకాంత్ వ్రాసిన 'కర్తవ్యపాలన' అనే చిత్రాన్ని ప్రదర్శనానికి తీసుకెళ్లాడు. నగరంలో ప్రముఖులంతా ప్రదర్శనానికి ఆహ్వానించబడ్డారు. ఉత్తమ చిత్రానికి రు 500 లు బహుమానం యివ్వబడుతుందని తెలియజేశారు. చిత్రకళాప్రదర్శనం జయప్రదంగా ముగిసింది.

ఈ మూడు రోజులలోనూ రవి ఇల్లు వదలి బయటకు రానేలేదు. తండ్రికి ఆరోగ్యం బాగు లేనందువల్ల డాక్టర్ గారిని బ్రతిమాలి మందు వేయిస్తున్నాడు. వ్యాధి ముదరడంవల్ల డాక్టర్ రోజల్లా ఉమాకాంత్ వద్దనే ఉండిపోయాడు. ఇలా ప్రదర్శనం మూడునాళ్లూ గడచాయి.

నాలుగోరోజున సమారోహణ జరుగుతుంది. ప్రసిద్ధకళాకారులు బహుమానం నిర్ణయించడానికి నియోగించబడ్డారు. ఆ సమారోహణోత్సవానికి నగరంలో పెద్దలంతా ఆహ్వానింపబడ్డారు. డాక్టరుకుగూడా ఆహ్వానం అందింది. ఎలాగో వీలుచేసుకొని, ఉత్సవానికి బయలుదేరాడు. ప్రదర్శనమందిరంలో బ్రహ్మాండమైన సభ యేర్పాటుచేయబడింది. సభకు అందరితోపాటు రఘూకూడా వచ్చాడు. 'నాతో వస్తా' నంటూన్నా ఉమాకాంతుని ఒప్పించి రవిని గూడా సభకు తీసుకువచ్చాడు రఘూ. సభలో కళాకారులు 'కర్తవ్యపాలన' అనే చిత్రం ఉత్తమ బహుమతిని పొందినదని, చిత్రకారుడెవరో తెలియదనీ చెప్పుకొన్నారు. చిత్రం సభకు ఒకసారి చూపబడింది. సభఅంతా ఆ చిత్రానికి నమస్కరించారు. డాక్టర్ కు చిత్రం చూసేవరకు ఏమీ బోధపడలేదు. సభవారు ప్రశంసించే ఆర్భాటాన్ని చూసి నిర్ఘాంతపోయాడు. తన బుద్ధిమాంద్యానికి క్షణంపాటు తన్నుతానే నిందించుకొన్నాడు. రఘూ ఆనందానికి మేర లేదు. రవికి ఆశ్చర్యమూ, సంతోషమూ కలిగాయి. తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. వెంటనే డాక్టర్ లేచి చిత్రకారుడు 'శ్రీ ఉమాకాంత్' అన్నాడు. 'చిత్రం వ్రాసిన శ్రీ ఉమాకాంతునకూ, ఆయనపేరు తెల్పిన డాక్టర్ గారికీ ధన్యవాదా లన్నాడు' అధ్యక్షులు. రు 500 లు డాక్టర్ కు అందజేయ్యబడ్డాయి. సభ ముగిసింది.

వెంటనే ఇంటికి వచ్చాడు రవి. అప్పటికే ఉమాకాంత్ స్థితి క్రిందుమీదుగా ఉంది. రవిని చూడగానే 'నాయనా రవీ! యీ ఆఖరి క్షణంలో ఒక్కసారి నాదగ్గరకు రా' అన్నాడు తండ్రి. కన్నీళ్లతో రవి తండ్రిపై వ్రాలాడు. 'తండ్రీ. నీకృషిని పెద్దలు గుర్తించారు. కళాప్రదర్శనంలో బహుమానం వచ్చింది మన 'కర్తవ్యపాలన'కు అన్నాడు. ఉమాకాంత్ కి యీ మాటలు వింటూంటే ఆనందబాష్పాలు పెల్లుబికాయి... 'పోనీలే! పోయేముందు యీజీవికి శాంతిని ప్రసాదించే వార్త విన్నా. రవీ! ఆదర్శానిదే అంతిమవిజయం. జీవితంలో అప్పుడప్పుడు కష్టాలువచ్చినా నీ ఆదర్శాన్ని వీడకు నాయనా' అంటూ కన్ను మూశాడు ఆకళారాధకుడు ధన్యజీవి. వెంటనే ఆ బయట నిశీధంలో ఒకతార మెరుస్తూ..మింటికెగ బ్రాకింది.

మరునాడు ఉదయం డాక్టర్ రూపాయలు పట్టుకొచ్చాడు కళాకారుని గృహానికి. జరిగినదంతా గుర్తించాడు. కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నరవిని ఓదార్చడం ప్రారంభించాడు. రవిని డబ్బు తీసుకోమన్నాడు. "నాకు ఔషధమిచ్చినందుకు ఆచిత్రమూ, నాతండ్రికి ఔషధమిచ్చినందుకు ఈసొమ్మూ పరిగ్రహించండి' అన్నాడు దుఃఖిస్తూ రవి. డాక్టర్ ఖిన్నుడయ్యాడు. తప్పు క్షమించమని ఉమాకాంత్ ని ప్రార్థించాడు. మరునాటినుండి రవినిగూడా తనయింటనే వుండమన్నాడు. రోజూ రఘూ, రవీ 'కర్తవ్యపాలన' చిత్రానికి పూజచేస్తూ తమ తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారు.



దేవుళ్ల దెబ్బలాటలు

శ్రీమతి నందివాడ పుతలీ

అనగాఅనగా ఒక బ్రాహ్మణుడుండేవాడు. ఆయన మహాపండితుడు. రాజుగారి ఆస్థానంలో కవిగా ఉండి, మహాపండితు లందరినీ భాషావాదంలో ఓడించిన మేధావి. కాని ఆయనకి పిల్లలు లేరు. పిల్లలకోసం ఘోరతపస్సు ప్రారంభించా డాయన. బ్రహ్మ ప్రత్యక్షమై 'నీ తపస్సుకి చాలా సంతోషించాను. ఏం కావాలో కోరుకో' మన్నాడు.

'స్వామీ నాకు పిల్లలు కావాలి' అన్నాడు. 'పిల్లలెందుకోయ్ వెధవపీడ వాళ్ళవలన నీకు సుఖం లేదు. యింకేదేనా కోరుకో' మన్నాడు.

పిల్లలు లేనప్పుడీ భోగభాగ్యము లన్నీ ఎందుకు? ఏ పాపమూ చెయ్యకపోయినా, పున్నామ నరకం తప్పదా తండ్రీ. సుఖం లేకపోయినా సరే. సంతానాన్ని ప్రసాదించు.' అన్నాడు.

'సరే అయితే నీకు ఐదోతనం లేని ఆడపిల్ల కావాలా అర్ధాయుస్సున్న మొగపిల్లవాడు కావాలా?'

'అదేమిటి! న్యాయమేనా నీకు. యిద్దరు ఆడపిల్లల్ని యిద్దరు మొగపిల్లల్ని ప్రసాదించి వారివలన అన్ని ముచ్చట్లూ తీరేటట్టు కరుణించు' మని ప్రతిమాలాడు.

'నిన్ను సృష్టించినప్పుడే పిల్లల యోగ్యత రాసిపారేస్తే యీ పీడ ఉండేది కాదు నాకు. అసలు నాకు నిద్రమత్తెక్కువవుతోందిలే. అందుకనే దేవతలంతా నన్ను వట్టి తెలివితక్కువదద్దమ్మగా జమకట్టారు. నామీద చాలా నేరాలారోపిస్తున్నారు. పదవీభంగమవుతుందేమోనని భయంగా ఉంది. అంటే నీకుకూడ ఉద్యోగం మోజేనా అంటావేమో! నాకది లేదుకాని ఉద్యోగం ఊడపెరికి పొమ్మనడంకన్న మొగాడికి చిన్నతనం యింకేదైనా ఉందా! సౌఖ్యం లేనప్పుడీ పిల్లలయితే ఏం నీకు అంతమందెందుకు? ఒక్కడిని కోరుకో. నీ మంచికోసమే చెప్తున్నా. అదీ కాక నీకు కావల్సింది పున్నామనరకనిష్కృతిమాత్రమే కదా' అన్నాడు.

'సరేలెండి. పుట్టి చచ్చినా పుత్రుడే నేమో. పోనీ ఒక కొడుకు నివ్వండి చాలు' అన్నాడు.

బ్రహ్మ సంతోషించి వర మిచ్చి వెళ్ళిపోయాడు.

బ్రాహ్మణుడికి కొడుకు పుట్టాడు. బ్రాహ్మణుడు, భార్య ఎంతో సంతోషించారు. సోమయాజులుగారికి సాహిత్యగోష్ఠితో కాలం గడిచిపోయేది. ఆయన కొడుక్కి పాఠం చెప్పడానికి తీరిక ఉండేది కాదు. బ్రాహ్మణుడి భార్యకి కొడుకంటే అతిగారాబం. ఎప్పుడూ ఏవో తినడానికి పెడ్తూ కబుర్లు చెప్తూ కూర్చునేది కుర్రాడితో. ఆమెకి తన కొడుక్కి చదువు చెప్పాలన్న ఊహే లేదు.

ఒకరోజున సోమయాజులగారింటికి ఆయన స్నేహితుడు వచ్చాడు. పిల్లాడిని చూడగానే వట్టి శుంఠని ఆయన గ్రహించాడు. 'పండితపుత్రః శుంఠః' అన్న వాక్యం సార్థకం చేశావురా తండ్రీ అని వేళాకోళమాడాడు. సోమయాజులుగారికి తలతీసినట్టయింది. వెంటనే కొడుక్కి పాఠం చెప్పి, 'ఒరేయ్ అబ్బాయ్ నేను వచ్చేటప్పటికి నువ్వు యివి చదివెయ్యాలి' అన్నాడు. కొడుకు సరేనని తలూపాడు. ఆయన రాజసభకి వెళ్ళిపోయాడు.

సోమయాజులుగారింటికి వచ్చేటప్పటికి కొడుకు తల్లితో పచ్చీసు ఆడుతున్నాడు. ఆయనకి అరికాలి మంట నెత్తికెక్కింది. రామశాస్త్రి అన్నందుకేనా సిగ్గు లేదుట్రా. బ్రహ్మ ఎంత చెప్పినా వినలేదు. అప్పుడు బుద్ధి గడ్డికరచింది. చెట్టుడిగేకాలానికి కుక్కమూతి పిందన్నట్టుగా బయల్దేరావ్. శాస్త్రభయం చెప్పి చదివించాలని నీకైనా తోచలేదుటే? సోమయజులు కొడుకు చవటపెద్దమ్మ అంటే నీకే కదూ చిన్నతనం. వెధవ! కడుపు చెడబుట్టావ్. నాకది అప్పచెప్తేకాని అన్నం పెట్టేది లేదని కేకలు వేశాడు.

అబ్బాయి కాసేపు చదివాడు. రాలేదు. పుస్తకం చేత్తో పట్టుకుని దిక్కులు చూస్తూ కూర్చున్నాడు. చీకటిపడింది. తల్లి అన్నానికని పిలిచింది. పాఠం వస్తేగాని అన్నం పెట్టడానికి వీల్లేదని సోమయాజులు గారు పట్టుబట్టారు. తల్లిచేసేది లేక ఊరుకుంది. పాపం అబ్బాయి కాకలి వేస్తోంది. వంటింట్లోకి తొంగి చూశాడు. తల్లి గిన్నెలు మూతపెట్టి నిద్రపోతోంది. సోమయాజులు గారు భోంచేయగానే ఎక్కడికో వెళ్లిపోయారు.

అబ్బాయికి ఏం చెయ్యడానికీ తోచలేదు. పక్కింటి పేరిశాస్త్రి 'ఒరేయ్' గుడిలో పూజ చూద్దాం వస్తావురా అని అడిగాడు. అబ్బాయికి ప్రాణం లేచివచ్చింది. పుస్తకం అక్కడే పడేసి గప్‌చుప్‌గా తల్లితోనైనా చెప్పకుండా గుడికి బయల్దేరాడు.

శివరాత్రికదూ! పూజ చాలాసేపు జరుగుతుంది. ప్రసాదం పెట్టారుకదా పూజయ్యేదాకా ఉందా మని సోమయాజులుగారబ్బాయి పూజ చూస్తూ కూర్చున్నాడు. పూజయిపోగానే పూజారి అందరికీ ప్రసాదం పంచిపెట్టాడు. కాని దానితో అతని ఆకలి తీరుతుందా! అందరూ ప్రసాదం పుచ్చుకుని వెళ్ళిపోతున్నారు. సమయం చూసి పళ్లెంలోని ప్రసాదం దొంగతనం చేద్దామని స్తంభంవెనక్కాల నక్కిఉన్నాడు. అందరూ వెళ్ళిపోయారనుకుని పూజారి తలుపు దగ్గరగా వేసికొని పడుకున్నాడు.

ఇదే సమయమని అబ్బాయి తలుపు నెమ్మదిగా త్రోసి గర్భగుడిలో ప్రవేశించాడు. ఏం కొంపకి [illegible] పళ్లెం కనిపించటంలేదని ప్రమిదలో చమురు పోసి వత్తి నెగద్రోశాడు. కాని ఆతురతతో పళ్ళెం తీసికొంటూంటే పూజారి కాలు తగిలింది. పూజారి దొంగ! దొంగని అరిచాడు. చుట్టుపక్కలవాళ్లు పరుగెత్తుకునివచ్చి అబ్బాయిని కర్రలతో కొట్టారు. దెబ్బల తాకిడికి అతని ప్రాణం పోయింది.

పిల్లవాడి ప్రాణంకోసం యమకింకరులు వచ్చారు. శివుడు పంపడంచేత శివకింకరులు వచ్చారు.

ఇదేమిటి మీరు వచ్చారు వీడు మహాపాపి. శివప్రసాదం దొంగతనం చెయ్యడానికి ప్రయత్నించాడు. అలాటి తుచ్ఛుణ్ణి తీసికొనివెళ్తారా మీ రని యమకింకరులు శివకింకరుల నడిగారు.

శివుడి గుడిలో దీపం కొండెక్కుతోంటే చమురు పోసి వత్తి నెగద్రోశాడు. శివపూజ కళ్లారా చూశాడు. శివసాన్నిధ్యంలో ప్రాణాలు విడిచాడు. వాడికి కైలాసం కాక మరే ముందన్నారు శివకింకరులు.

'అలా వీల్లేదు. యమధర్మరాజు మమ్మల్ని తీసికొనిరమ్మన్నా' రని యమకింకరు లన్నారు.

'ఇది మా ప్రభుఆజ్ఞ' అని శివకింకరులు అబ్బాయిని శివసాన్నిధ్యానికి తీసికొనిపోయారు.

యమకింకరులు వెళ్ళి జరిగిన యావద్వృత్తాంతమూ యమధర్మరాజుకి విన్నవించారు. యమధర్మరాజు విష్ణువుదగ్గరకు వెళ్ళి అంతా చెప్పి మొరపెట్టుకున్నాడు. విష్ణుమూర్తి మంచి గడసరి కదూ! యిద్దరూ నాకు ముఖ్యులే ఎవర్ని ఏమంటే తప్పో మన కెందుకు పేచీ అనుకొని, 'నాదగ్గరికి వస్తే ఏం ప్రయోజనం? ఇద్దరూ కలిసి బ్రహ్మనడగండి. పుట్టించినవా డాయనే కనక మీ సందేహం తీర్చగల డని తీర్పు చెప్పాడు.

యమధర్మరాజు, శివుడు బ్రహ్మ దగ్గరకు వెళ్ళారు. బ్రహ్మ శివుణ్ణి చూచి "చచ్చిన వెధవ వట్టి శుంఠ. వడుగైనా గాయత్రీమంత్రమేనా రాదు వీడికి. తండ్రితో చెప్పకుండా వచ్చేశాడు. ఇది ఒక అపరాధం. గుడిలో దొంగతనం చెయ్యడానికి ప్రయత్నించడం రెండో తప్పు. వీడు వట్టి పాపి. యముడికే చెందాలి వీ డని తీర్పు చెప్పాడు.

శివుడికి ముక్కుమీద కోపంకదా? అంచేత 'ఏ మైతే నేమయ్యా వాడు, నా సాన్నిధ్యంలో చని పోయాడు. దీపం హెచ్చించాడు. శివరాత్రిపూట పూజ చూశాడు. వీడికి స్వర్గం తప్ప నరకం లే' దన్నాడు శివుడు.

బ్రహ్మ 'ఎంత వెర్రివాడవయ్యా. వాడికి మోక్ష మిస్తా నంటా వేమిటి? వా డే ఉద్దేశ్యంతో వచ్చాడు? అలాటి దొంగనా నువ్వు కటాక్షించడం?' అన్నాడు.

ఉద్దేశం ఏ దైతే నేం క్రియ ముఖ్యం. ఏ బుద్ధితో అయితే నేం శివపూజ కళ్ళారా చూశాడు. దొంగతనం కోసమే ననుకో అయినా శివరాత్రి పూట జాగరణం చేశాడు. దీపం కొండెక్కుతోంటే చమురు పోసి వత్తి ఎగసనుదోశాడు. అలాటి వాడి కన్న మోక్షం ఎవరికి ఉంది అన్నాడు శివుడు.

బ్రహ్మ ఎంత ఉబ్బలింగడివయ్యా అని యింకా ఏదో అనబోతోంటే శివుడు మాట కడ్డమొచ్చి,

ఉబ్బలింగణ్ణయితే ఫర్వాలేదులే. నీ పనినిబట్టి నువ్వు మంచివాడ వంటాను కాని నీ హృదయం చూసి కాదు. నీ హృదయంలో దూరి చూసే నిన్ను మంచివా డంటున్నారా ఏం అని ఎకసక్కెంగా నవ్వి 'వాడిది తప్పే అనుకో. దానికి తగ్గ శిక్ష అప్పుడే అనుభవించాడుకదూ! దొంగతనం చేసినందుకు అందరూ చావకొట్టారు. అక్కడే శిక్ష అనుభవించేశాడు. మరి నా సాన్నిధ్యంలో పోయినందుకూ, పూజ చేసి, రాత్రి జాగరణంచేసి, దీపం వెలిగించినందుకూ వాడికి మోక్ష మిస్తున్నా నన్నాడు.

ఎంత మెత్తమనసువాడివయ్యా. ప్రసాదం దొంగతనంచేద్దా మనుకున్న వెధవకా మోక్షం. యింతకీ వాడు ప్రసాదం తిన్నే లేదాయె అన్నాడు బ్రహ్మ.

ప్రసాదమో ప్రసాదమో అంటా వేమిటి నా భక్తులు ప్రసాదం తినక్కర్లే దన్నాడు. శివుడు.

దీపం వెలిగిస్తే చా లన్నమాట. అయితే శివకటాక్షం అందరికీ అతిసులభంగా వస్తుంది. యిదే బాగుంది. పూజ చెయ్యడం, నైవేద్యమిచ్చి ప్రసాదం తిని భక్తితో ఉండక్కర్లేదు. దీపం వెలిగించి మన యిష్టంవచ్చి నట్టున్నా ఫర్వాలేదు. ఇట్టే మోక్షప్రాప్తి అని నవ్వాడు బ్రహ్మ.

శివుడు రౌద్రమూర్తి అయాడు. బ్రహ్మ శివుడి నింకా వేళాకోళ మాడాడు. భక్తు లంటే నీ కెంత జాలి! ఏది చెయ్యడానికైనా వెనుకంజ వెయ్యవు. ఆ వెధవకి మోక్షం యివ్వడానికి శివభక్తులు ప్రసాదం తినక్కర్లే దన్నావు. దీపం పెట్టే చాలుటయ్యా మోక్షప్రాప్తికి? హృదయనైర్మల్యం ఉండక్కర్లేదూ అన్నాడు.

శివుడికి కోపంతో ఒళ్ళు తెలియలేదు. నీ భక్తులికి హృదయనైర్మల్యం కావాలేమో. నా కనవసరం. నీ కసలు ధూపదీపా లుండవు. నైవేద్యం గియ్యవేద్యా లుండవు. హృదయనైర్మల్యాన్నిబట్టి, మోక్షం యియ్యి. ఆవాహన విసర్జన లేకుండా పడిఉండమని శపించాడు.

శివుడు శపిస్తే బ్రహ్మకి కోపం వచ్చింది. తనకుమాత్రం చేతకాదా శపించడం!

'నీ ప్రసాదం తిన్నవాడికి మహాపాపం వస్తుంది. నీగుడిలోని మారేడు దళమైనా నీ భక్తుడు తీసికొంటే వానికి పాపం తప్ప దని ప్రతిశాప మిచ్చాడు.

అప్పటినించీ బ్రహ్మదేవుడికి పూజ లేదు. ఆనాటినుండీ బ్రహ్మకి వెఱచి ఎవరూ శివప్రసాదం తినరు.

బాలానందం :

అపాయానికి తగిన ఉపాయం

"కడియం లక్ష్మీనారాయణ"

కొన్నివందల సంవత్సరాలక్రితం ఢిల్లీ సామ్రాజ్యాన్ని అక్బరు అనే మహమ్మదీయరాజు పాలిస్తుండేవాడు. అతడు మిగతతురకరాజులవలె గాక హిందువుల్ని మహమ్మదీయులతో సమానంగా ఆదరించేవాడు. ఆయనకొలువులో చాలామంది హిందూఉన్నతోద్యోగులుండేవారు. వీరబల్ అనే విదూషకుడు కూడా ఆ ఆస్థానంలో ఉండేవాడు. అతడు చాలా తెలివైనవాడు. ఎట్టి సమస్యనైనా యిట్టే చెప్పేసేవాడు. చక్కని మాటల్ని చెప్పి రాజును సంతోషపెట్టేవాడు.

ఒకనాడు, అక్బరు కొలువులో ఉండగా వీరబల్‌తో, "ప్రపంచంలోఎవరు సరియైన కృతజ్ఞులో, ఎవరు సరియైన కృతఘ్నులో వారి నిద్దరిని నావద్దకు తీసుకొనివచ్చి చూపించాలి. వారం రోజులు గడు విచ్చాను. నీవు వారిని చూపనియెడల కఠినశిక్షను విధిస్తాను" అని చెప్పి, ఆనాడు సభ చాలించాడు.

ఈ సమస్య అందరికే కాకుండా, వీరబల్‌కుకూడా చాలా కష్టంగా వుంది. ఎన్నివిధాల ఆలోచించినా ఆ ప్రశ్నకు సరియైనవారు కన్పడలేదు. గడువు సమీపించింది. తనకు శిక్ష తప్ప దనుకున్నాడు. ఆలోచించగా, ఆలోచించగా, చివర కో ఆలోచన తట్టింది.

గడువురోజున వీరబల్ తన కుక్కనూ తన అల్లుడినీ, వెంట తీసికొని, రాజు కొలువుకు వెళ్ళాడు. కొలువులోనివారు ఇది చూసి పక్కున నవ్వారు.

"వీరేనా నేను తీసుకొనిరమ్మనిన వారు?" అని నవ్వుతూ రాజు వీరబల్‌ను అడిగాడు.

వీరబల్ యిలా అన్నాడు," మహారాజా! ఈ కుక్కయే ప్రపంచంలోకెల్ల కృతజ్ఞత కలది. నేను రోజూ యేమి పెట్టినా దానినే తిని, సంతృప్తి పొందుతూ, నా యింటిని విడువక కాపలా కాస్తూవుంది. నేను కొన్ని రోజులు తిండి పెట్టకపోయినా, చివరకు దూరంగా విడచివచ్చినా, నా యింటికి వచ్చి కాపలా కాస్తూవుంది. దీనికి గల విశ్వాసం యింతా అంతా గాదు. కనుక యిదే ప్రపంచంలోకెల్ల కృతజ్ఞత గలది" అని, తిరిగి తన అల్లుణ్ణి చూపుతూ, రాజుతో యిట్లాఅన్నాడు, రాజా! యీతడు నా అల్లుడు. ఇతనిని అధిక ప్రేమతో చూస్తూ, ఇతని కెంత ధన మిచ్చినా, ఎన్ని మంచి మంచి కానుకలను యిస్తున్నా, కొంచమైనా సంతోషపడడం లేదు, సరిగదా! యిచ్చినవాటి నన్నింటిని మరచిపోయి, యేమీ యివ్వలే దంటూ చెప్తున్నాడు. ఇతనికి మే మెంత యిచ్చినా కాస్తంతైనా విశ్వాసం లేదు. కాబట్టి ప్రపంచాలోకెల్ల అల్లుడే కృతఘ్నుడు" అని మనవిచేశాడు.

వెంటనే ఆ రాజు తన భటులను పిలచి, "మంచిదైన యీ కుక్కను తీసుకొనిపోయి, దీనికి పాలు పోయండి. ప్రపంచంలో కృతఘ్ను డనేవాడు ఉండకూడదుకాబట్టి, అల్లు డనేవాడు కృతఘ్ను డని వీరబల్ అంటున్నాడు గనుక, అతని అల్లుని నేడే ఉరితీసి వేయండి" అని ఆజ్ఞాపించాడు.

ఇట్టి ఘోరమైన రాజశాసనాన్ని విన్న వీరబల్‌కు చాలా ఆందోళన కలిగింది. తాను ఒకటి తలిస్తే దైవము వేరొకటి చేసిం దన్నట్లు, తన ప్రాణాలను కాపాడుకోడానికి తా నీ యుక్తి పన్నగా, తన అల్లునికి ప్రాణాపాయం కలిగిం దని భయపడ్డాడు. అంతలోనే అతని కొక యుక్తి స్ఫురించింది.

రాజుతో, "మహాప్రభూ! నా ఒక్క మనవి విని, నా అల్లునికి శిక్ష విధించండి. నా అల్లుని రక్షించడానికి నే నేమి చెప్పడంలేదు. అల్లుడు కృతఘ్నుడు కాబట్టి చంపివేయమని శాసించారు. మీ శాసనప్రకారము, మీరు కూడా మీ మామగారికి ఒక అల్లుళ్లు కాబట్టి మిమ్మల్ని చంపివేయవలసి వుంటుంది." అని వీరబల్ చతురతతో అన్నాడు.

ఇది విన్న రాజు నిశ్చేష్టుడై పోయాడు. వీరబల్ తెలివితేటలకు సభలోనివారూ, రాజూ సంతోషించారు. రాజు వీరబల్ అల్లుణ్ణి విడచిపెట్టాడు. వీరబల్ తన అల్లునితో యింటికి పోయి సుఖంగా కాలం గడిపాడు.

"మాతృపూజ"

శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య.

ఉగ్గుపెట్టువేళ "నుంగా" యటంచు నే
నుమ్మివేయుచుండ నొక్క "చిటుక"
బుగ్గమీద వేసి "యుగ్గు" పెట్టినయట్టి
తల్లి బూజసేతు నెల్లవేళ.

పండుకొనగబెట్టి పాదాలపై నన్ను
వెన్నరాచి సున్నిపిండి రాచి
సోమితోమి యుష్ణతోయముల్ వోసిన
తల్లి బూజసేతు నెల్లవేళ.

ఉడుకునీళ్ళ వేడి కోడలు కందగ నేడ్వ
"నబ్బొ! నాదు బిడ్డ!" అనుచు తలంకి
చలువచేత నిన్ని చన్నీళ్లు కలిపిన
తల్లి బూజసేతు నెల్లవేళ.

'లేదు లే' దటంచు 'నేది! బా' బను
బాపి యేడ్పు రొంపకట్టకుండ [చును
ముక్కు, గుడ్డ దోపి ముమ్మారు తుడిచిన
తల్లి బూజసేతు నెల్లవేళ.

చుక్కబొట్టు పెట్టి 'దిక్కుమాలినదిష్టి
కొట్టునొక్క నాదుపట్టి' కనుచు
చొట్టబుగ్గమీద జుక్కబొట్టును బెట్టు
తల్లి బూజసేతు నెల్లవేళ.

త్రాప ముపశమింప ధూపమ్ము వేసి తా
బాల నిచ్చి మంచిపక్కయందు
లీల బండబెట్టి లాలిజోలలు పాడు
తల్లి బూజసేతు నెల్లవేళ.

బూచివాడ రార! బుట్ట లల్లుక రార!!
అనుచు భయముపెట్టి యంతలోన
నిద్రపుచ్చి నన్ను నీటికై యేగెడి
తల్లి బూజసేతు నెల్లవేళ.

సినీమాపుట:

సోవియట్ యూనియన్ పిక్చర్స్‌వారి అపూర్వ వర్ణచిత్ర కళాశోభ "పత్థర్ కా ఫూల్"

కాన్స్‌లో (ఫ్రాన్సు) ఈసంవత్సరం జరిగిన అంతర్జాతీయ చలనచిత్రప్రదర్శనోత్సవంలో వర్ణసంకలనకు ప్రథమబహుమతి పొందిన చిత్రం సోవియట్ యూనియన్ పిక్చర్స్‌వారి "స్టోన్ ఫ్లవర్." దీనినే హిందీలో డబ్ చేసి "పత్థర్ కా ఫూల్" అనే పేరుతో (అనగా రాతి పువ్వు) మనదేశంలో విడుదలచేశారు. ఇప్పుడిది చెన్నపట్నంలో చిత్రాటాకీస్‌లో ప్రదర్శించబడుతోంది. దీనితోబాటు "రష్యా యువజనోత్సవాల"నుకూడా ప్రదర్శిస్తున్నారు.

"పత్థర్ కా ఫూల్" చిత్రం ఆదినుంచీ తుదివరకూ అపూర్వమైన వర్ణసంకలనతో శోభిస్తున్నది. అసలు ఇంతవరకూ మనదేశంలో చూస్తున్న హాలీవుడ్‌రంగులసినీమాలకూ దీనికీ పోలికే లేదు. వర్ణసంకలనవిధానమే వేరు. ఫలితంలో కూడా చాలా వ్యత్యాసముంది. హాలీవుడ్ రంగుల సినీమాలలో రంగులు వేసే విధానాన్ని ఒకవిధంగా వర్ణవ్యవకలనమని చెప్పవచ్చును. ఈ రంగులకు మెరుపు మితిమీరి ఉంటుంది. దీనివల్ల వస్తువుల ఛాయలు అసహజంగా గోచరిస్తాయి. చిక్కని రంగులు, సున్నితమైన ఛాయలు, రేఖలు మెరుపు తరిగించిఇవ్వగల వాల్టు డిస్నీ చిత్రాలలోని దృశ్యాలుకూడా అసహజంగానే గోచరిస్తాయి. ఉష్ణమండలాలలో సూర్యోదయసూర్యాస్తమయాదిదృశ్యాలు, అడవులు, పుష్పాలు, పత్రాలు, నీరు మిగతా హాలీవుడ్‌చిత్రాలలోకంటె వాల్టు డిస్నీచిత్రాలలో మనోహరంగా ఉంటాయి. కాని సహజప్రకృతికి ఈఛాయలు, దృశ్యాలు భిన్నంగానే ఉంటాయి.

ఇదివరలో సెపియాటోన్‌చిత్రాలు కొన్ని హాలీవుడ్‌నుంచి వచ్చేవి. పల్చని కంకర బూడిద రంగు వచ్చిన ఈ చిత్రాలలో ఆకాశం, నీరు నేత్రాల ఛాయల్లో అసహజవర్ణాలు కానీ, ఉండరాని ఛాయలు కాని కనిపించకుండా వీలయేది. ఈనాటి హాలీవుడ్‌రంగుల చిత్రాలకంటె అవే చూడ్డానికి హాయిగా ఉండేవి. అంటే పూర్తిగా ఈ రంగుచిత్రాలు చెడుగా ఉంటాయని కాదు. పసిపాపల చిత్రవిచిత్రభావతరంగాల్ని, గీతాలలోని గానప్రసంతుల్ని విచిత్రరూపాల్లో నిరూపించడానికి యత్నించిన వాల్టు డిస్నీ కృషిఫలితాన్ని అనేకదేశాల్లో అనేకమంది చూసి ఆనందించారు. అయినప్పటికీ హాలీవుడ్‌రంగులచిత్రాలలో ఛాయలు బొత్తిగా అసహజంగా ఉంటాయనికూడా చెప్పాలి.

ఈ రష్యన్‌చిత్రంలో కళ్లను మిరుమిట్లు కొలిపే మెరుపు తళతళ లేవు. సున్నితమైన ఛాయలు నేత్రానందకరంగా ఉంటాయి. చిత్రం ఆరంభమైన కొద్దినిమిషాల్లో ప్రధానమైన సెపియాటోన్‌కు కళ్లు అలవాటుపడతాయి. అలా అలవాటుపడిన కళ్లకు చిత్రంలోని వివిధ ఛాయలు సహజంగా గోచరిస్తాయి. నీలిఆకాశం తెల్లమేఘాలు. నీటి తెలుపు, నీలాలు సహజంగా గోచరిస్తాయి. ఈ చిత్రంలో తెలుపు స్వచ్ఛంగా అనవసరమైన తళతళ లేకుండా కనిపిస్తుంది. హాలీవుడ్ రంగుచిత్రాలలో నీరు నీలంగానే ఉంటుంది. నీటిలో ఛాయలు చిక్కని నీలం పల్చనినీలం, అప్పుడప్పుడు ముదురు ఆకుపచ్చ, నలుపుకూడా వస్తాయి. నీటిలో ప్రతిఫలించే వస్తువులు నీలంగానే ఉంటాయి. కాని ఈ చిత్రంలో నీటిలో ప్రతిఫలించే వస్తువుల అసలు రంగులుకూడా ప్రతిఫలిస్తాయి.

ఈ చిత్రంలో మెరుపురంగులు, తళతళకూడా లేకపోలేదు. మహారణ్యం ఉషఃకాంతుల్లో స్వప్నంలోవలె మెత్తగా మెరుస్తూ వివిధవర్ణాలు విరజిమ్ముతుంది. స్ఫటికపు గుహల్లో రత్నాలు, వజ్రాలు, స్ఫటికఫలకాలు దృశ్యసీమ నంతనూ రంగురంగులతో ప్రకాశింపచేస్తాయి. కథలో ఘట్టాలనుబట్టి వివిధరసాలకనుగుణంగా రంగులు మార్చబడ్డాయి.

ఈ చిత్రంలో పేర్కొనవలసిన మరొక విషయమేమిటంటే, ప్రప్రథమంగా సినీమాల్లో ప్లాస్టిక్ వస్తుసామగ్రిని సెట్టింగ్స్‌ను ఉపయోగించనదీ చిత్రంలోనే.

ఈ వివరాలన్నిటికన్న ముఖ్యమైన విశేషమేమిటంటే ఈ చిత్రంలో వివిధదృశ్యాలు ప్రపంచవిఖ్యాతినందిన కళాకారుల వర్ణచిత్రలేఖనాలకు ఎందులోనూ తీసిపోవు. అక్కడక్కడ దృశ్యాలు ఇతఃపూర్వప్రమాణాలన్నిటినీ అధిగమించాయి. పెదవికదలికలలో కనుమలుపులలోకూడా వర్ణరేఖావిలాసం రసోద్భూతమయింది. రసావలంబనగా ఉపకరించిన ఈ చిత్రంలోని రంగులు ప్రయోజనాన్ని సార్థకపరుచుకున్నాయి. చాలావరకు హాలీవుడ్ చిత్రాలు రంగులులేకుండా మామూలు నలుపుతెలుపుఛాయల్లో ప్రదర్శించబడినప్పటికీ చిత్రాల ఆశయానికిగాని, చివరికి కథావస్తువుకిగాని ఎటువంటి లోపం ఉండదు. అసలు కొన్ని హాలీవుడ్ చిత్రాలకి రంగులు ప్రత్యేకప్రయోజనమేమీ లేకుండానే వేస్తున్నారు. ఈచిత్రంలో అలాకాదు. ఈవర్ణచ్ఛాయలు, రేఖలు కలిసి చిత్రాన్ని స్వప్నసీమగానూ, స్వప్నవృత్తాంతంగానూ మార్చి కథావస్తువు కొక ప్రత్యేకప్రయోజనాన్ని నెరవేరుస్తాయి.

ఈచిత్రాన్ని చూసి పండిట్ జవహర్లాల్ నెహ్రూ సెలులాయిడ్‌లో ఇదొక అపూర్వగేయం అని ప్రశంసించారు. రష్యాపిట్టకథల్లోని ఒక కథను తీసి ఇంద్రధనుస్సు రంగుల్లో రష్యన్లు తయారుచేసిన ఈచిత్రం నిజంగా అతిలోకరమ్యమైన కళాఖండమై ప్రకాశిస్తుంది.

——

గాంధీవాదము - సామ్యవాదము

(10-వ పేజీ తరువాయి)

విచారాల్లో పడి దొర్లిపోతుంటారు. విచారించేదానికి బదులు విచారాల్నే గుడ్డలమాదిరి కప్పుకోడానికి అలవాటుపడిపోయారు. యిలాంటి సమయంలో రెండు పక్షాల్లోని విచారాల్ని దగ్గరదగ్గరగా చేర్చి ప్రజల ఎదుట పెట్టాలి. నే గుర్తించి నంతవరకూ యిదే ఉద్దేశ్యముతోనే భిన్నభిన్న వ్యక్తులయొక్క విచారాలు యీ 'గాంధీవాదము - సామ్యవాదము' అనే శీర్షిక క్రింద ప్రకటించబడుతున్నాయి. ప్రకాశకులు కూడా నన్ను యీ సంగ్రహానికి సంపాదకులుగా నియమించారు. రచయితలనూ, రచనలనూ సమ్మతించుట ప్రకాశకుల పనేకాని నా పని కాదు. సంగ్రహము బాగానే జరిగింది. ప్రకాశకులకు అడిగినవారందరూ తమ సఖ్యత చూపించి వుండివుంటే యీ సంగ్రహముయొక్క ఉపయోగమెంతైనా వుండేది.

పైన చెప్పినట్లు కష్టించి విమర్శించజాలనివారందరూ నన్నే విమర్శించమంటే నే రెండు పక్షాల్నీ సమన్వయపరచి చూపిస్తా - లేదా కొంత తేడాతో న్యాయంవైపు మొగ్గినదానిని చేతిలో కందుకొని న్యాయాధీశునిమాదిరి నిర్ణయము వినిపిస్తా. కానీ ఆ విధంగా చేయాలనేది నా యిచ్ఛ కాదు. అలాంటినిర్ణయము జరిగినందువల్ల ఎవరి కేమాత్రమూ లాభముండదు. ఆఖరిసారిగా, గాంధీదార్శనికం, సామ్యవాద దార్శనికానికి మధ్య తప్పనిసరిగా సమన్వయపరచాలంటే పరచవచ్చుకానీ సమన్వయపరచే పని బుద్ధిది కాదు జీవితముదని జ్ఞాపక ముంచుకోండి.

సమన్వయపరచే విషయములో ఏఏపరతుల్ని పాటించాలో యోచించాలి. లెనిన్ 'అన్న' వురికంబాన ఎక్కేటప్పుడు ఆ, వధస్థలములోనే తీవ్రంగా యోచించే లెనిన్‌కు యీవిధమయినట్టి ఆతంకవాదముతో దేశోద్ధారము కాదని తోచింది. వైయక్తికఖూనీలు జరపడముతోనూ, ఆతంకాలు పుట్టించడముతోనూ కార్యమార్గం విఫలమవుతుందని లెనిన్ గుర్తించాడు. ప్రత్యక్షానుభవం పొందాడుకూడాను. ఆర్థికవిప్లవమే సమగ్రమైన చికిత్స అనుకొన్నాడు. అతని ఉపదేశాలు రష్యా అంతా ఏకగ్రీవంగా ఒప్పుకొన్నప్పుడే రష్యా విజయలక్ష్మియొక్క కృపాదృష్టిలో పడింది.

లెనిన్‌కు ఒక సామ్యవాదసాఫల్యం రష్యాలో సాక్షాత్కారమయింది. నాకల్పన ఏమిటంటే హిందుస్థానములోకూడా రానురాను సామ్యవాదసాఫల్యం రెండవసారిగా ప్రత్యక్షమవుతుందేమోనని. నాదృష్టి కేవలము భ్రమ కావచ్చు. కానీ నేను దాని స్పష్టచిహ్నాలు చూస్తున్నాను.

హిందుస్తానములో సామ్యవాదానికి అహింసాసాక్షాత్కారము క్రమక్రమంగా అవుతూవుంది. ఒకవేళ సామ్యవాదం అహింసాతత్వాన్ని అర్థంచేసుకుంటే గాంధీవాదముతో సమన్వయమవడానికి చాలామట్టుకు సిద్ధమే. హింసాభయంతో దుర్జనులు దుర్జనత్వం మానుకోలా, సజ్జనులు సజ్జనత్వం వదులుకోలేదని నేటి చరిత్రతో తేటతెల్లమవుతూవుంది. హింసతో సమానమైన అనివార్యవస్తువేదీ లేనేలేదు. హిందుస్థానమంతటి సమృద్ధదేశాన్ని శతాబ్దాలుగా లూటీచేసి యింగ్లాండు తయారుచేసిన ఫౌజును మన మెన్నినూర్ల సంవత్సరాలైనా తయారుచేయలేము. యింగ్లండుదగ్గర యింత ఫౌజు వుండీకూడా జర్మనీ, యిటలీ, ఎదుట కంపిస్తుండేది. విచారశీలవ్యక్తి ఎవడయినాసరే హిందూస్తానములో హింసామార్గముతో విజయము పొందడ మసాధ్యమని ఒప్పుకొంటాడు. మన దేశం హింసాధారంగానే వుంటే చీనా, స్పెయినుల గతి పట్టిఉండేది. లేదా సుందోపసుందుల వలె పరస్పరము నరికి చంపుకొని పాడయిపోయిఉండేది. అహింసను విశ్వసించని వారందరూ హింసను విశ్వసించి దాన్ని ఆధారంగా ఉంచుకోడానికి జంకుతున్నారు. ప్రపంచపరిస్థితే హిందుస్తానములోని సామవాదులకు అహింసా శిక్షణనిస్తూవుంది.

గాంధీజీ సత్యమనేపేరుతో వ్యవహరిస్తున్న సాధనమే సమన్వయముయొక్క రెండవ షరతు. చాలామందికి గాంధీజీయొక్క యీ పట్టుదల మీద విసుగు పుడుతుంది. సాధనశుద్ధిమీద విశ్వాసముంచేవారు గాంధీజీని సాధనశుద్ధికి వ్యతిరేకుడంటుంటారు. యీ సంపూర్ణ ప్రపంచములో ఒకే విధమయినట్టి సాధనముతో పని నెరవేరదు. తాత్కాలికఫలితం చాలు నంటే మంచీ, చెడ్డ సాధనాల్ని ఉపయోగించవలసివస్తుంది. అనైసర్గిక-ఆహారవ్యవహారముగలవారు జబ్బుతో పడితే నైసర్గికఉపచారాల్తో పనెట్లా గడుస్తుంది. ఒకేరోజులో జ్వరాన్నాపివేసి పరీక్షనైనా యివ్వదలచియో మరెచ్చటికయినా తొందర పని మీద వెళ్లడమో జరుగవలసివస్తే లంఘణచికిత్స ప్రారంభిస్తే లాభమేమిటి. అలాంటప్పుడు ఇరవై మోతాదులు క్వినయిను పుచ్చుకోవాలి. జ్వరము నుండి విముక్తి పొందిన తరువాత పాలూ, నిమ్మకాయలతో క్వినయిను యొక్క చెడ్డ ప్రభావాన్ని రానురాను తగ్గించుకోవాలి. త్వరితఫలసిద్ధి కావాలని కోరేవారికి సాధనశుద్ధిమీద పట్టుదల వుండకూడదు.

గాంధీవాద, సమాజవాదుల (సామ్యవాదుల) మధ్య జరిగే సంఘర్షణ బహుశా యీ సాధనాల విషయాన్నిగురించే వుంటుంది. ఈశ్వర లీలలు అన్నాసరే, ఇతిహాసలీలలన్నాసరే, మలిన సాధనాలతో మన హిందుస్థానము ముందుకు రాజాలదు. మన పాపం, శాపరూపాన్ని ధరించి మన ఎదుట నిలబడివున్నంతవరకూ మలినసాధనాలతో రాష్ట్రానికి లాభమవడానికిబదులు వినాశకపాపాలకే జయం చేకూరుతుంది. హరిజనులప్రశ్న, హిందుముస్లింసమస్య, సామాజిక ఉచ్చనీచభావాలు, యివన్నీ హిందుస్తానానికి పాతపాపాలు. వీరి పాపం హిందుస్తానాన్ని ముట్టడించివుంది. ఏమాత్రం మలినత్వం పొడచూపినా యీ దోష మందులో చేరి మరీ అన్యాయానికి దారితీస్తుంది. అంత్యదశలో సాధనశుద్ధియొక్క మహత్త్వం, రాష్ట్రం ఎదురుగుండా సిద్ధియై నిలబడుతుంది.

సామ్యవాది, అహింసా మరియు సాధనశుద్ధియొక్క దీక్ష పుచ్చుకొన్నప్పుడే ఏదోయొక రూపంలో సత్యాగ్రహముయొక్క దర్శన మయ్యేతీరుతుంది. నేటి సత్యాగ్రహములో బహుశా కొంచెం తేడా వుండవచ్చు. అయినా అందులో సామ్యవాదీ, గాంధీవాదీ యిద్దరూ సమ్మిళితమైపోతారు. వారి జీవితముద్వారా మనకు యీ రెంటినీ సమన్వయసిద్ధి కల్గించే మార్గము దొరుకుతుంది. కానీ నేడు మన మా సమన్వయముయొక్క ఆశ పెట్టుకోరాదు. అయినా యిద్దరి సమన్వయసంధే మన మపేక్షించునది. పై సాధనశుద్ధి అహింసయొక్క పునాదిమీద నిలబడినచో అప్పటిస్థితిలో ఏర్పడే సమన్వయము స్థాయిగానూ, కళ్యాణమయంగానూ వుంటుంది.

నా ఆలోచన ఏమిటంటే సామ్యవాదులంతా గుమిగూడి కాంగ్రెసులో చేరితే ఎంతో బాగుంటుంది. ప్రత్యక్షకార్యాల్లో రాజనీతికసంస్థల్లో కలిసిమెలసి వుండనివారి మాటల్ని ఎవరూ పాటించరు. యిందువల్ల తమ విచారాల ప్రచారంకోసం రాజనీతికసంస్థల్లో దూరిపోవడమే ముఖ్యమైన పని. సామ్యవాదుల కార్యక్రమం స్వరాజ్యప్రాప్తికి తరువాత కూడా పనికివచ్చేది. స్వరాజ్యప్రాప్తికి తరువాత కూడా పనికివచ్చేది. స్వరాజ్యప్రాప్తికి కాంగ్రెస్ శక్తిని అభివృద్ధి చేయడ విభిన్నపార్టీల్లో పనిజరిగడానికి ఐక్యతను స్థాపించడం యీ రెండే అన్నిటికంటే గొప్పకార్యాలు.

తప్పితే యిదే సంధి చాలారోజులవరకూ జరుగుతూవున్నా లేక యిరుపక్షాలూ ధైర్యంగా తమతమ కార్యం నెరవేర్చుపూనుకొంటే, ఇద్దరి ఆలోచనలూ, కార్యపద్ధతుల్లో చాలా పరివర్తన జరిగితీరుతుంది. సామ్యవాదులు గాంధీసిద్ధాంతాల ననుసరించి నడిచేటట్లుగా వుంటే కాంగ్రెసు, సామ్యవాదుల అధీనంలో వుండటానికి వెనదీయదు. నా ఆశ ఏమిటంటే ఇరుపక్షాలూ ఒకటి మరొకదానిద్వారా ఏదో కొంత నేర్చుకోవలసివుంది. అది నేర్చుకొంటే సంఘర్షణకు బదులు స్థాయీసమన్వయసిద్ధి చేకూరుతుంది.

——

ఠక్కరు బాపా

శ్రీ చోళ్లవిష్ణు



భారతమాతగర్భాన యెందరో మహాపురుషు లుద్భవించారు, ఉద్భవిస్తున్నారు. అందు మహాత్మా గాంధీ భారతదేశానికే కాదు ప్రపంచానికే మహోత్కృష్టమైనవాడు. ఆయనసమకాలికుల మవడ మెంతయు మన అహోభాగ్యము. ఆ యుగపురుషుడు తన తేజోబలంచేత యెందరెందరినో తన వశం చేసుకున్నాడు. భారతమాతముద్దుబిడ్డడు, రాజనీతివిశారదుడు అయిన పండిత నెహ్రూ ఆయన అడుగుజాడల్లో మెలగుతున్నాడు. దేశరత్నం రాజేంద్రబాబు ఆయన కనన్యభక్తుడయ్యాడు. లోకపురుషుడు పటేలు తన వకాలతను కాలదన్ని ఆ మహాపురుషుని చేరుకున్నాడు. అభినవచాణక్యుడయిన రాజాజీ కేవలం రాజకీయసంబంధంతో తృప్తి తీరక కాబోలు ఆ దివ్యపురుషునితో సంబంధమే యేర్పరచుకున్నాడు. ఇంకా అజాద్, గఫార్‌ఖాన్ మొదలయిన వారెందరో ఆ దివ్యపురుషునికి లోబడి ఆయన కనుయాయు లయారు. అట్టివారిలో ఒకరు మన కర్మయోగి శ్రీ ఠక్కరు బాపాగారు. వీరి పూర్తి పేరు "అమృతలాల్ విఠల్‌దాస్ ఠక్కర్" అయినా దేశప్రజలకు ప్రీతికరమైన పేరు "ఠక్కర్‌బాపా" యే.

శ్రీ ఠక్కరు బాపాగారు కాఠియావాడ్ (గుజరాత్) రాజ్యాంతర్గత "భావనగర్" అనే గ్రామంలో 1869 లో పుట్టారు. తన పదహారోయేట అదే గ్రామంలో హైస్కూలుపరీక్షలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులై, సర్ జసవంతసింగ్ స్కాలర్‌షిప్పుతో పూనా సివిల్ యింజనీరింగు కాలేజీలో చేరారు. 1890 లో అంతిమ పరీక్షపూర్తిచేసి L. C. E. డిగ్రీని సంపాదించారు. ఆ కాలంలో "లోహాణా" వంశంలో ఈడిగ్రీని ప్రథమంగా సంపాదించినవారు ఠక్కరుబాపాగారే. పిమ్మట తొమ్మిదేళ్లు యింజనీరింగుపని అతినిపుణతతో నిర్వర్తించారు. సాంగలీ స్టేటులోను, బొంబయి మున్సిపాలిటీలోను వారు చేసిన ఆదర్శకార్యాలు అందుకు నిదర్శనంగాక అలరారుతున్నాయి. పిమ్మట మూడేళ్లపాటు యుగాండా (దక్షిణాఫ్రికా) లో పెద్ద రైల్వే ఆఫీసరుగ పనిచేశారు. అక్కడ వారు సమృద్ధిగ సంపాదిస్తూ దానిలో అధికభాగం కరవు కాటకాదులతో బాధపడే పేదప్రజల నిమిత్తమే ఖర్చుచేస్తుండేవారు. లంచగొండితనానికి యింజనీరింగుడిపార్టుమెంటు సహజంగా చిరనివాసమే అయినా అది ఠక్కరుబాపాగారి చెంతకేనా — కాదు — వారి ఆఫీసు దరికే చేరలేకపోయింది. ఇందుచేతనే యీ విషయంలో ఠక్కరుబాపాగారంటే పై యధికారులు కూడా అదురుతుండేవారు. సత్యానికీ, నిజాయితీకీ జడవనివా రుంటారా మరి? ఇది శ్రీ ఠక్కరుబాపాగారి స్వభావంలో ముఖ్యవిశిష్టత. ఈ గుణం వీరిలో నానాటికీ వృద్ధిపొందుతూనే వస్తుంది.

1906 లో ఠక్కరుబాపాగారి ప్రథమ భార్య కాలంచేయడంచేత రెండేళ్లకు మరల వివాహం చేసుకున్నారు. కాని సార్వజనిక క్షేత్రంలో పరిష్కృవు కాబోయే శ్రీ ఠక్కరు బాపాగారిట్టి సంకుచితసాంసారిక క్షేత్రంలో చిక్కుకోడం ఆ విధికి వప్పందం కాలేదు కాబోలు వివాహం జరిగి రెండేళ్లేనా నిండకపూర్వమే ఆ రెండో సంబంధంకూడా తెగిపోయింది. అంతే, ఇక ఠక్కరుబాపాగారు ఆ చిన్నకుటుంబం విడిచి "వసుధైవ కుటుంబకమ్"లో చేరిపోయారు. నాటినుంచి ఒక్క గుజరాతుప్రాంతమే కాదు సేతునగపర్యంతం గల భారతదేశమే ఆయన కొక కుటుంబం, ఆ భారతవాసులే ఆయనపరివారం అయిపోయారు. అందు ముఖ్యంగా సామాజిక వెలినననుభవిస్తుండే హరిజనులు, సభ్యలోకానికి దూరంగా — అతిదూరంగావుండే ఆదిమవాసులు ఆయన కభిమానపుత్రు లయారు. ఆ నిరుద్ధభారతీయుల ఉద్ధరణే తన పరమలక్ష్యంగ నిడుకొని నిరంతరాయముగ అవిరామకృషి చేస్తున్నారు శ్రీ ఠక్కరుబాపాగారు.

సాంగలీస్టేటులోను, బంబయి మునిసిపాలిటీలోనూ, యుగండాలోను గడపిన తన ఉద్యోగకాలంలో అక్కడి పేదప్రజల దురవస్థలు, ముఖ్యంగ యుగండాలో వేలకొలది పొట్టకూటికై పడుగాపులుపడికూర్చున్న కటిక పేదల దీనావస్థ బాపాగారి వెన్నపూసలాటి మనస్సును కరిగించివేశాయి. యీలాంటి పేదలకు సహాయపడడమే మానవమాత్రునికనీస ధర్మమనే సేవాబీజాలనుకూడా ఆదయార్ద్రహృదయంలో నాటినవీ అవే, దేశ పరిస్థితులుకూడా వారి కనుకూలంగ తోడ్పడినాయి. పతితులు, దుఃఖపీడితుల నుద్ధరించడమే తన పరమావధిగ గల "భారతసేవకసమితి" ఆ దినాల్లో స్వర్గీయ శ్రీ గోఖలేగారి అధ్వర్యంక్రిందనుంచి తీవ్రంగ పనిచేస్తుంది దేశంలో. ఆసమితి ఆదర్శకార్యపద్ధతులు శ్రీ ఠక్కరుబాపాగారి వుద్దేశాలకు సన్నిహితంగ అవుపించేయి. అంతకు పూర్వమే పరోపకార బీజాంకురమైన వారి మనస్సు సహజంగ ఆసమితివేపుకు మొగ్గసాగింది. కాని తండ్రిగారి అనుమతి లేకపోవడంవల్ల అందు చేరలేకపోయారు. తన ఆ శుభసంకల్పాన్ని మాత్రం లోలోపలే వృద్ధిపరచుకుంటూవున్నారు. శ్రీఠక్కరు బాపాగారు, కడకు 1914 లో తండ్రిగారి మరణానంతరం వారి కోరిక సిద్ధించింది. ఆ జీవనసదస్యులు గచేరిపోయారా భారతసేవకసమితిలో. అప్పటికి సుమారు 45 వ యేడు నడుస్తుండవచ్చును. నాటినుంచి బాపాగారి జీవితంలో ఒక నూతనాధ్యాయం ఆరంభమయింది. యింత దృఢమైన యీ శుభసంకల్పం బాపాగారిలో వకరి వత్తిడివల్ల కలిగింది కాదనీ, కేవలం అంతరాత్మప్రేరేపణవల్లనే కలిగిందనీ వారు తనతోడి కార్యకర్తలకు వ్రాసిన ఒక జాబులోని యీ వాక్యాలు తెలుపుతున్నాయి. "యీ విషయంలోనే నెవరితోనూ సలహా తీసుకోలేదు. నా యంతరాత్మప్రేరేపణ చేతనే యీలా చేశాను. ఒకవేళ నా యంతరాత్మే తప్పుచేసి వుంటే నేనూ తప్పుచేసినవాణ్ణే అవుతాను. లేకుంటే లేదు. యేమేనా కానీయండి నా అంతరాత్మ పిలుపును త్రోసివేయలేను."

బాపాగారి సంకల్పమెంత దృఢమైనదో వారి మన సంత కోమలం, వారి హృదయమంత దయార్ద్రమూ అయింది. చూడండి అదే జాబులోని మరి రెండు వాక్యాలు—"నా చేతిక్రింద నాకు సహాయంగ పనిచేసిన ప్రతికార్యకర్తను యెంతో ప్రేమించాను. కేవలం వారినే కాదు నా చార్జిలో వున్న నిర్జీవమార్గాల్ని కూడా ప్రేమించడం నేర్చుకొన్నాను. నేడు వారి వియోగం నా స్వజనులవియోగంకంటె అధిక దుఃఖం కలిగిస్తుంది." నిత్యము తనయెడల భక్తిశ్రద్ధలతో ప్రవర్తించే వందలాది బొంబయి కార్పొరేషను కార్యకర్తలను యింత నిర్దయగ విడవడం బాపాగారి ఆ మెత్తని మనస్సుకు నొప్పి కలిగించింది. కాని యింతకంటె గురుతరం, సంపూర్ణభారతదేశపు సేవ చేయాలనే ఆ దృఢసంకల్పానికి ఆ కోమల హృదయపు భావుకత లొంగిపోయింది. ఆ దృఢసంకల్పుడు అంత ఒక మహాసేవకుడు గాదలచుకున్నాడు. ఆ దుర్గమమార్గం—సేవాపథం—తొక్కాడు.

అదే జాబులోని మరికొన్ని వాక్యాలు ఆయన దూరదృష్టికి నిదర్శనంగావున్నయి చూడండి: భారతదేశసేవకొరకు ఆజీవిత సేవాసంకల్పులెందరో కావాలి. లేనియెడల నిజమైన దేశోన్నతి కాజాలదు. నిజమైన సేవకులకు ధనాభావం వుండదు. శ్రీ గోఖలేగారు లక్షలాదిధనం సంపాదించగలరుగాని సచ్చీలపరాయణులైన సేవకుల్ని సంపాదించలేరని నా దృఢనమ్మకం." శ్రీ ఠక్కరుబాపాగారి యీవాక్యాల్లో కించిత్ గర్వోక్తి ధ్వనించవచ్చు. కొందరు విమర్శకులకు కాని కాస్త సూక్ష్మంగ ఆలోచించినమీదట నిజమైన దేశసేవకునికి కావలసిన సంకల్పదృఢత్వం, ఆత్మవిశ్వాసం, గురుతరఆదర్శం, సత్యం యివేనని తెలియకపోదు.

శ్రీ విఠల్‌దాస్ ఠక్కర్, డి. కే. కార్వే, దాదా దేవధర్ ఈముగ్గురువ్యక్తులూ ఆకాలంలో గుజరాతులో మంచి ఆరితేరిన సమాజ సేవకులు, సంఘసంస్కర్తలూను. ఈ ముగ్గురి సంపర్కమే శ్రీ బాపాగారి సేవాసంకల్పానికి ప్రేరణ అయింది. అందు ముఖ్యంగా తన తండ్రిగారైన విఠల్‌దాస్ ఠక్కరుగారి సహజ సేవాప్రవృత్తి బాపాగారి కలవడింది. తల్లిదండ్రుల గుణాలు తమ సంతానంలో ప్రతిబింబించుట సహజమే గదా!

"భారత సేవకసమితి" సదస్యులు కావడంతోనే తన చిరకాలకోరిక — జనతాజనార్దనుని సేవ చేయాలనే కోరిక — తీరిపోయింది. సేవ చేయువారే కావాలిగాని సేవాకార్యావసరాలకేమీ కొదవ లేదు మన దురదృష్ట భారత దేశంలో. లేడికి లేచిందే పరుగన్నట్లు బాపాగారికి కావలసినంత సేవామైదానం దొరికింది. సంయుక్తప్రాంతంలో కరవుపీడితు లొకవంక, బంబయి నగరంలో బంగీలు మరోవైపున, పంచమహల్‌లో ఆదివాసులు, అహమదాబాదులో మిల్లుకూలీలు, ఒక టేమిటి అనేకప్రాంతాలలో అనేక రకాల పీడితప్రజలు అవుపించారు. ఆపత్త్రాణపరాయణుడి కింతకంటే కావలసిందేముంది! బాపాగారన్నిచోట్లకు వెళ్లి ఆదుకున్నారు. శక్తివంచనలేకండా వారి వారి దుఃఖనివారణ చేశారు. అహమదాబాదులో మిల్లుపనివారలసంఘం, బంబయినగరంలో బంగీల సంఘటన, జమ్‌షెడ్‌పూర్‌లో సహకారకూలీలసంఘం, అస్సాంలో అబోర్జినల్‌సంఘం ఆదిగాగల వెన్నో, బాపాగారి సేవాకార్యానికి సాకార కేంద్రాలు ప్రామాణికంగా వున్నాయి. ఈలోపల గుజరాతుప్రాంతంలో అనివార్యవిద్యాప్రణాళికను అమలుపరచడంలో దానికి కావలసిన అంకెలూ అవీ సిద్ధపరచి స్వర్గీయవిఠల్‌బాయ్ పటేల్‌గార్కి తోడ్పడ్డారు. ఇదే సందర్భంలో మరో నూతన కార్యక్షేత్రం కనిపెట్టారు శ్రీ బాపాగారు.

1922 లో పంచమహల్‌లో పర్యటనం చేస్తూ చేస్తూ ఒక చిన్నగ్రామంలో ప్రవేశించారు. వీరిని చూడడంతోనే యేదో వింత మృగం వచ్చిందని పారిపోసాగేరు గ్రామస్థులంతాను. నిత్యమూ అడవిలో తిరుగుతూ అడవి మృగాల్ని కుక్కలతో సమానంగా చూచేవారికి సభ్యవ్యక్తి ఆ మృగాల్ని మించిన మృగంలా కన్పించాడా అని ఆశ్చర్యం కలగొచ్చు పాఠకులకు. నిజమే. కాని హిమాలయపర్వత ప్రాంతాల్లో కోల్టాజాతిని, బిహారులో సంథాల్ జాతిని, పంచమహల్‌లోనూ, రాజపుటానాలో డూంగర్‌పుర్ స్టేటులో వుండే భిల్లుల్ని, అస్సాం అడవిజాతుల్ని చూచినవారికి ఈ ఘటన ఆశ్చర్యం కలిగించదు. సహజమే అనిపిస్తుంది. అదొక అడవిపల్లెయని, వారు అడవిజాతి భిల్లులని తెలుసుకునేసరికి యింకా లోపల ప్రవేశించి పరిస్థితిని పరీక్షించాలనే జిజ్ఞాస పుట్టింది బాపాగార్కి. ఆ జిజ్ఞాసతోనే మరికొన్ని గ్రామాలు తిరిగారా అడవిప్రాంతంలో. సభ్య మానవుల్ని మృగతుల్యులుగ చూచి భయపడేవారి అజ్ఞానం, తిన తిండి పండ పక్క లేనివారి దుర్దశ, కట్ట బట్టలేక అడవికట్టెల అగ్గిసెగతో కొంతసేపు పీపు, మరికొంతసేపు కడుపు కాచుకుంటూ రాత్రిళ్లు గడిపేవారి దైన్యస్థితి బాపాగారి హృదయాన్ని కరగించివైచె. కోట్లాదిగ వుండే యిట్టి తోడి దేశీయులకు విద్యాసంస్కారంచేసి, వృత్తివిద్యలు నేర్పి సహజమానవుల్ని చేయాలనీ, ఆదిదేశోన్నతికెంతో అవసరమన తలచి వారి ఉన్నతికై పని చేయ సంకల్పించుకున్నారానాడు. నాటినుంచి నేటివరకు అవిరామంగా ఆ ఆదివాసుల సేవ చేస్తున్నారు శ్రీ ఠక్కరు బాపాగారు. భీల్ సేవా మండల్ (గుజరాత్), గోండ్ సేవా మండల్ (గోండ్వానా), అశోకాశ్రమం (జోక్‌సార్‌బాబర్), ఠక్కర్‌భీల్ సేవాశ్రమం (రాంచీ), ట్రైబల్ సేవాసంఘం (అస్సాం) ఆది యెన్నోవున్నాయి శ్రీ బాపాగారి సఫల సేవాకేంద్రాలు. లక్ష్మీనారాయణ శ్రీకాంత, ఫాదర్‌ఎల్విన్, శ్రీధర్మదేవశాస్త్రి, శ్రీ లక్ష్మీనారాయణదాస్, బి. కే. భండారి. జి. లక్ష్మీనారాయణరావు L. N. సాహు మొదలైనవారెందరో వారి దీక్షితశిష్యులూను.

మహాత్మాగాంధిగార్ని శ్రీ ఠక్కరు బాపాగారు సేవా మార్గంలో గురుతుల్యులుగ తలవరు. కాని వారి సంపర్కం వీరి మూకసేవకు మెరుగునిచ్చిం దనక తప్పదు. గాంధిగారొక సూక్ష్మగ్రాహి అతి సూక్ష్మగ్రాహి. ఆవులింతలో పేగులు లెక్కించే నిపుణుడు. అందుచేతనే శ్రీ బాపాగారి సేవాకార్యం చూచేసరికే ఆయనొకనిస్స్వార్థ, నిరాడంబరసేవకుడని గ్రహించగలిగాడు. సేవామార్గంలో యిద్దరికీ మంచి సామ్యం చేకూరింది. ఆ యిద్దర్నిపోల్చి చూచినచో క్రియాత్మకరూపంగా బాపాగారిదే కాస్త పైచేయి అవుతుంది. ఇంతే తేడా వారి కిరువురికీని. వయస్సులోను, సేవాకార్యంలోను తనకంటె కాస్త పెద్దయినా శ్రీ ఠక్కరు బాపాగారి మూకసేవకు గాంధిగారు స్వయంగ ఒక యితివృత్తం కల్పించి, దాని కొక ప్రబలప్రామాణికత యిచ్చాడు. ఇంతేకాదు గొప్పబాధ్యత ఆయనమీద పెట్టారు. గాంధిగారు తన అనేక రూపాల్లో ఒకటైన హరిజనసమస్యను పూర్తిగ బాపాగారిమీద వదిలేశారు. బాపాగారు స్వయంగ సంపాదించుకున్న ఆదివాసుల సమస్య గాంధిగారప్పగించిన హరిజనసమస్య యివి రెండూ ఆయన కభిమానవిషయాలయిపోయినై. ఈ రెండు జాతుల ఉద్ధరణకొరకు వారిలో పనిచేస్తూ చేస్తూ వారికి పితృతుల్యుడయాడు. హరిజనాభివృద్ధిని కోరే అఖిలభారత హరిజనసేవకసంఘం ఆయన అధ్వర్యంలోనే పనిచేస్తుంది.

శ్రీ ఠక్కరు బాపాగారు నిజంగా కాకతీరిన కర్మయోగి. రాత్రి పగలు పని, పని. పని తర్వాతనే ఆయనకు సర్వస్వమూను. అందులోనే ఆయనకు ఆనందం, విశ్రాంతి కలుగుతాయి. ఎనబయో పడిలో కూడా దినానికి సుమారు 15 గంటలు పనిచేయడానికి అలికిడి చెందరు. నవయువకు లెందరో మారుతారుగాని ఆ వృద్ధయువకుడుమాత్రం ఆసనంమారకండా పనిచేస్తారు. 80 యేండ్ల వయోభారం ఆయన్ని అసమర్థుణ్ణి చేయలేకపోయింది. వయోభారంచేత వంగి, ముగ్గిన ఆ శరీరం చూచి "బాపా కొంతకాలం విశ్రాంతి తీసుకొంటే బాగుంటుంద"న్నారొకపారి బాపు, బిర్లాగారూను. "చేయవలసిన పనెంతో పడివుండగ విశ్రాం తెలా తీసుకునేది? నన్ను పనిచేయనివ్వండి. పనే నాకు విశ్రాంతి నిస్తుంది." అని వెంటనే జవాబిచ్చారు బాపాగారు. దేశరత్నం రాజేంద్రబాబుగారన్నట్టు సేవార్పితమైన సఫలజీవితం

(20-వ పేజీ చూడుడు)

నేటిప్రపంచం:

ఇటాలియన్ వలసల భవిష్యన్నిర్ణయం: లిబియాకు స్వాతంత్ర్యం:

ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి సాధించిన దల్లా ఒక్కటే కార్యం. ఆఫ్రికాలోని ఇటాలియన్ వలసల భవిష్యత్తునుగురించి తుది నిర్ణయాలకు రాగలిగింది.

ఇటలీతో మిత్రరాజ్యాలు శాంతిఒడంబడిక చేసుకోడానికి జరిగిన యత్నాలలో ఇటాలియన్ వలసల భవిష్యత్తుపై సమాధానం కుదరలేదు. మూడేళ్ళ క్రిందట పారిస్‌లో విఫలమైన శాంతి సమావేశం ఈ వలసల భవిష్యత్తును నిర్ణయించే బాధ్యతను ఐక్యరాజ్యసమితికి ఒప్పగించింది. ఆ పారిస్ సమావేశంలో బ్రిటిష్ ఫ్రెంచి ప్రభుత్వాలు ఇటాలియన్ వలసల్ని తిరిగి ఇటలీకే ఒప్పగించడానికి యత్నించాయి. యుద్ధంలో శత్రుపక్షంలో చేరి మిత్రరాజ్యాలపై కత్తిగట్టినప్పటికీ బ్రిటన్ ఫ్రాన్సులు ఆఫ్రికాలోని ఇటాలియన్ సామ్రాజ్యాన్ని తిరిగి ఇటలీకి ఒప్పగించడానికి యత్నించాయి. ధర్మకర్తృత్వం నిర్వహించడానికైనా ఇటలీకి ఆర్థికబలం లేదు. దురుద్దేశంతోనే బ్రిటన్ ఫ్రాన్సులు ఈరీతిగా కుట్ర పన్నినట్లు సులువుగా గ్రహించగలిగే యథార్థమే. కాని పారిస్‌లో వీరి తంత్రం కొనసాగలేదు.

ఐక్యరాజ్యసమితిలో ఈ సంవత్సరం పారిస్ సమావేశంలో ఇటాలియన్ వలసలపై చర్చ వచ్చినప్పుడు ఇటాలియన్ విదేశాంగమంత్రి కౌంట్ కార్లో స్ఫోర్జాతో కలిసి బ్రిటిష్ విదేశాంగమంత్రి బెవిన్ మరొక తంత్రం పన్నాడు. లిబియాను విభజించి సిరనైకాకు స్వాతంత్ర్యం ఇవ్వగలరని బ్రిటన్ ప్రతిపాదించింది. దీనితోబాటు ట్రిపోలిటానియాలోనూ, సోమాలీలాండ్‌లోనూ ఇటలీకి ధర్మకర్తృత్వాధికారమిచ్చి, ఫెజ్జన్‌పై ఫ్రెంచివారికి ధర్మకర్తృత్వాధికారమివ్వాలని బెవిన్ ప్రతిపాదించాడు. దీనివలన లిబియా శాశ్వతంగా భిన్నమైపోయేదే. కాని ఈతంత్రంకూడా కొనసాగలేదు.

మొదట లిబియానూ, సోమాలీలాండునూ రష్యా ధర్మకర్తృత్వాధికారాని కొప్పగించాలని తూర్పుయూరోపియన్ దేశాలు ప్రతిపాదించాయి. కాని ఈ ప్రతిపాదనకు మిగతాదేశాలన్నీ ప్రతిఘటించి ఓడించాయి. ఈఓటమి అనంతరం ఇటాలియన్ వలసలన్నిటినీ ఐక్యరాజ్యసమితిధర్మకర్తృత్వాని కొప్పగించాలని రష్యా ప్రతిపాదించింది. భారతదేశం ఈ ప్రతిపాదనను బలపరిచింది. లిబియా, సోమాలీలాండ్, ఇరిట్రియాలు మూడింటికీ స్వాతంత్ర్యం ఇవ్వడానికి వీలుకానిపక్షంలో ఐక్యరాజ్యసమితిధర్మకర్తృత్వాని కొప్పగించాలనే ప్రతిపాదనను భారతదేశం బలపరిచింది. ఐక్యరాజ్యసమితి కింతటి గురుతరమైన భారాన్ని ఒప్పగించడం కూడదని అమెరికా బ్రిటన్‌లు వాదించాయి. కాని సమితికే ధర్మకర్తృత్వాన్ని ఒప్పగించినట్లయితే రష్యాకు కూడా ప్రవేశం కలుగుతుందని ఈ దేశాల భయం. కాని పరిపాలనానిర్వహణకు సమితి వెనుదియ్యనక్కరలేదని వాదిస్తూ భారతదేశ ప్రతినిధి సర్ బి. యన్. రావుగారు సమితి ఏరీతిగా నిర్వహించాలో సంగ్రహంగా రాజ్యాంగవిధానాన్ని వివరిస్తూ ఒక పత్రం కూడా తయారుచేశారు. కాని ఆంగ్లో-అమెరికన్ దేశాల ప్రతిఘటనవల్ల ఈ ప్రతిపాదన కూడా వీగిపోయింది. ఆపైన వలసలన్నిటికీ వెంటనే స్వాతంత్ర్యం ఇవ్వాలని రష్యా ప్రతిపాదించింది. కాని అదివరకే సమితిచే నియమించబడిన ఒక విచారణసంఘం వలసప్రాంతాలలో పరిస్థితులను పరిశీలించి, ఆప్రాంతాలకు వెంటనే సంపూర్ణస్వాతంత్ర్యం ఇవ్వడంవల్ల ప్రయోజనం లేదనీ, అక్కడి రాజకీయచైతన్యం స్వాతంత్ర్యవ్యవస్థకు అనుగుణం కాదనీ తీర్మానం చేసింది. ఇదిగాక స్వాతంత్ర్యం ఇచ్చినట్లయితే ఆరబ్ జాతీయబలం అనేకరెట్లు పెరిగిపోతుందని అమెరికా, రష్యా, ఫ్రాన్సులు భయపడినాయి. అరబ్బీజాతుల బలం వృద్ధి అయినట్లయితే ఆఫ్రికాఖండంలో యూరోపియన్ల అధికారానికి ముప్పు తప్పదని వారికి తెలుసును. అందువల్లనే వారు స్వాతంత్ర్యప్రదానానికి అంగీకరించలేదు.

తరువాత బెవిన్ - స్ఫోర్జా ప్రతిపాదనలు నిరాకరించబడినాయి. సిరనైకాను ట్రిపోలిటానియాను విడగొట్టి, సిరనైకాకు స్వాతంత్ర్యం ఇవ్వడానికీ, ట్రిపోలిటానియాను ఇటలీధర్మకర్తృత్వాని కొప్పగించడానికీ, ఫెజ్జన్‌ను ఫ్రెంచిధర్మకర్తృత్వాని కొప్పగించడానికీ ఐక్యరాజ్యసమితి నిరాకరించింది. ఈ ప్రతిపాదనపై ఐక్యరాజ్యసమితిలో వోటింగు జరిగినప్పుడు భారతదేశంఓటు ఒక్కటే ప్రతిపాదనను ఓడించింది. దీనికి ఉత్తరాఫ్రికావాసులు భారతదేశంపట్ల కృతజ్ఞతాభావం ప్రకటించారు.

ఈమారుసమావేశంలో ఇటాలియన్ వలసలపై తిరిగి చర్చ జరిగినప్పుడు, లిబియాను పూర్తిగా విడిచిపెట్టి, సమితిసభ్యులను మభ్యపుచ్చి తూర్పుఆఫ్రికాలో తిరిగి తమ ఆధిపత్యం స్థాపించుకోడానికి ఇటలీ యత్నించింది. ఈ యత్నంలో చాలవరకు ఫలించిందనే చెయ్యాలి. ఇరిట్రియాకు కూడా స్వాతంత్ర్యం ఇవ్వడానికి ఇటలీ సంసిద్ధత కనపర్చింది. లిబియాకు స్వాతంత్ర్యం ఇవ్వడానికి సమితి అంగీకరించింది. ఇరిట్రియా భవిష్యత్తునుగురించిన నిర్ణయంమాత్రం ఒక సంవత్సరం వాయిదా వెయ్యబడింది.

ఇరిట్రియాలోని కొన్ని జిల్లాలు తనకు చెందాలని ఎథియోపియా (అబిసీనియా) పట్టుబట్టింది. ఆ జిల్లాలను ఫెడరల్ రాజ్యాంగ సూత్రాలప్రకారం ఎథియోపియాలో చేర్చి, స్వయంనిర్ణయాధికారాన్నివ్వాలని భారతదేశం ప్రతిపాదించింది.

కాని ఇరిట్రియాలో పరిస్థితులను పరిశీలించి, తరువాతనే నిర్ణయం చెయ్యాలని సమితి తీర్మానించింది. పరిశీలననిమిత్తం అయిదు దేశాల ప్రతినిధులను చేర్చిన ఒక కమిషన్ నియమించబడుతుంది. ఈ కమిషన్ నివేదికను వచ్చే సంవత్సరం సమితికి అందచెయ్యాలి.

సోమాలీలాండ్‌ను మాత్రం ఇటలీధర్మకర్తృత్వాధికారాని కొప్పగించారు. పూర్తిగా వారి అధికారాని కివ్వడం ఇష్టంలేక భారతదేశం ఒక సవరణను ప్రతిపాదించింది. సోమాలీలాండ్ రాజ్యాంగనిర్వహణలో అయిదు అన్యదేశాల ప్రతినిధులను చేర్చి నిర్మించే సలహాసంఘం ఆమోదానికి ఇటలీ అంగీకరించాలి. రాజ్యాంగ నిర్మాణవిధు లేరీతిగా ఉండాలోకూడా వివరాలను భారతదేశప్రతినిధి సర్. బి. యన్. రావుగారు ప్రతిపాదించారు. భారతదేశ సవరణ ఆమోదించబడింది. కాని ఈరీతిగా ఎంతజాగ్రత్త వహించినప్పటికీ నిష్ప్రయోజనమే నని ఎథియోపియా అసమ్మతిని ప్రకటించింది. ఇప్పటికి ఇటాలియన్ సామ్రాజ్యవాదుల దురాక్రమణకు మూడుపర్యాయాలు గురైన ఎథియోపియా సోమాలీలాండ్‌లో ఇటాలియన్ పునస్థాపనవల్ల ప్రమాదం తిరిగి సంభవించగలదని హెచ్చరించింది. ఇప్పటికే సోమాలీలాండ్‌లో తమ అధికారాన్ని రెట్టింపు బలంతో పునస్థాపించుకోడానికి ఇటలీ ప్రయత్నిస్తున్నదనీ, ఈకార్యంకోసమే ఇటలీ బలవత్తరమైన విమానదళాన్నీ, సైనికదళాన్నీ నిర్మిస్తున్నదనీ రష్యా హెచ్చరిస్తోంది. ఎథియోపియా హెచ్చరికలు సమితి సభ్యుల చెవి కెక్కలేదు.

ఇటలీతో ఐక్యరాజ్యసమితి ఇంకా సోమాలీలాండ్‌పై ధర్మకర్తృత్వాధికారాన్ని నిర్వచిస్తూ ఒడంబడిక చేసుకోవలసిఉంది. ఈ ఒడంబడికలో కొన్ని షరతులు విధించాలని ఎథియోపియా కోరవచ్చును.

ఎథియోపియాకోరికను మన్నించడం న్యాయం. కాని ఆంగ్లో-అమెరికన్ వర్గాలు దీనికి సమ్మతించే ధోరణిలో లేవు. సోమాలీలాండ్‌లో తిరిగి ఇటలీప్రాబల్యం వ్యాపించడం తథ్యమయింది.

లిబియాకు స్వాతంత్ర్యం లభించినందుకు భారతదేశానికి కృతజ్ఞత ప్రకటించింది. ఈ నిర్ణయంవల్ల ట్రిపోలిటానియా, సిరనైకా, ఫెజ్జన్‌లమధ్య ఐక్యతకు అవకాశం ఏర్పడింది. కాని పశ్చిమ ఆసియాలో అరబ్బీదేశాలమధ్య వైషమ్యాలు సృష్టించగలిగిన ఆంగ్లో-ఫ్రెంచి ప్రభావం ఇక్కడకూడా తంత్రాలు పన్ని తీరుతుంది. అరబ్‌లీగ్ బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ తంత్రాల కెదురై నిలవలేకపోయింది. పాలస్తీనా విభజన సందర్భంలోనే అరబ్‌రాజ్యాల మధ్య మైత్రిసహకారాలు చేకూరలేదు. కొత్తగా లభ్యమైన స్వాతంత్ర్యాన్ని ఉత్త

(21 వ పేజీ చూడుడు)



థేమ్సునదీతీరాన నిర్మింపబడుతున్న ఈ శాశ్వత ప్రదర్శనశాలకు బ్రిటిష్ ప్రధాని అట్లీ శంకుస్థాపన చేస్తున్నారు.
1951 బ్రిటిష్ జాతీయమహోత్సవాలనాటికి పూర్తిచేస్తారు.

థక్కర్ బాపా

(19-వ పేజీ తరువాయి)


బాపాగారిది. యింతకూ బాపాగారు తన పనికి ప్రచారం, తనకు పొగడ్త వొప్పుకోరు. చిత్రమేమంటే వారి వృద్ధాప్యంతోపాటు వారి కార్యక్షేత్రం విశాలమవుతుంది. కార్యక్షేత్రంతోపాటు కార్యశక్తి యినుమడిస్తుంది. "స్వరాజ్యంవచ్చాక నేను పడుచువాణ్ణవుతున్నా"నని ఈమధ్య ఒక మిత్రుని జాబులో వ్రాశారు బాపాగారు. అదెంతయు నిజం. ఈ వార్ధక్యంలో ఆయనబాధ్యతలు ఆశ్చర్యం కలిగిస్తాయి చూడండి:—హరిజన సమస్య, ఆదివాసుల సమస్య, కస్తూరిబానిధి, గాంధిస్మారకనిధి, సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీ, శరణార్థుల సమస్య, తాజాతాజాగా లభించిన ప్రజాపరిషత్తు మెంబరుషిప్పు, ఇందుకే "థక్కరు బాపాగారు స్వయంగ ఒక సంస్థ. వారిలా అవాలని ఎంతో కోరుకుంటున్నానని" అన్నారొకసారి బాపూజీ.

శ్రీథక్కరు బాపాగారిలో ఒక నిజమైన జనసేవకునికి కావలసినని స్వార్థరహిత, నిరాడంబరత, దృఢమైన ఆత్మవిశ్వాసం, ఒక నాయకునికి కావలసిన దూరదృష్టి, సాధకునికి కావలసిన యేక నిష్ఠ వీటన్నిటినీ మించిన కర్తవ్య పరాయణత అన్నీ యేకరూపం దాల్చి పని చేస్తున్నాయి. వీటి క్రోడీకరింపే బాపాగార్నొక కర్మయోగిని చేసి, మహాపురుషుల శ్రేణిలో చేర్చినై. వారినొక కర్మయోగిగ, ఒక మహాపురుషునిగ భారతీయప్రజానీకం పదేండ్ల క్రిందట, వారి డెబ్బయ్యో జన్మదినోత్సవం చేసి ఆశాతీతమైన తన ఉత్సాహాన్ని వెల్లడించింది. ఇప్పుడు మరల ఆయన యెనబయ్యో జన్మదినోత్సవం జరపబోతోంది. ఈ సారి సామాన్య ప్రజలేకాక మన భాగ్యవిధాతలైన శ్రీపండిత నెహ్రూ, పటేలు, రాజేంద్రబాబు ఆది మన నాయకశ్రేష్ఠులే స్వయంగ పూనుకోడం, వారికొక సమ్మానగ్రంథం సమర్పించబోవడం, బాపాగారి సేవాకార్యానికి, వారొక కర్మయోగి,మహాపురుషు డనడానికి ప్రబల ప్రమాణం.

శ్రీథక్కరు బాపాగారికి ఈ నెల 29 వ తేదీతో ఎనభైయేండ్లు నిండుతునై.

బాపాగారు చిరజీవియగు గాక!

—



అమెరికాపర్యటన ముగించుకొని భారతదేశం తిరిగివచ్చిన నెహ్రూ ప్రధానికి ఢిల్లీప్రజలు స్వాగతమిచ్చారు.
ఆ సమావేశంలో ప్రసంగించుచున్న నెహ్రూ. రాష్ట్రపతి పట్టాభి చేరువను కూర్చునివున్నారు

నేటి ప్రపంచం:

రాఫ్రికా సంరక్షించుకోడానికి అత్యంత జాగ్రత్త వహించవలసిన అగత్యం ఉంటుంది.

ఇటాలియన్ ఆఫ్రికావలసల భవిష్యన్నిర్ణయంలో ఐక్యరాజ్యసమితిలో ఆసియాదేశాలన్నీ చేరి ఒకవర్గంగా నిలిచాయనీ, ఈవిధమైన "కూటనీతి" గర్హనీయమనీ ఒక బ్రిటిష్ ప్రతినిధి అన్నాడు. కాని ఈ "కూటనీతిని" బ్రిటిష్‌ప్రభుత్వం ఎన్నివిధాల ఎన్నివిషయాలలో ప్రయోగించిందో అందరికీ తెలిసినదే. ముఖ్యంగా ఈ బ్రిటిష్ ప్రతినిధి క్రోధం భారతదేశంపై ప్రసరించింది. దీనినిబట్టే ఒక విషయం స్పష్టపడుతోంది.

ఆసియాదేశాల ఐకమత్యానికి యూరోపియన్ దేశాలు జంకుతున్నాయి. అగ్రరాజ్యాల దుర్నీతికి "చిన్న" దేశాల ఐకమత్యం ఒక్కటే మందు. అగ్రరాజ్యాలమధ్య వైషమ్యాలు పెరిగి యుద్ధమే సంభవిస్తే అగ్రరాజ్యాలకంటె చిన్నరాజ్యాలకే ప్రమాదం అధికం. చిన్నరాజ్యాలను తమ ఇష్టంవచ్చినట్లు తిప్పుతూ అగ్రరాజ్యాలు తమ రాజకీయచదరంగంలో వినియోగించుకుంటున్నాయి. ఈ చిన్నరాజ్యాలన్నీ ఏకమై నిలిస్తే బ్రిటిష్ ఫ్రెంచి కుతంత్రాలను గాని, అమెరికన్ రష్యన్ విరోధాలనుగాని ఎదిరించి నిలవవచ్చును. అలా నిలిచినప్పుడు ప్రపంచంలో శాంతి సుస్థిరమవడానికి అవకాశాలుంటాయి. ఈవిషయాన్ని గ్రహించిన భారతదేశం ఆ లక్ష్యాన్ని సాధించగలదనే భయం అగ్రరాజ్యాలకుంది. భారతదేశం చేసిన కృషి ఐక్యరాజ్యసమితిలో కనీసం ఒక్క పర్యాయమైనా ఫలించింది. భారతదేశం అనుసరిస్తున్న విదేశాంగనీతి ఆసియా ఆఫ్రికాఖండాలలోని దేశాల స్వాతంత్ర్యసిద్ధికి తోడ్పడుతున్నది. దీనికి ఇండొనీషియా, లిబియాలే తార్కాణాలు.

ప్రపంచ ఆహారసమస్య:

ఐక్యరాజ్యసమితివారి ప్రపంచ ఆహార, వ్యావసాయికసంఘ సమావేశం వాషింగ్‌టన్‌లో జరుగుతోంది. ప్రపంచ వాణిజ్యవిధానం ప్రపంచ ఆర్థికపరిస్థితుల కనుగుణంగా లేదని చెప్పటానికీ, ఈ సమస్యల పరిష్కారాన్ని ఏయేదేశాల వ్యాపారవిధానాలు ఏరీతిగా నిరోధిస్తున్నాయో నిరూపించడానికీ ఈ ప్రపంచ ఆహారవిషయసంఘ సమావేశం తోడ్పడుతుంది.

ప్రపంచ ఆహారవిషయసంఘం ఆసియాపట్ల ఉదాసీనభావంతో ప్రవర్తిస్తోందని అందరికీ తెలిసిన విషయమే. కాని ప్రపంచ ఆహార సమస్యలను సరిగా అవగాహన చేసుకోడానికి ఈ సంఘం సహాయపడింది.

ప్రపంచంలో కొన్ని దేశాలలో ఆహారం అత్యధికంగా పండుతోంది. ఆ దేశాల్లో మిగులు ఆహారాన్ని ఏవిధంగా అమ్మాలో నిర్ణయించుకోలేక తికమకలు పడుతున్నారు. అమ్ముకోలేనందువల్ల మిగిలిపోయిన ఆహారం పాడైపోతోంది. వ్యవసాయదారులకు నష్టం కలుగుతోంది. వీనిలో కొన్ని దేశాల్లో ధాన్యాల ధరలు పడిపోవటం వల్ల రైతులకు వస్తున్న నష్టాన్ని ప్రభుత్వాలు భరిస్తున్నాయి. అంటే రైతులకు రావలసిన నష్టాన్ని ప్రభుత్వం భరిస్తోంది. ఆహారోత్పత్తి తగ్గిపోకుండా ఉండాలంటే ధాన్యానికి కనీసపు ధరల్ని ప్రభుత్వం గారంటీ ఇవ్వక తప్పదు. ఈ నష్టం మరీ అధికమాతున్నందువల్ల ఈదేశాలు ఆహారోత్పత్తిని తగ్గింపు చెయ్యడానికి పూనుకుంటున్నాయి. అమెరికా (యునైటెడ్ స్టేట్స్) ఈసంవత్సరంకంటె వచ్చే సంవత్సరం నూరింట 17 వంతులు తగ్గింపు చెయ్యడానికి నిశ్చయించింది. కెనడా ఆస్ట్రేలియా మొదలైన మరికొన్ని ఆహారంమిగులు దేశాలుకూడా ఇటువంటివే చర్యలు తీసుకుంటున్నాయి. పోగా మరికొన్ని దేశాల్లో ఆహారం బొత్తిగా కొరతగా ఉంది. సయాం, బర్మా పాకిస్తాన్‌లు మినహా మిగతా ఆసియాదేశాలన్నీ ఆహారాన్ని దిగుమతి చేసుకోవలసిందే. యూరప్ పారిశ్రామికోత్పత్తి ఎగుమతిచేసి అమెరికా, కెనడా, దక్షిణమెరికా, ఆస్ట్రేలియాలనుంచి ఆహారాన్ని దిగుమతిచేసుకుంటుంది. ఆసియా దేశాలు ముడిపదార్థాల ఎగుమతిచేసి ఆహారాన్ని దిగుమతిచేసుకుంటాయి. కాని ఈవ్యాపారంలో ఆహారందిగుమతికి ఈదేశాల ఎగుమతులు చాలవు. ప్రపంచంలో ఆహారాన్ని దిగుమతి చేసుకునేదేశాలు ఎగుమతిచేసే దేశాలకు ఋణపడుతున్నాయి.

ఒక వంక కొన్ని దేశాలు ఆహారం చాలక కరువులో కొట్టుమిట్లాడుతుంటే ఇతరదేశాలు ఆహారం మిగిలిపోయి సముద్రంలో పోస్తున్నాయి. వృద్ధిలో ఉన్న దేశాల ఆహారాన్ని కాటకంలోఉన్న దేశాలకు లభింపచెయ్యడానికి ప్రపంచ ఆహారవిషయసంఘం ఒక ప్రతిపాదన చేసింది. ప్రపంచఆహారనిలయం ఒకటి స్థాపించి మిగులు దేశాలన్నీ సప్లై చెయ్యగలిగినంత ఆహారాన్ని ఈనిలయానికివ్వాలనీ, ఆహారం కావలసిన దేశాలు ఈనిలయంవద్ద కొనడానికి సౌకర్యమివ్వాలనీ సంఘపూర్వాధిపతి సర్ జాన్ బోయిడ్ ప్రతిపాదించాడు. ఈప్రతిపాదన వాషింగ్‌టన్‌సమావేశంలో చర్చించబడింది. అమెరికా కెనడా మొదలైన దేశాలీ ప్రతిపాదనను అంగీకరించలేదు. దీనివల్ల ఆ దేశాలు ధాన్యాన్ని కొద్దిగా తక్కువ ధరలకు అమ్మవలసివస్తుంది. కావలసిన దేశాలు వ్యాపారరీత్యా అమెరికా మొదలైన దేశాలపైన ఆధారపడనక్కరలేకుండా, మారకం చలామణీల బాధలు లేకుండా తమతమ చలామణి ద్రవ్యాలతోనే ఆహారాన్ని కొనుక్కోడానికి వీలవుతుంది. ఈ ప్రతిపాదనప్రకారం అమెరికా మొదలైనదేశాలు మిగులు ఆహారాన్ని భారతదేశం మొదలైన కొరవదేశాలకు పంపి నిలవచెయ్యడానికి అంగీకరించాలి. ఈ కారణాలవల్ల అమెరికా మొదలైన దేశాలు ఈ ప్రతిపాదనను నిరాకరించాయి.

దీనినిబట్టే అమెరికా మొదలైన దేశాలు ప్రపంచఆర్థిక సమస్యల పరిష్కారంకంటె తమ వ్యాపారబలాధిక్యతను పెంపొందించుకోవడం ప్రధానంగా పరిగణిస్తున్నాయని స్పష్టపడుతోంది.

వాషింగ్‌టన్‌సమావేశంలో భారతదేశం ఈప్రతిపాదనను బలపరిచింది. సమావేశప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ ఆహారసమస్య పరిష్కారానికి అమెరికా తోడ్పడగలదన్నాడు. కాని వాస్తవంలో తదనుగుణంగా ప్రవర్తించడంలేదు. ద్రవ్యమారకపు సమస్య పరిష్కారమైతేగాని ఇట్టి ప్రతిపాదనలను అంగీకరించరని ఆస్ట్రేలియన్ ప్రతినిధి స్పష్టంగా చెప్పేశాడు. వివిధ దేశాల ద్రవ్యాలు సులువుగా కొనుబడికి తేగలిగినట్లయితేనే ఏప్రతిపాదనగాని ఆచరణలో పెట్టడానికి సాధ్యమవుతుందని ఈజిప్టుప్రతినిధి అన్నాడు.

ఆహారపదార్థాల వ్యాపారాన్ని ఇతర వస్తువుల వ్యాపారంనుంచి విడగొట్టడంవల్ల అమెరికావంటి దేశాలకు చాలా నష్టంవస్తుందని అమెరికన్ ప్రతినిధి అన్నాడు. ఇంక ప్రెసిడెంట్ ట్రూమన్ వాగ్దానాని కర్థ మేమిటో, ఎవరికీ బోధపడదు. వాషింగ్‌టన్‌సమావేశంలో అమెరికా కేవలం వ్యాపారదృష్టితోనే వ్యవహరించింది. పశ్చిమ యూరప్‌విషయంలో పక్షపాతబుద్ధితో ప్రవర్తించడం, ఆసియా దేశాలకు వచ్చేసరికి లాభాపేక్ష, వ్యాపారబలవ్యాప్తి దురాశ మాత్రమే గోచరిస్తున్నాయి.

ఆహారసమస్యను పరిష్కరించుకోడానికి బ్రిటన్ అర్జెంటినాతో వస్తుమారకవిధానం అవలంబించింది. ప్రపంచ రాజకీయ తంత్రాలలో మైత్రి పాటిస్తున్న దేశాలు తమలోతాము వస్తుమారకాన్ని అనుసరిస్తూ, పైపైకి మాత్రం అన్నిదేశాలకూ సహాయపడుతున్నట్లు సహకారం నెరపుతున్నట్లు నటిస్తున్నాయి. బ్రిటన్ తమ పౌనుమారకంవిలువ తగ్గించడానికిముందే ఆహారంవిషయంలో జాగ్రత్తపడింది. 1949 నవంబరులో బ్రిటన్ నిలవచేసుకున్న మొత్తం 1948 నవంబరులో నిలవచేసుకున్నదానికంటె నూరు మిలియన్ పౌనుల విలువగల ఆహారం అధికంగా ఉంది

పాశ్చాత్యదేశాలు ఇటువంటి కూటనీతిని అవలంబిస్తూ, ఇంకా ఆర్థికాభివృద్ధికి తమ సహాయంపైన నమ్మకం పెట్టుకోవచ్చునని, (ట్రూమన్‌వలె) చెప్పడంవల్ల ఫలితం ఏమి కలుగుతుందో వేరే చెప్పనక్కరలేదు.

(సూర్యం)

ఆదాయంమించిన ఖర్చు

(9-వ పేజీ తరువాయి)

చేయటానికో అనుకొంటే, అది డబ్బున్నప్పుడు చేయవలసిన పనిగాని ఇప్పటి మాట కాదు.

ఇంతకన్నా పూర్వంనుంచే ఉంటూన్న పెద్ద విశ్వవిద్యాలయాలు, విశ్వవిద్యాలయపు చదువులకు ప్రమాణాలు ఇంతకన్నా ఋజువుగా ఏర్పరిచే ఉంచాయి. కాని ఎందుకనో ఢిల్లీలోని అధికారులుమాత్రం, తక్కిన విశ్వవిద్యాలయాలంటే అసూయతో, పనిచేస్తున్నట్లు అనిపిస్తోంది.

"పబ్లికువర్క్సు, గనులు, విద్యుచ్ఛక్తిశాఖా మంత్రివర్గాన్ని చూసుకొందాం. 1939 లో ఈ శాఖలో ఒక చీఫ్ ఇంజనీయరూ, 4 మండలాలు, 17 ఉపభాగాలుగా ఉండేవి. 1948-49 లో, ముగ్గురు చీఫ్ ఇంజనీయర్లూ, 20 మండలాలూ, 83 ఉపభాగాలూ ఉన్నాయి. 1938-39 లో ఈ కేంద్రశాఖ ఎస్టాబ్లిష్‌మెంటు ఖర్చులు 18.96 లక్షల రూపాయలు. 1948-49 లో ఈ ఎస్టాబ్లిష్‌మెంటు ఖర్చు 151 లక్షల రూపాయలకు పెరిగింది.

జీవనవ్యయప్రమాణము 1939 కీ ఇప్పటికీ మూడు రెట్లు పెరిగింది. కాని కేంద్రపబ్లిక్ వర్క్సుశాఖ ఎస్టాబ్లిష్‌మెంటు నూటికి ఎనిమిది వందలవరకూ పెరిగింది. కొత్త ఉద్యోగులను వేసుకొన్నాం. వాళ్లకు ఇళ్లు కావాలి. వివిధ మంత్రాంగశాఖలలో పరిశోధకులను నిపుణులను నియమించాము. వాళ్లకు వసతులు కావాలి. ప్రభుత్వపరిశ్రమలు పెరిగాయి. వాట్లకు డబ్బు కావాలి. ఇళ్లు కావాలి. ఉద్యోగులు కావాలి. ఇవన్నీ ఎల్లా సమకూడ్తాయో మంత్రివర్గమంతా ఒకసారి కూర్చుని సింహావలోకనం చేసుకోవలసి ఉంది.

ఇంకో చిన్న గమ్మత్తు కనబడుతుంది. రాష్ట్రాలలో, కేంద్రము జరిపే గృహనిర్మాణాదికార్యకరామతులకు కేంద్రము, రాష్ట్ర పి. డబ్ల్యు. డి. ఉద్యోగులను ఉపయోగించదు. ఈ పొరపు ఎందుకో అర్థమవదు. రెండుశాఖలు సహోదరులలాగా ప్రవర్తించాలని నా సూచన.

చాలా శాఖలలో కాగితాలమీద ప్రణాళికలు, ఊహాగానాలు చేసేయటంతో పని దానంత అదే అవుతుందన్న అభిప్రాయం ప్రబలింది. జాతీయసౌభాగ్యం పెంపొందించటానికి బదులు ఇల్లా ఉద్యోగులు ఎవరికి వారు ఖర్చులు పెంచేసి, పరస్పరం ఈర్ష్యావిద్వేషాలు పెంచుకొంటూ, దేశసౌభాగ్యాన్ని మరింత చితకగొట్టుతున్నారు. యుద్ధకాలంలో తాత్కాలిక ఉద్యోగులంతా నేడు ప్రభుత్వనిపుణోద్యోగులై కూర్చున్నారు. వీళ్ల-ప్రణాళికను ప్రశ్నించే నాథుడే కనబడడు"

ఆర్థికసంఘంవారి నివేదికను ప్రభుత్వం బుట్ట దాఖలాచేసింది. 1949/50 బడ్జెటులో నూటికి ఐదువంతులూ, 1950/51 బడ్జెటులో నూటికి పదివంతులూ, కత్తిరింపుమాత్రం చేసి ఊరుకొంది. శ్రీ దాసుగారు చెప్పినట్లు వ్యవహారిస్తేతప్ప, జీతాలలో ఐదూ, పదీ తగ్గించినంతమాత్రంచేత ప్రభుత్వం ఏప్రయోజనమూ సాధించలేదు.

రుద్రమదేవి

(6 వ పేజీ తరువాయి)

అప్పటికి కొంతకాలమునుండి యీ వృత్తి విధిలేక యంగీకరింపసాగిరి. అట్టివారు ఆ వృత్తిలో చిరకాలానుభవము గల జైనకరణముల ప్రతిభతో సరితూగలేక వారికి ఒదిగి యుండవలసివచ్చుచుండెను.

అన్నమంత్రిదివాణములో వ్యవహారములు చూచువా రందరుగూడ జైనకరణములే. అతడు విజయదశమిలోపల తన మండలములెక్కలును వ్యవహారములును చక్రవర్తికి విధిగా అప్పగింపవలసియుండెను. చవితినాటి సాయంత్ర మాతడు రాజధానికి వచ్చి ముందు గణపతిదేవసార్వభౌముల దర్శించి తన యనామయవార్త తెలిపి వారి కుశలవార్త యెరింగెను.

పంచమినాడు ఉదయమున అన్నమంత్రిదివాణము మోసాలపై గడియారమున నాలుగు గడియలు కొట్టిరి. అంతకు ముందుగనే యక్కడ మూగుచుండవలసిన కరణములలో నొక్కడును ఆనాడు కనపడలేదు. అది అదృష్టపూర్వము. ఊహింపరానిది! అందులో నాలస్యముగా వచ్చిన తాను తన ప్రధానకరణమునకు అవసరముగా అప్పగించి సిద్ధము చేయింపవలసిన వ్యవహారము లెన్నియో పేరుకొనియున్నవి.

కరణములు సకాలమున రాకపోగా తాను రాజధానీనగరమున బహుకాలము లేని యవకాశము పురస్కరించుకొని వీ రందరు నలసత కలవాటుపడినారా? ఆ తలపుతోడనే యాతని మనస్సులో కోప మంకురించెను. దాని నడచుకొనుటయే కష్టముగా నుండెను. కాని ఒక్కడును రా డేమి? ఈనాడు ఆటవిడుపా? కాదే! ప్రధానకరణము నాగాచారి వినయవిధేయతలు కలవాడే! ఎన్నడు కాలాతిక్రమణము చేసిగాని యలసత అశ్రద్ధ చూపిగాని యెరుగడే!—పాపము జబ్బుగా నున్నాడేమో!

బవిరినీ డను నాశ్వికభటుని బిలిపించి నాగాచారియింటికి బోయి శీఘ్రముగా బిలిచికొని రమ్మని యాతని బంపెను. వాడు శీఘ్రముగా తిరిగి వచ్చి యాత డింటి నుండి యుదయవేళకే బయలువెడలియుండె నను వార్త తెచ్చెను.

అది విని యా మహామంత్రీశ్వరుడు నిర్ఘాంతపోయెను. ఒక్క కరణముకూడ రాలేదు. పరిచారకులు వచ్చి ఎదుటికి రా సాహసింపక చుట్టుపట్టుల తారట లాడుచుండిరి. ఒకడు ధైర్యముచేసి స్నానముచేయ రమ్మని పిలిచినను నాగాచారికి తొందరపను లప్పగించి వత్తు నని కదలలేదు. దేహము నలంకరింపలేదు.

అంత యున్నతపదవిలో నున్నను అన్నమంత్రికి వయస్సు పాతికేండ్లేని నున్నవో లేవో. పసితనమునుండియు నాతడు చూపుచు వచ్చిన యసాధారణమేధచే నాతని కా చిన్నప్రాయముననే వంశక్రమాగత మగు పదవి లభించెను. చామనచాయ శరీరము, ఉన్నతమైన ఫాలనాసములు, చిక్కని మీసములు, సింహమునకువలె పచ్చని కన్నులు చిత్రమైన పురుషసింహాకార మాతనికి గూర్చుచుండెను.

అన్నమంత్రికి చిరాకు ఎక్కువైపోయెను. ఎంత మేధావి యైనను వయస్సుతో గాని నిబ్బరము అలవడునా? మేధావి యైనవానికి చిన్నవయసున కలుగు చిరాకు ఇతరుల చిరాకునకు శతగుణముగా నుండును. అట్టి శతగుణ మగు చిరాకే యాతని కప్పుడు కలిగెను. ఆ చిరాకు వృద్ధి యగుచుండెను. ఏమి చేయగలడు? ఒక్క కరణమును రాలేదు! చిరాకు కాదు. అది కోపమే యయ్యెను. అది క్షణక్షణములోపల రేగసాగెను. కాని ఎవరిమీద? అగ్నివలె ప్రట్టి చెలరేగు కోప మంత యాలోచించునా? అన్నమంత్రి యిప్పుడు కేవలము క్రోధావతారమై కాన్పించెను. ఆతని పచ్చని కన్నులలో ఎర్రని రేఖలు చేరి యచ్చట ఏదో అపూర్వమగు ప్రళయాగ్ని పుట్టినట్లే చూచువారికి భయంకరముగా నుండెను. పరిచారకులు ఎదుట బడ సాహసింపక మూలమూలల నక్కి యడగి యుండిరి.

సరిగా నాతని కోపము మహోజ్వలమై ప్రజ్వలించుచున్న సమయమున కొక సోమయాజి యన్నులప్పుడే వ్రేల్చి జపాదికము పూర్తిచేసి వచ్చిన యలికభస్మాది చిహ్నములతో ఇద్దరఛాత్రుల కైదండతో అన్నమంత్రియెదుట సాక్షాత్కరించెను.

ఆ సోమయాజి నాలుగుమూరల ప్రమాణము కల దీర్ఘకాయుడు. శరీరవర్ణము కొంచెము నలుపుతిరిగిన చామనచాయ గలిగి మనోజ్ఞముగా నున్నది. కాయబారు శరీర మైనందున పష్టిపూర్తి యైన యాయనదేహము ఏ కొంచముగనో వంగియున్నది. అంత వయస్సున్నను ఆ పురుషుని దంతముల స్వచ్ఛకాంతి గాని పటుత్వము గాని ఏ మాత్రము తరిగినట్లు లేదు. నిరంతరముగా తాళీదళసంచారము చేయుటచే గాబోలు దృష్టిమాత్ర మించుక మందగించి కనురెప్పల మాటిమాటికి నల్లార్పజేయుచుండెను. బాల్యమునుండి స్రుక్స్రువాదులు ప్రయోగించుచున్నందుననో గాక ఖడ్గాదిశస్త్రసాధనలు చేసియుండుటచేతనో ఆ మఖిచేతులు కాయలువారియుండెను. ఆయన చెవులకు ధరించిన చిన్న రత్నకుండలములు ముఖముపై క్రొత్త వెన్నెలలు పరపుచుండెను.

ఆయనవెంట వచ్చిన శిష్యులలో పెద్దవానికి ముప్పదైదేం డ్లుండును. అతడు చక్కగా దేహపరిశ్రమ చేసినందున కండలుతిరిగి దృఢమై స్థూల మగు దేహము కలవాడు. అందుచే నాతడు విద్యాదికములలోకంటె మల్లయుద్ధాదికములలో నెక్కువ ప్రవీణుడా యనిపించుచున్నది.

రెండవ శిష్యుడు బ్రహ్మచారి. అతనికి పదునారేండ్లు దాటలేదు. బంగారు వంటి మైచాయ. ముఖము పాలుగారుచున్నది. అతని మూర్తి శాంతమై బ్రహ్మతేజస్సు పొంగారుచున్నది.

ఆహవనీయ దక్షిణాగ్నుల మధ్యస్థమైన గార్హపత్యాగ్నివలె నా సోమయాజి అన్నమంత్రిదివాణములోనికి వచ్చుచుండగా దౌవారికుడు గాని ఇతరభటులు గాని వారించుటగాని ఆయనరాక అన్నయకు నివేదించుటగాని చేయలేదు. అందరు మంత్రముగ్ధులవలెనే నిలిచి యుండిరి. ధనుర్ముక్తమైన శరమువలెనే ఆ సోమయాజి సరాసరి నిశ్చలగమనముతో లోనికి వచ్చి యన్నమంత్రిని సమీపించెను.

కోపదుర్నిరీక్ష్యుడై యున్న యన్నమంత్రికి ఆ సోమయాజిదర్శనము కలలో నుండి లేపిన ట్లయ్యెను. అకస్మికముగా నాతని ముఖమందలి కోపజ్వాల లదృశ్యమై ప్రసన్న మయ్యెను. కేవలము అగ్నిభట్టారకుడే మూర్తీభవించి యీ రూపమున ప్రత్యక్ష మయ్యెనా యను భావ మాతని కుదయించినది. కారణజన్ము లైనవారికి క్రోధాదులుకూడ లీలలే గదా!

అన్నమంత్రి యాసనమునుండి లేచి సోమయాజికి వందన మాచరించి "తమ నామధేయము?" అని ప్రశ్నించెను.

"నన్ను తిక్కనసోమయాజి యందురు!" అని యా సోమయాజి క్లుప్తముగా ప్రత్యుత్తర మిచ్చెను.

★ గ్రంథ పరిచయం ★

మద్రాసురాష్ట్రంలో వ్యావసాయిక సమస్యలు: గ్రంథకర్త శ్రీ. వి. వి. శాయనగారు. వెల రు 12-8-0. ప్రతులు దొరుకుచోటు ది బిజినెస్ వీక్ ప్రెస్, 173 లాయిడ్స్‌రోడ్, మద్రాసు.

గోదావరీతీరవాసులైన గ్రంథకర్త బొంబాయి విశ్వవిద్యాలయంలో వ్యావసాయిక ఆర్థికశాఖ అధ్యాపకులుగా ఉన్నారు. బొంబాయి విశ్వవిద్యాలయ డాక్టరేట్ పట్టాకోసం శ్రీ శాయనగారిచేర చించబడిన పరిశీలనాపత్రం గ్రంథరూపంలో ఇంగ్లీషులోనే ప్రచురించబడింది.

గ్రంథకర్త మద్రాసురాష్ట్రంలోని భూమిశిస్తువిధానాలు, కౌలు, కమతాలు అన్నీ సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా సర్కారు జిల్లాలను పరిశీలించి, అక్కడ అమలులోఉన్న వివిధశిస్తువిధానాల్నీ కౌలుపాలుపద్ధతుల్నీ సమగ్రంగా ఈ గ్రంథంలో వివరించారు.

లార్డ్ కారన్వాలీస్‌నాటి జమీందారీ విధానంనుండి 1820 లో అమలుజరుపబడిన రయిత్వారీ విధానంవరకూ మన రాష్ట్రంలో రూపొంది అమల్లోఉన్న వివిధపద్ధతు లన్నిటినీ చారిత్రకదృష్టితోనూ, పరిణామదృష్టితోనూ గ్రంథకర్త విశదీకరించారు.

నేటి ఆహార స్వయంసమృద్ధిసాధనసమస్యను నిర్ణయించడానికి అయోమయంగా ఉన్న ప్రస్తుత భూమిశిస్తువిధానాన్ని క్రోడీకరించి, సంస్కరించి వ్యవసాయాభివృద్ధికి దోహద మివ్వాలని అనేకమంది అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత విధానాలు వ్యవసాయాభివృద్ధికి దోహద మివ్వకపోగా ఆటంకా లేర్పరుస్తున్నాయని వీరి అభిప్రాయం. అలాకాక కర్షకులకూ ప్రభుత్వానికీ మధ్య భూమిపై యజమానులు వేరే ఉండడంవల్ల కొన్ని ప్రయోజనా లున్నాయనీ, ఈ మధ్యవర్తులే లేకపోతే వ్యవసాయపు పెట్టుబడికీ, భూమిమరమ్మతులకీ వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలకీ అందయే పోయిన ట్లవుతుందని మరొక తరహావారి అభిప్రాయం. రెండోపక్షం వాదబలాన్ని పరిశీలించాలంటే విశేషపరిశోధన, కృషి అవసరం. బ్రిటిష్‌రాజరికంలో ప్రభుత్వ పరిశీలకసంఘాలుగాని, ప్రస్తుత కాంగ్రెస్ వ్యావసాయిక సంస్కరణల పరిశీలక సంఘంగాని ఈ విషయాన్ని సమగ్రంగా పరిశీలించినట్లు కానరాదు.

ఇట్టి విషయాలలో రాజకీయవాదుల దృష్టి పక్షపాతరహితంగా ఉంటుందని ఆశించడం పొరపాటవుతుంది. కేవల విషయపరిజ్ఞానం కోసమే పరిశీలించడం అవసరమౌతుంది. కాని అది లభించడం అరుదు. శ్రీ శాయనగారు ఇట్టి విషయపరిజ్ఞానదృష్టితోనే పరిశోధించడానికి కృషిచేశారని చెప్పాలి. తత్ఫలితమే ఈ గ్రంథం. శిస్తువిధానాలే కాక గ్రంథంలో వ్యావసాయిక సమస్యకు సంబంధించిన అనేక ఇతర ముఖ్య విషయాలు పరిశీలించబడినాయి. వ్యవసాయ కూలీల సమస్య, భూమి అన్యాక్రాంతం, రైతుల ఋణబాధ, సహకారపరపతి సంస్థలు, కౌలు పద్ధతులు, మొదలైనవి.

మనరాష్ట్రంలో సాగుచేయబడుతున్న భూమి పరిమితి, వ్యవసాయంపై ఆధారపడుతున్న జనాభా మొదలైన వివరాలు ఆరంభప్రకరణాలలో వివరించబడినాయి. రైత్వారీ, జమీందారీ ఈనాందారీ మొదలైన విధానాలక్రింద ఎంతెంత భూమిఉందో వివరించబడింది. వివిధ శిస్తువిధానాలు విశదపరచబడినాయి. వీనిలో జమీందారీ విధానంగురించీ, మనదేశ ఆర్థికవ్యవస్థలో ఈవిధానంవల్ల వచ్చిన మార్పుల్ని గురించీ గ్రంథకర్త విపులంగా చర్చించారు. రైత్వారీ భూముల పంపకాలు, అన్యాక్రాంతం, తనఖా రైతుల ఋణాలు ప్రత్యేక ప్రకరణాల్లో చర్చించబడినాయి. సహకార పరపతిసంఘాలు మనరాష్ట్ర వ్యవసాయవ్యవస్థలో నిర్వహించిన పాత్ర విపులంగా చర్చించబడింది. సహకారోద్యమకారు లెంత కృషిచేసినా వాస్తవానికి మనరాష్ట్రంలో సహకారపరపతివల్ల వ్యవసాయాభివృద్ధికి కలిగిన దోహదం బహు స్వల్పమని గ్రంథకర్త చెప్పారు. సహకారవిధానం విఫలం కావడానికిగల హేతువులు వివరించి, స్వల్పమార్పులతో చురుకైన వారి నాయకత్వంకింద ఈ పరపతిసంస్థలు అపారసేవ చెయ్యడానికి అవకాశం ఉందన్నారు.

ఎనిమిది తొమ్మిది అధ్యాయాల్లో అమరకం కౌలు, పాలుమొదలైన పద్ధతులు, రైతులు, యజమానులమధ్య వ్యవహారరీతులు, వ్యవసాయ కూలీల స్థితిగతులు మొదలైనవి చర్చించారు.

వ్యావసాయిక సంస్కరణలనుగురించిన ఆఖరు అధ్యాయంలో విదేశాలలో సంస్కరణల రీతుల్ని క్లుప్తంగా వివరించారు. మనదేశంలో సమస్యను గురించి వివిధపరిశీలకుల అభిప్రాయాలను తెలిపారు. ప్రస్తుతవిధానాల్ని మొదలంట తుడిచిపెట్టి ఒక్కమారుగా నూతనవ్యవస్థ నిర్మించడాన్ని గ్రంథకర్త ఆమోదించలేదు. క్రమక్రమంగా సంస్కరణలు తేవాలని సూచించారు. పరిష్కరించవలసిన ప్రధానసమస్య కర్షకుల దుర్భరదారిద్ర్యం. ఈ దారిద్ర్యాన్ని తొలగించాలంటే సామాన్యసంస్కరణలు చాలవు. కాని హింస, అన్యాయాలకు తావివ్వకుండా శాంతియుతంగానే పెద్ద సంస్కరణలు అమలు జరపవచ్చునని గ్రంథకర్తఅభిప్రాయం.


కాని ఈ సమస్య వెంటనే పరిష్కారం కావడం ఎంత అవసరమో, సంస్కరణలంటే చేయవలసిన, చేయతగిన మార్పు లేవో వాని ప్రాధాన్యాన్ని గ్రంథకర్త వాస్తవికదృష్టితో చిత్రించారు. ఇప్పటికే కల్లోలమయమైన గ్రామ్యవ్యవస్థను నూతనపరిస్థితుల కనుకూలంగా పునర్నిర్మించడానికి వెంటనే పూనుకోకపోతే, దేశీయార్థిక వ్యవస్థకు మొదటికే మోసం వస్తుందన్న విషయం సంస్కర్త లెవరూ మరిచిపోరానిది.

ఇట్టి దేశీయసమస్యలపరిశీలనను మన విశ్వవిద్యాలయం కూడా ప్రోత్సహించడం చాలా అవసరమని తోచకమానదు. నేటి ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమస్యలను రాజకీయవాదాలు, తత్వాలు పక్షపాతదృష్టిదోషం తగలకుండా పరిశీలించవలసిన అగత్యం ఎంతైనా ఉంది. ఈ విషయాల పరిశోధనను ప్రోత్సహించి దేశ పురోభివృద్ధికి విశ్వవిద్యాలయాలు తోడ్పడ్డం ఎంతో అవసరం.


ఈ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించి ముద్రిస్తే ఆంధ్రదేశానికి అత్యంతప్రయోజనకారి కాగలదు. అయితే ఈ 332 పుటల గ్రంథం వెల రు 12-8-0 కు నిర్ణయించడంవల్ల అవసరమైనవారికి అందుబాటుకి రాదేమో సందేహం.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7 Thambu Chetty St., G. T. Madras


★ వార్తాచిత్రాలు ★



లండను విశ్వవిద్యాలయంలోని మాక్మిలన్ మందిరంలో 'ఇండియాలీగ్'వారు ప్రధాని నెహ్రూ గౌరవార్థం విందు చేశారు. ఆ సందర్భంలో రోజ్ మైలల్ అనే 6 సంవత్సరాల బాలిక తన పుస్తకంలో చేవ్రాలుచేయవలసిందిగా ప్రధానిని కోరింది. ఆదరంతో ఆ బాలిక ముచ్చట తీరుస్తున్న ప్రధాని నెహ్రూ.



రాజమహేంద్రవరంలో ఈ.12-వ తేదీన జరిగిన నన్నయజయంతి సందర్భపు ఫోటో. కూర్చున్నవారు కందుమర్తి పార్థసారధి, ముక్కపల్లి సూర్యనారాయణ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగార్లు. నుంచున్నవారు: రావులపర్తి సూర్యనారాయణ, అద్దేపల్లి నాగేశ్వరరావు, భమిడిపాటి కామేశ్వరరావుగార్లు.




అంబాలా వైమానికశిక్షణ కేంద్రములో
నావికులు శిక్షణ పొందుట.



ప్రధానామాత్యుడు పండితనెహ్రూ అమెరికాపర్యటనలో మాడిసన్‌లోని జనరల్ఆస్పత్రి వీక్షించినప్పుడు చికిత్సపొందుతున్న ఒక బాలికతో సంభాషిస్తున్న దృశ్యం.



అమెరికా సముద్రగర్భ పరిశోధకులు ఓటిస్ బార్టన్. ఈయన 5 అడుగులవ్యాసంగల ఉక్కు గుండులో వుండి కాలిఫోర్నియా సముద్రప్రాంతంలో 4500 అడుగులలోతుకు దిగారు. సముద్రగర్భంలో ఇంత లోతుకు చొచ్చుకుపోయినవారు వీరుతప్ప మరొకరు లేరు.


2 వ వారం
దిగ్విజయంగా సాగుతున్నది
...కృష్ణవేణి...
నాగయ్య, నారాయణరావు
నటించిన
మనదేశం
డైరెక్షన్...ప్రసాద్
స్టూడియో...శోభనాచల.
శ్రీ దుర్గాకళామందిరం-విజయవాడ
వినర్వా -రాజమండ్రి
వినర్వా -విశాఖపట్నం
కేసరి -ఏలూరు
స్వామీజి -భీమవరం
న్యూశాంబే -గుంటూరు
సత్యనారాయణ -తెనాలి
ముబారక్ -బళ్ళారి
క్రౌన్ -కాకినాడ
వినాయక్ -నెల్లూరు
శ్రీ పరమేశ్వరీ -అనకాపల్లి
డిస్ట్రిబ్యూటర్లు:
ఆంధ్ర, సీడెడ్, నైజాం:
రాజ్ శ్రీ పిక్చర్సు లిమిటెడ్,
విజయవాడ, గుంతకల్, సికింద్రాబాద్.
మైసూరు స్టేటు, కూర్గు, దక్షిణ కెనరా:
యశోధర ఫిలిమ్సు కార్పొరేషన్
గాంధినగర్, బెంగుళూరు సిటీ.
ఇతర వివరములకు:
ఎం. ఆర్. ఎ. ప్రొడక్షన్సు, మదరాసు-18
చిత్రప్రియా టాకీ డిస్ట్రిబ్యూటర్సు,
4, జనరల్ పాటర్సు రోడ్డు, మదరాసు-2
Sarma TVS